www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కొత్త సీఈసీగా జ్ఞానేశ్ కుమార్

మోదీ, రాహుల్, షాతో కూడిన ఉన్నతస్థాయి కమిటీ ఎంపిక.. రాష్ట్రపతికి సిఫారసు

నూతన చట్టం ప్రకారం తొలి సీఈసీ నియామకమిదే

సుప్రీం తీర్పొచ్చేదాకా నియామక ప్రక్రియను నిలిపేయాలి: కాంగ్రెస్

2



మంగళవారం | 18-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 304 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి పూర్తి; నక్షత్రం: చిత్త ఉ. 7.35 తదుపరి స్వాతి; వర్జ్యం: మ. 1.54 నుంచి 3.42; దుర్ముహూర్తం: ఉ. 9.01-9.47, రా. 10.20-11.08; అమృతఘడియలు: రా. 12.44-2.32; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.43; సూర్యాస్తమయం: 6.14 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జీబీఎస్ వ్యాప్తిని కట్టడి చేయండి

ప్రజల్లో అవగాహన కల్పించాలి

అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలు

మందులు, ఇంజెక్షన్లు సిద్ధం చేసుకోండి

ఆరోగ్య శాఖ అధికారులకు సీఎం ఆదేశం

అధికారులతో అత్యవసర సమావేశం

వైద్య సేవలు, రోగుల పరిస్థితిపై ఆరా

మందులకు 130 కోట్ల విడుదలకు ఓకే

ఔషధాలు అందుబాటులో: సత్యకుమార్

విశాఖలో జీబీఎస్‌తో వృద్ధురాలి మృతి?

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్)పై అత్యంత అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలకు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. జీబీఎస్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని, లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వాసుపత్రులకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో జీబీఎస్‌తో మరణాలు సంభవిస్తుండటంతో సీఎం నేరుగా రంగంలోకి దిగి పరిస్థితిని సమీక్షించారు. సోమవారం సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో జీబీఎస్‌పై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అకస్మాత్తుగా వ్యాధి ప్రబలడానికి కారణాలు ఏంటి? వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయి? ఏ వయసు

మిగతా 14వ పేజీలో...

ఎన్టీఆర్ జిల్లాలో బర్డ్‌ఫ్లూ!

ఎ.కొండూరులో 3 వేల కోళ్లు మృత్యువాత

నమూనాలు ల్యాబ్‌కు పంపిన అధికారులు

టెక్నాలజీ ఎన్ని రూపాలుగానైనా మారుతుంది. అయితే దేవుడికి ప్రత్యామ్నాయం లేనే లేదు. ఎవరైనా విధిని అనుసరించాల్సిందే. అదే సమయంలో ఎవరి కర్తవ్యం వారు చేయాలి.

- ముఖ్యమంత్రి చంద్రబాబు



ఎక్స్‌పో చైర్మన్ ప్రసాద్ లాడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు. పక్కన గోవా, మహారాష్ట్ర సీఎంలు ప్రమోద్ సావంత్, దేవేంద్ర ఫడణవీస్

ఆలయాలకు ఆగమ స్వేచ్ఛ!

వైదిక వ్యవహారాల్లో సర్కారు జోక్యం ఉండదు

ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయం!

రూ.6 లక్షల కోట్ల 'ఆలయ ఆర్థికం'

అర్చకుల వేతనాలు పెంచాం

ఆలయాల అభివృద్ధికి రూ.138 కోట్లు ఖర్చు చేశాం

గుళ్ల రక్షణకు ప్రత్యేక కమిటీ

'ఆలయాల సదస్సు'లో చంద్రబాబు

ప్రపంచవ్యాప్తంగా 1,500కు పైగా పాలక కమిటీల ప్రతినిధుల రాక

మహారాష్ట్ర, గోవా సీఎంలు కూడా

ఇది వసుధైక కుటుంబ స్ఫూర్తి: ప్రధాని

ఆలయాల అభివృద్ధికి నిధుల కొరత లేదు. వాటిని వినియోగించి భక్తులకు సరైన వసతులు కల్పించడమే దేవుడికి సేవ చేసే ఉత్తమ మార్గం. ఏ ఆలయమైనా, ఏ ప్రభుత్వమైనా భక్తులు ఇచ్చే విరాళాలను వారి మనోభావాలకు అనుగుణంగానే ఖర్చుచేయాల్సి ఉంటుంది.

- ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుపతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): 'దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవేంకటేశ్వరుడి ఆలయం నిర్మించాలనేది నా ఆకాంక్ష. అలాగే హిందువులున్న ప్రతి దేశంలోనూ శ్రీవారి ఆలయం ఉండాలని ఆశిస్తున్నాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రయాగరాజ్‌లో మహాకుంభమేళా జరుగుతున్న తరుణంలోనే తిరుపతిలో ఆలయాల మహాకుంభ్ ప్రారంభమవుతుండడం అదృష్టదాయకమన్నారు. సోమవారం

మిగతా 13వ పేజీలో...

ప్రజలే ఫస్ట్.. ఇదే మా విధానం

ప్రతి స్కీమ్, కార్యక్రమంపై సంతృప్తి కనిపించాలి

అలసత్వంతో ఉంటే బాధ్యులపై చర్యలు

పథకాల అమలుపై జిల్లాలకూ రేటింగ్

వారానికి ఓసారి 4 శాఖలపై సమీక్షిస్తా: సీఎం

14



'సెకీ'తో సంకటం

కరెంటు కొంటే నష్టం.. కొనకుంటే కష్టం!

జగన్ పెట్టిన ఒప్పందపు పితలాటకం

సౌర విద్యుత్ సరఫరాకు సెకీ సంసిద్ధత

రాష్ట్ర ప్రభుత్వానికి వరుస లేఖలు

2,500 మెగావాట్ల పంపిణీకి రెడీ

కరెంటు కొనడానికి సిద్ధమా అని ప్రశ్న

అమలు చేస్తే పాతికేళ్లు జనంపై భారం

రూ.లక్ష కోట్లకుపైగా చెల్లించాలి

రద్దు చేసుకుంటే 2,900 కోట్ల ఫైన్

అదనంగా బేసిక్ కస్టమ్స్ డ్యూటీ

తేల్చుకోలేక ఇంధన శాఖ సతమతం

సీఎంతో చర్చించాక బదులిచ్చే యోచన

వీలింగ్ చార్జీలను మినహాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరే అవకాశం!

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముందూ వెనుక ఆలోచించకుండా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో చేసుకున్న 7,000 మెగావాట్ల విద్యుత్ సరఫరా ఒప్పందం ఇప్పుడు రాష్ట్రప్రభుత్వానికి గుదిబండగా మారనుంది. దీని అమలుపై ఇంధన శాఖ తర్జనభర్జన పడుతోంది. అమలు చేస్తే పాతికేళ్లపాటు రాష్ట్ర ప్రజలపై మోయలేనంత భారం పడుతుంది. ఒప్పందాన్ని రద్దు చేసుకుంటే.. యూనిట్ కూడా కొనకుండానే రూ.2,900 కోట్లకు పైగా అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఎటూ తేల్చుకోలేక అడకత్తెరలో పోకచెక్కలా ఆ శాఖ నలిగిపోతోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రజలపై 25 ఏళ్ల భారం మోపేలా నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం.. ఇప్పుడు రాష్ట్రానికి పెను శాపంగా మారుతోంది. సెకీతో 7,000 మెగావాట్ల విద్యుత్ సరఫరా కోసం ఆయన చేసుకున్న ఒప్పందం కారణంగా ప్రజలపై రూ.లక్ష కోట్లకు పైగానే భారం పడుతుందని ఇంధన రంగ నిపుణులు హెచ్చరించినా ఆయన వినిపించుకోలేదు. వాస్తవానికి ఈ ఒప్పందం చేసుకోకముందు.. దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందా(పీపీఏ)లతో ప్రజలపై విపరీతమైన ఆర్థిక భారం పడుతుందని ఆయన వాదించారు. అధికారంలోకి రాగానే అంతకుముందు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రభుత్వం

మిగతా 12వ పేజీలో...



మహా కుంభమేళాలో లోకేశ్ దంపతులు

కుమారుడితో కలసి త్రివేణి సంగమంలో పుణ్యస్నానం

కాశీ విశ్వేశ్వరుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు

13

కుంభమేళాలో పవిత్ర స్నానమాచరిస్తున్న మంత్రి లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్



13

ఇంటి భోజనం అనుమతించండి

మంచం ఇప్పించండి.. కోర్టును అభ్యర్థించిన వల్లభనేని వంశీ

బెయిల్ కోరుతూ మరో పిటిషన్ దాఖలు.. వంశీని కస్టడీకి ఇవ్వాలన్న పోలీసులు.. నేటికి తదుపరి విచారణ వాయిదా

రెండు గంటలు.. ఏకాంతంగా..

వంశీ కేసులో న్యాయాధికారి సమక్షంలో బాధితుడు సత్యవర్ధన్ వాంగ్మూలం

ఇక చాలు ఆపేద్దాం!



'ప్రార్థనా మందిరాల'పై వెల్లువలా పిటిషన్లు

అసహనం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు

కొత్తవి తీసుకోబోమన్న చీఫ్ జస్టిస్ ఖన్నా

విచారణ ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 : ప్రార్థనా మందిరాల చట్టం-1991పై కుప్పలుతెప్పలుగా దరఖాస్తులు వచ్చిపడుతుండటం పట్ల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అసహనం వ్యక్తం చేశారు. 'చాలు..చాలు. వీటికి ఇక ముగింపు పలుకుదాం' అని స్పష్టం చేశారు. దేశంలోని పలు ప్రార్థనా మందిరాల స్థితినీ, ఆకృతినీ మార్చాలంటూ ఈ దరఖాస్తులు దాఖలవుతున్నాయి. అయితే, ఇకపై కొత్తగా ఈ అంశంపై వచ్చే దరఖాస్తులను తీసుకోబోమని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌ల ద్విసభ్య బెంచ్ వెల్లడించింది. ఇప్పటికే దాఖలైన ఓ దరఖాస్తుకు సంబంధించి మధ్యవర్తిత్వ (రిట్) పిటిషన్‌ను మాత్రం అనుమతిస్తున్నామని తెలిపింది. రామజన్మభూమి వివాదం నేపథ్యంలో

మిగతా 2వ పేజీలో...

ఒక్క సచివాలయ ఉద్యోగినీ

తొలగించం!

అవసరమైతే కొత్తగా నియామకాలు

12

ఉద్యోగుల సమస్యలపై సమీక్షించి నిర్ణయం

ఆయా సంఘాల నేతలతో మంత్రి డోలా

కరువు మండలాల్లో మరో 50 'ఉపాధి' పనిదినాలు

ఒక్కో కుటుంబానికి 150 రోజుల పని

5 జిల్లాల్లోని 54 మండలాల్లో అమలు

14

బాబోయ్ బూతు!

కాసుల కోసం కొందరి కక్కుర్తి

విచ్చల విడిగా అసభ్య, బూతు వీడియోలు అప్‌లోడ్

నెలకు రూ.లక్షల్లో సంపాదన

చట్టాలను పట్టించుకోరు.. ప్రైవసీనీ లెక్కచేయరు

సోషల్ మీడియాలో పెరిగిపోతున్న విచ్చలవిడితనం

ప్రభుత్వాలు అడ్డుకోవచ్చు.. అయినా పట్టించుకోవు!



మనం మామూలుగా మాట్లాడే మాటలనే కొందరు యూట్యూబర్లు పచ్చి బూతులుగా మార్చేస్తారు. రోతగా అనిపించే మాటల్ని మంచినీళ్ల ప్రాయంగా వాడేస్తారు! కాసుల కోసం కక్కుర్తి పడతారు! వారు రూపొందించే వీడియోలు.. కాసులు కురిపించే బంగారు బాతులు!! ద్వంద్వార్థాలు ధ్వనించే థంబ్‌నెయిల్స్‌తో తమ వీడియోలకు వ్యూస్ పెంచుకోవడం వారికి వెన్నతో పెట్టిన విద్య. అశ్లీల సంభాషణలు వినడానికి అంగలార్చే అథమస్థాయి అభిరుచి ఉన్నవారే వారికి మహారాజపోషకులు. అలాంటి వీడియోలతో నెలకు రూ.లక్షల్లో సంపాదిస్తున్న యూట్యూబర్లు తెలుగు రాష్ట్రాల్లో లెక్కకు మిక్కిలిగా ఉన్నారు! చెక్‌పెట్టే చట్టాలున్నా.. పట్టించుకునే వారు లేకపోవడంతో బూతు వీడియోల దందా వేలల్లో షేర్లు.. లక్షల్లో లైకులుగా విరాజిల్లుతోంది!

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి దగ్గరే ఉంటూ.. దోస్తులతో ఎంజాయ్ చేస్తూ.. అక్షరం ముక్క రాకపోయినా.. ఏ మాత్రం కష్టపడకుండా.. కొందరు ప్రతి నెలా రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. అదెలా అనుకుంటున్నారా? యూట్యూబ్ చానళ్ల ద్వారా!! అవును.. యూట్యూబ్ చానల్‌లో బూతు, అశ్లీల వీడియోలు పెట్టేసి.. సబ్‌స్క్రైబర్లను పెంచుకుంటున్నారు. రోజుకో బూతు వీడియో అప్‌లోడ్ చేసేస్తున్నారు. అశ్లీలత ఎంత ఎక్కువగా ఉంటే.. ఆదాయం అంతగా

మిగతా 2వ పేజీలో...



ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ లేకుంటే.. డబుల్ టోల్ బాదుడు

బ్లాక్ లిస్టులో ఉన్నా జరిమానా

2

60 నిమిషాల ముందే రీచార్జ్ చేయాలి

టోల్ దాటాక 10 నిమిషాల్లో రీచార్జ్‌తో జరిమానా మొత్తం వెనక్కి: ఎన్‌పీసీఐ

రోడ్డుపై టేకాఫ్, ల్యాండింగ్ అయ్యే ఎయిర్ అంబులెన్స్

ఐసీఏటీటీతో ఈప్లేన్ కంపెనీ 8,700 కోట్ల డీల్

788 వాహనాల సరఫరాకు ఒప్పందం

త్వరలో దేశంలోని అన్ని జిల్లాల్లో మోహరింపు

2026 చివరికి సేవలు ప్రారంభమయ్యే చాన్స్!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: మనిషి ప్రాణం చాలా విలువైనది! ప్రమాదానికి గురైన సమయంలో లేదా తీవ్ర అనారోగ్యం బారిన పడినప్పుడు వారిని సకాలంలో ఆస్పత్రులకు చేరవేయడంలో అంబులెన్స్‌లది కీలక పాత్ర!! అయితే పట్టణాలు, నగరాల్లో విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ కారణంగా కొన్నిసార్లు అంబులెన్స్‌లు ఆ రద్దీలో చిక్కుకొని, ముందుకు వెళ్లేందుకు దారిలేక.. పలువురు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. దేశంలో ప్రతి ఏడాదీ రోడ్డు ప్రమాదాల్లో వందలాది మంది మరణిస్తున్న నేపథ్యంలో ఆ ఆటంకాలను

మిగతా 2వ పేజీలో...

రోడ్డుపై టేకాఫ్, ల్యాండింగ్ అయ్యే
ఎయిర్ అంబులెన్స్

(మొదటి పేజీ తరువాయి)

అధిగమించేలా ఏ మారుమూల ప్రాంతం నుంచి ఎక్కడికైనా రోడ్డుపై (ఆన్-రోడ్) నిలువుగా టేకాఫ్, ల్యాండింగ్ అయ్యే 'ఎయిర్ అంబులెన్స్'లు త్వరలో దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో అందుబాటులోకి రానున్నాయి. తద్వారా ఈ తరహా అంబులెన్స్‌లను ప్రారంభించిన ప్రపంచంలోని కొద్ది దేశాల జాబితాలో భారత్ చేరనుంది. దీంతో రోగులను, ప్రమాద బాధితులను వాయు మార్గంలో అత్యంత వేగంగా ఆస్పత్రులకు చేరవేసేందుకు అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించి ఐఐటీ మద్రాస్ కేంద్రంగా పనిచేసే 'ఈప్లేన్ కంపెనీ' అనే ఎలక్ట్రిక్ ఎయిర్‌క్రాఫ్ట్ స్టార్టప్ దేశంలో ప్రముఖ ఎయిర్ అంబులెన్స్ సంస్థ ఇంటర్నేషనల్ క్రిటికల్-కేర్ ఎయిర్ ట్రాన్స్‌ఫర్ టీమ్ (ఐసీఏటీటీ)తో 100 కోట్ల డాలర్ల మేర (సుమారు రూ.8,700 కోట్లు) ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం ఆ సంస్థ 788 ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అఫ్ ల్యాండింగ్ (ఈవీటీవోఎల్) ఎయిర్ అంబులెన్స్‌లను సరఫరా చేయనున్నది. వీటిని దేశంలోని ప్రతి జిల్లాలో మోహరించనున్నారు. నమోదిత గ్రహీతల్లో దాదాపు 95 శాతం మంది సకాలంలో అవయవాలు పొందక మరణిస్తున్న నేపథ్యంలో అతి తక్కువ సమయంలో అవయవాలు, ఔషధాలను తరలించేందుకు ఇవి ఉపయుక్తం కానున్నాయి.



2026 చివరకు అందుబాటులోకి!

2026 చివరి త్రైమాసికం నాటికి ఎయిర్ అంబులెన్స్‌ల కార్యకలాపాలు ప్రారంభించాలని ఈప్లేన్ కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. తమ సంస్థకు ఏడాదికి 100 యూనిట్లను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందని కంపెనీ వ్యవస్థాపకుడు సత్య చక్రవర్తి పేర్కొన్నారు. చక్రవర్తి ఐఐటీ మద్రాస్‌లో ప్రొఫెసర్‌గా చేస్తున్నారు. ఎయిర్ అంబులెన్స్‌ల ఒప్పందం పూర్తయినప్పటికీ, ఇతర రకాల ఈవీటీవోఎల్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను తయారు చేసేందుకు, పరీక్షించేందుకు, అవసరమైన సర్టిఫికేషన్ పొందేందుకు మరో 10 కోట్ల డాలర్ల నిధులను ఆయన ఆశిస్తున్నారు. ఇప్పటి వరకు ఈప్లేన్ కంపెనీ 2 కోట్ల డాలర్ల మేర పెట్టుబడిదారుల నుంచి సేకరించింది. ఈప్లేన్ కంపెనీ ప్రస్తుతం వివిధ రకాల భౌగోళిక పరిస్థితులు, జనాభా సాంద్రతల అవసరాల ఆధారంగా మూడు రకాల ఎయిర్ అంబులెన్స్ నమూనాలపై పనిచేస్తోంది. ఈ అంబులెన్స్‌లో ఒక పైలట్, ఒక పారామెడిక్, స్ట్రెచర్ ఉంటాయి. ఇంకా రోగికి అత్యవసర సమయంలో అవసరమైన వైద్య పరికరాలు, మెడికల్ కిట్లు ఇందులో ఉండేలా తయారు చేయనున్నారు. గరిష్ఠంగా గంటకు 200 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉంటుంది. ఒకసారి బ్యాటరీ రీచార్జ్ చేస్తే 100-200 కిలోమీటర్ల దూరంగా వరకు వెళ్లగలవు.

పేపర్ల లీకేజీ వార్తలు నిరాధారం: సీబీఎస్ఈ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: పరీక్షల పేపర్లు లీకయ్యాయంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై సీబీఎస్ఈ స్పష్టత ఇచ్చింది. ఆ ప్రచారం అంతా నిరాధారమని కొట్టిపారేసింది. అసత్య ప్రచారం చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. 10, 12 తరగతుల పేపర్లు లీక్ అయ్యాయంటూ జరుగుతున్న ప్రచారంపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సీబీఎస్ఈ సూచించింది. వదంతులకు కారకులపై చర్యలు తీసుకుంటున్నామని బోర్డు అధికారులు వెల్లడించారు. "వదంతుల ప్రచారంలో విద్యార్థుల పాత్ర ఉంటే.. తదనంతర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుంది. సీబీఎస్ఈ నిబంధనలు, ఐపీసీ సెక్షన్ల ప్రకారం చర్యలు తీసుకుంటాం" అని బోర్డు సీనియర్ అధికారి అన్నారు.

20 బడుల నిర్మాణానికి 2వేల కోట్లు: అదానీ గ్రూప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: దేశవ్యాప్తంగా 20 పాఠశాలలను నిర్మించేందుకు రూ.2వేల కోట్లు విరాళంగా ఇస్తున్నట్టు అదానీ గ్రూప్ సోమవారం ప్రకటించింది. ఇటీవల గౌతమ్ అదానీ చిన్న కుమారుడు జీత్ వివాహం సందర్భంగా అదానీ రూ.10వేల కోట్ల విరాళాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆస్పత్రుల నిర్మాణం కోసం రూ.6వేల కోట్లు, నైపుణ్యాల అభివృద్ధికి మరో రూ.2వేల కోట్లను ఇప్పటికే ప్రకటించింది. తాజాగా పాఠశాలల ఏర్పాటుకు విరాళాన్ని ప్రకటించింది. ఈ మేరకు అదానీ గ్రూప్ దాతృత్వ విభాగమైన అదానీ ఫౌండేషన్.. ప్రైవేటు కే-12 విద్యలో ప్రపంచ అగ్రగామి అయిన జెమ్స్ ఎడ్యుకేషన్‌తో చేతులు కలిపింది. ఈ సంస్థ పాఠశాలలను ఏర్పాటు చేస్తుంది. 2025-26లో మొదటి 'అదానీ జెమ్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్' లఖ్‌నవూలో అందుబాటులోకి రానుంది.

భారత పర్యటనకు ఖతార్ ఎమిర్

» ఎయిర్‌పోర్టుకు వెళ్లి స్వాగతం పలికిన మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీ రెండు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ స్వయంగా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు వెళ్లి ఆయనకు స్వాగతం పలికారు. "నా సోదరుడిని ఆహ్వానించేందుకు విమానాశ్రయానికి వెళ్లాను" అని మోదీ ఎక్స్ వేదికగా తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను షేర్ చేశారు. కాగా, మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీతో ఖతార్ ఎమిర్ తమీమ్ బిన్ హమద్ భేటీ కానున్నారు.

పారాగ్లైడింగ్ ద్వారా పరీక్ష కేంద్రానికి

» మహారాష్ట్రలో విద్యార్థి వినూత్న ఆలోచన



ముంబై, ఫిబ్రవరి 17: ఓవైపు పరీక్షకు సమయం మించిపోతోంది. మరోవైపు రోడ్డుపై ట్రాఫిక్. దాంతో పరీక్ష కేంద్రానికి సమయానికి చేరుకునేందుకు ఓ విద్యార్థి వినూత్న దారిని ఎంచుకున్నాడు. పారాగ్లైడింగ్ ద్వారా పరీక్షాకేంద్రానికి చేరుకున్నాడు. మహారాష్ట్రలో సతారా జిల్లా పసరణి గ్రామానికి చెందిన సమర్థ్ బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పంచగనిలో వారాంతాల్లో ఓ జ్యూస్ షాప్ నడుపుతున్నాడు. ఇటీవల ఓ రోజు సమర్థ్ ఆ షాపులో ఉన్న సమయంలో అతడి స్నేహితులు ఫోన్ చేసి పరీక్షకు సమయమవుతోంది ఎక్కడ ఉన్నావని అడిగారు. దాంతో సమర్థ్‌కు ఏమీ పాలుపోలేదు. వాయిదా పడిన ఓ పరీక్ష ఆ రోజు నిర్వహిస్తున్న సంగతి అతడికి తెలియదు. దాంతో కంగారుపడ్డాడు. తాను ఉన్న దగ్గరి నుంచి పరీక్షాకేంద్రానికి వెళ్లేందుకు పావుగంట సమయం మాత్రమే ఉంది. ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో 15 కి.మీల దూరంలోని పరీక్షా కేంద్రానికి రోడ్డు మార్గంలో వెళ్తే సమయానికి చేరుకోలేనని సమర్థ్ గ్రహించాడు. దాంతో పంచగని జీపీ అడ్వెంచర్స్‌లో గోవింద్ యేవాలే అనే సాహస క్రీడల నిపుణుడిని తనను పారాగ్లైడింగ్ ద్వారా పరీక్ష కేంద్రానికి చేర్చాలని అభ్యర్థించాడు. గోవింద్ తన బృందం సహాయంతో పారాగ్లైడింగ్ ద్వారా సమర్థ్‌ను సమయానికి పరీక్ష కేంద్రానికి పంపారు.

ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ లేకుంటే.. డబుల్ టోల్

» అమల్లోకి కొత్త నిబంధనలు: ఎన్‌పీసీఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ఫాస్టాగ్ వినియోగదారులు ఇకపై బ్యాలెన్స్ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. టోల్ చార్జీకి తగిన బ్యాలెన్స్ లేకున్నా.. బ్లాక్‌లిస్టులో ఉన్న కార్డును వాడినా.. జరిమానాల బాదుడు తప్పదు. ఈ మేరకు భారత జాతీయ చెల్లింపుల సంస్థ(ఎన్‌పీసీఐ) కొత్త నిబంధనలను ప్రకటించింది. ఈ నిబంధనలు సోమవారం నుంచే అమల్లోకి వచ్చాయి. టోల్‌బూత్‌ల వద్ద వాహనాల రద్దీకి బ్లాక్‌లిస్ట్ ఫాస్టాగ్‌లు, లోబ్యాలెన్స్ వంటి అంశాలు కారణాలుగా ఉంటున్న నేపథ్యంలో.. తాజా నిబంధనలను అమల్లోకి తీసుకువస్తున్నట్లు ఎన్‌పీసీఐ వెల్లడించింది. ఫాస్టాగ్ ఖాతాలో కనీస బ్యాలెన్స్ (రూ.100) లేకపోతే.. దాన్ని రీచార్జ్ చేయకుంటే బ్లాక్‌లిస్టులోకి వెళ్తుంది. ఫాస్టాగ్ అందించే బ్యాంకుకు సమయానికి కేవైసీ అందించకున్నా.. వాహన రిజిస్ట్రేషన్ వివరాల్లో తేడాలున్నా బ్లాక్‌లిస్ట్ లేదా హాట్‌లిస్టులో పెడతారు. బ్లాక్‌లిస్టులో ఉండగానే టోల్ దాటితే.. 'ఎర్రర్ కోడ్ 176'గా పరిగణిస్తారు. దీంతో.. టోల్ చార్జీకి సమానంగా జరిమానా పడుతుంది. అంటే.. టోల్ చార్జీకి రెట్టింపు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఎర్రర్ కోడ్ 176 వచ్చినప్పుడు.. 10 నిమిషాల్లోపు రీచార్జ్/అన్‌బ్లాక్ చేసుకుంటే.. జరిమానా మొత్తం వెనక్కి వస్తుంది.

ఉక్రెయిన్‌పై నేడు రష్యా-అమెరికా శాంతి చర్చలు

» తాము లేకుండా చేసే ఒప్పందాల్ని ఒప్పుకోబోమన్న జెలెన్‌స్కీ

అబుదాబీ, ఫిబ్రవరి17: ఉక్రెయిన్‌పై అమెరికా-రష్యా మధ్య సౌదీ అరేబియాలో మంగళవారం శాంతి చర్చలు జరగనున్నాయి. మూడేళ్లుగా సాగుతోన్న ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించేందుకు రష్యా-అమెరికా మంత్రులు, అధికారులు రియాద్‌లో చర్చలు జరుపుతారు. ఇప్పటికే అమెరికా మంత్రులు, అధికారుల బృందం సౌదీ అరేబియాకు చేరుకుంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో, పశ్చిమాసియా ప్రతినిధి స్టీవ్, జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్ట్ తదితరులు రియాద్‌కు చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య చర్చల తేదీ, సమయం మంగళవారం చర్చల్లో ఖరారయ్యే అవకాశం ఉంది. మరోవైపు, తాము లేకుండా తమపై చర్చలు జరిపి చేసే ఒప్పందాల్ని ఒప్పుకోబోమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తేల్చిచెప్పారు. ప్రస్తుతం ఆయన యూఏఈలో పర్యటిస్తున్నారు. చర్చల కోసం అబుదాబీ నుంచి రియాద్ వెళ్లే అవకాశముందని భావిస్తున్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై అమెరికా అవలంబిస్తున్న విధానాలపై చర్చించేందుకు పారిస్ వేదికగా ఈయూ దేశాధినేతలు సమావేశమవుతున్నారు.

కొత్త సీఈసీగా జ్ఞానేశ్‌కుమార్

ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ, అమిత్‌షాతోకూడిన ఉన్నతస్థాయి కమిటీ ఎంపిక.. రాష్ట్రపతికి సిఫారసు

» నూతన చట్టం ప్రకారం తొలి సీఈసీ నియామకమిదే

» ఆ చట్టంపై సుప్రీం తీర్పు వచ్చేదాకా ప్రక్రియను నిలిపివేయాలన్న కాంగ్రెస్

» ఈ భేటీనే జరిపి ఉండకూడదన్న రాహుల్

» జ్ఞానేశ్ స్థానంలో ఈసీగా వివేక్ జోషి



జ్ఞానేశ్‌కుమార్



వివేక్ జోషి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎన్నికల కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జ్ఞానేశ్ కుమార్.. భారతదేశ 26వ ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఎన్నికల కమిషనర్‌గా.. ప్రస్తుతం హరియాణా సీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న వివేక్ జోషి (1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి) నియమితులయ్యారు. ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ పదవీకాలం మంగళవారం ముగియనున్న నేపథ్యంలో.. తదుపరి సీఈసీని ఎంపిక చేసేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ సోమవారం భేటీ అయింది. ప్రధానమంత్రి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరయ్యారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ నేతృత్వంలోని సెర్చ్‌కమిటీ ప్రతిపాదించిన ఐదుగురు అభ్యర్థుల జాబితా నుంచి జ్ఞానేశ్‌కుమార్‌ను సీఈసీగా వారు ఎంపిక చేసి తమ నిర్ణయాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సిఫారసు చేసినట్టు కేంద్ర న్యాయశాఖ వెల్లడించింది. కేరళ క్యాడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన జ్ఞానేశ్‌కుమార్ (61) గతంలో పలు కీలక శాఖల్లో సేవలందించారు. ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేసే బిల్లు రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. అయోధ్యలో రామమందిరం కేసుకు సంబంధించిన పత్రాల వ్యవహారాన్ని.. హోం శాఖలో అదనపు కార్యదర్శిగా ఆయనే పర్యవేక్షించారు. 'శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ, కేంద్ర సహకార శాఖల కార్యదర్శిగా పనిచేశారు. గత ఏడాది జనవరిలో ఆయన రిటైర్ అయ్యారు. సీఈసీ పదవిలో 2029 జనవరి 26 దాకా ఆయన కొనసాగనున్నారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి.. 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అప్పాయింట్‌మెంట్ కండిషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీస్)చట్టం-2023' పేరుతో రూపొందించిన కొత్త చట్టం ప్రకారం సీఈసీ నియామకం ఇదే మొదటి సారి కావడం విశేషం.

కాంగ్రెస్ అభ్యంతరం..

పాత విధానం ప్రకారం.. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి కూడా సభ్యుడిగా ఉండేవారు. అయితే, 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టంలో.. భారత ప్రధాన న్యాయమూర్తికి బదులు కేంద్ర మంత్రివర్గం నామినేట్ చేసే మంత్రికి స్థానం కల్పించింది (దాని ప్రకారమే ఇప్పుడు కేంద్ర మంత్రివర్గం తరఫున కేంద్రమంత్రి అమిత్ షా ఉన్నత స్థాయి కమిటీలో సభ్యుడిగా హాజరయ్యారు). దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై తీర్పు వచ్చే దాకా కొత్త చట్టం ప్రకారం నూతన సీఈసీ నియామకాన్ని వాయిదా వేయాలని కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది. ఉన్నతస్థాయి కమిటీ సమావేశానికి హాజరైన రాహుల్‌గాంధీ సైతం.. అసలు ఈ భేటీనే జరిపి ఉండకూడదంటూ తన అసమ్మతిని లిఖిత పూర్వకంగా తెలిపారు. ఆ పిటిషన్లపై సుప్రీంలో బుధవారమే విచారణ జరగనున్న విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు.

రాజీవ్‌కుమార్‌కు వీడ్కోలు

ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా రాజీవ్ కుమార్ పదవీకాలం మంగళవారంతో ముగియనున్న నేపథ్యంలో.. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఆయనకు వీడ్కోలు పలికింది. రాజీవ్ కుమార్ 2020 సెప్టెంబరు 1 న కేంద్ర ఎన్నికల సంఘంలో ఎన్నికల కమిషనర్‌గా చేరారు. 2022 మే 15న దేశ 25వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కమిషన్‌లో 4.5 సంవత్సరాల పాటు సాగిన ఆయన పదవీ కాలంలో అనేక సంస్కరణలు జరిగాయి. కాగా.. ఎన్నికల ఫలితాలను అంగీకరించలేని పార్టీలు.. ఎన్నికల కమిషన్‌ను బలిపశువును చేస్తున్నాయని వీడ్కోలు కార్యక్రమంలో రాజీవ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఎన్నికల అధికారులను లక్ష్యంగా చేసుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. అత్యంత పారదర్శకంగా జరిగే ఎన్నికల ప్రక్రియలో ప్రతిదశలోనూ పాల్గొనే అభ్యర్థులు, పార్టీలు.. ఏ దశలోనూ అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా, అప్పీళ్లు దాఖలు చేయకుండా.. ఎన్నికలు ముగిశాక మాత్రం ప్రజల్లో ఆ ప్రక్రియపై అనుమానాలు రేకెత్తించే ప్రయత్నాలు చేయడం అవాంఛనీయం అని ఆయన ఆవేదన వెలిబుచ్చారు.

లోకం తీరు



ఢిల్లీలో భూకంపం

ఆ సమయంలో 'బూమ్' అని భారీ శబ్దం

5 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: దేశ రాజధాని ఢిల్లీ, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో సోమవారం ఉదయం 5.36గంటలకు భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.0గా నమోదైంది. ఢిల్లీకి ఆనుకొని ఉన్న ధౌలా కౌన్ ప్రాంతంలోని జీల్ పార్కు కేంద్రంగా 5 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. భూకంప కేంద్రం తక్కువ లోతులో ఉన్న కారణంగా బలమైన భూప్రకంపనలు సంభవించాయి. దీంతో, ఢిల్లీ, నోయిడా, గాజియాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఢిల్లీలో ఈ స్థాయిలో బలమైన ప్రకంపనలు ఇంతకుముందు రాలేదని స్థానికులు తెలిపారు. భూకంపం సంభవించినప్పుడు బాంబు పేలినట్లు 'బూమ్' అని భారీ శబ్దం వచ్చినట్లు వారు పేర్కొన్నారు. అయితే, అదృష్టవశాత్తూ ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు.

ఐటీ బిల్లులో ఎన్నికల బాండ్లకు అవకాశం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: కొత్త ఆదాయ పన్ను బిల్లు-2025లో ఎన్నికల బాండ్లకు సంబంధించి నిబంధనలను చేర్చడంపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల బాండ్లను సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంది. గత ఏడాది ఫిబ్రవరి 15న ఇచ్చిన ఉత్తర్వుల్లో కేంద్ర ఎలక్టోరల్ బాండ్ స్కీంను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే కొత్త ఐటీ బిల్లు షెడ్యూల్ 8లో ఎన్నికల బాండ్ల గురించి ప్రస్తావన చేశారు. చట్టాల్లోని లోపాలను ఆసరాగా చేసుకొనో, లేదంటే వేరే వేరే రూపాల్లోనో ఎన్నికల బాండ్లను తిరిగి ప్రవేశపెట్టాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లుగా తెలుస్తోందని నిపుణులు విశ్లేషించారు.

తొక్కిసలాటల నివారణకు.. 60 రైల్వేస్టేషన్లలో హోల్డింగ్ జోన్లు

» తమ రైలు వచ్చే దాకా ప్రయాణికులు అక్కడే

» ఢిల్లీ దుర్ఘటన నేపథ్యంలో చర్యలు: అశ్వినివైష్ణవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది దుర్మరణం పాలైన నేపథ్యంలో.. మళ్లీ ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఆ దిశగా మూడు ముఖ్యమైన చర్యలు తీసుకోనున్నట్టు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం వెల్లడించారు. అవి..దేశంలో అత్యంత రద్దీగా ఉండే 60 ప్రధాన రైల్వే స్టేషన్లలో హోల్డింగ్ జోన్లను ఏర్పాటు చేయడం. రైల్వే స్టేషన్లలోని మెట్లమార్గాలను ఖాళీగా ఉంచాల్సిన అవసరంపై ప్రజల్లో అవగాహన పెంచడం. రద్దీ నిర్వహణకు సంబంధించి స్పష్టమైన నిబంధనావళి రూపొందించి రైల్వే స్టేషన్ సిబ్బందికి పెద్ద ఎత్తున శిక్షణ ఇవ్వడం...ఈ మూడింటిలో ప్రధానమైనది హోల్డింగ్ జోన్ల ఏర్పాటు. అంటే.. స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు తమ రైలు వచ్చేదాకా కూర్చోవడానికి చేసే ఏర్పాటు. సంబంధిత రైలు వచ్చాక ప్రయాణికులను ప్లాట్‌ఫామ్‌పైకి అనుమతిస్తారన్న మాట. దీనివల్ల ప్లాట్‌ఫామ్‌పై రద్దీ పెరిగిపోవడం, తొక్కిసలాటలు జరగడం వంటి సమస్యలు ఉండవు. ఇకపై న్యూఢిల్లీ, ఆనంద్‌విహార్, లఖ్‌నవూ, వారాణసీ, పట్నా, ముంబై, సూరత్, బెంగళూరు తదితర 60 ప్రధాన రైల్వే స్టేషన్లలో దీన్ని అమల్లోకి తేవాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఛాత్ పూజ సమయంలో ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో దీన్ని అమలు చేయగా అది విజయవంతమైందని.. మహాకుంభమేళా సందర్భంగా ప్రయాగరాజ్‌లో కూడా ఇలా హోల్డింగ్ ఏరియాలను ఏర్పాటు చేయడం సత్ఫలితాలను ఇచ్చిందని అశ్వినివైష్ణవ్ తెలిపారు. అలాగే.. రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు మెట్లపై కూర్చోకుండా ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలను రైల్వే శాఖ చేపట్టనుంది. ఇందుకోసం ఆర్నెల్లపాటు ప్రత్యేక క్యాంపెయిన్‌ను నిర్వహించనుంది. ప్రయాణికులతోపాటు.. ప్లాట్‌ఫామ్‌పై ఉండే స్టేషన్ సిబ్బంది, దుకాణదారులకు కూడా అవగాహన కల్పించనుంది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో రద్దీ నిర్వహణకు సంబంధించి.. ఇప్పటికే ఉన్న నిబంధనలన్నింటినీ ఒక దగ్గరకు చేర్చి, సమగ్రమైన ప్రామాణిక నిర్వహణ విధానాన్ని అభివృద్ధి చేయనున్నట్టు అశ్విని వైష్ణవ్ తెలిపారు.

ఆ దరఖాస్తులు ఇక స్వీకరించం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం 1991లో ఒక ప్రత్యేక చట్టం తీసుకువచ్చింది. ఆగస్టు 15, 1947 నాటికి ఉనికిలో ఉన్న ప్రార్థనా మందిరాల మతపరమైన స్థితిని మార్చడానికి వీల్లేదని ఈ చట్టం స్పష్టం చేసింది. ఈ చట్టానికి ఉన్న చట్టబద్ధతను ప్రశ్నిస్తూ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ మొత్తంగా తేనెతుట్టెను కదిలించింది. దేశంలోని పది మసీదులపై హక్కును ప్రకటిస్తూ హిందూ సంస్థలు పలు కోర్టుల్లో 18 పిటిషన్లు దాఖలు చేశాయి. అయితే, వీటిపై విచారణను గత ఏడాది సుప్రీంకోర్టు నిలిపివేసింది. వాటిలో షాహీ ఈద్గా - కృష్ణ జన్మభూమి, కాశీ విశ్వనాథ్- జ్ఞానవాపీ మసీదు, సంభాల్ మసీదు వివాదం ఇందులో కొన్ని. ఈ వివాదాల నివృత్తికి 1991నాటి చట్టాన్ని ప్రామాణికంగా చేసుకోవాలని పలు ప్రతిపక్ష పార్టీలు కోరుతుండగా, హిందూ సంస్థలు, మితవాద సంఘాలు ఈ చట్టాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ చట్టాన్ని గట్టిగా అమలు చేయాలంటూ ఏఐఎమ్ఐఎమ్ ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. శాంతియుతంగా జీవించేందుకు ప్రతి పౌరుడికీ అవకాశం కల్పిస్తూ 1991 చట్టాన్ని మరోసారి ధ్రువీకరించాలంటూ సమాజ్‌వాదీ పార్టీ ఖైరానా ఎంపీ ఇక్రా చౌధురీ అభ్యర్థించారు. గతంలో తాను వేసిన పిటిషన్‌ను స్వీకరించినట్టు నోటీసు తనకు అందలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. కొత్త అంశాలను తాజాగా జోడించి రూపొందించిన మధ్యవర్తిత్వ (రిట్) పిటిషన్‌ను విచారణకు స్వీకరించాలని ఆయన కోరారు. దీనిపై చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందించారు. ఈ తరహా పిటిషన్లను గతంలో అనుమతించామని, ఇక ఇటువంటి వాటిని స్వీకరించబోమని స్పష్టం చేశారు. నోటీసులు పంపని పిటిషన్లను తిరస్కరిస్తున్నామన్న ఆయన.. కొత్త అంశాలతో దాఖలు చేసిన రిట్ పిటిషన్లను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. ఇక్రా చౌధరి పిటిషన్‌ను విచారణకు స్వీకరించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపించారు. ఈ వివాదంపై కేంద్రం స్పందన తెలియాల్సి ఉన్నదన్నారు. ఈ వివరాలు నమోదుచేసుకున్న బెంచ్ తదుపరి విచారణను ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసింది. ఆ రోజున త్రిసభ్య బెంచ్ అన్ని పిటిషన్లపై విచారణ చేపడుతుందని వెల్లడించింది.

యూపీ అధికారులకు నోటీసులు

మసీదును కూల్చివేయకూడదంటూ ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించినందుకు కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు సోమవారం ఉత్తరప్రదేశ్ అధికారులను ఆదేశించింది. కుశీనగర్‌లోని మసీదును కూల్చివేయకూడదంటూ గత ఏడాది నవంబరు 13న ఇచ్చిన ఆదేశాలను అధికారులు కావాలని ఉల్లంఘించారని పేర్కొంటూ సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలయింది. దీనిని పరిశీలించిన ధర్మాసనం..కూల్చివేత పనులను నిలిపివేయాలని ఆదేశించింది.



జడ్జిల నియామకం న్యాయబద్ధంగా లేదు

మద్రాసు హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రు ఆరోపణ

చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం న్యాయబద్ధంగా లేదని మద్రాసు హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రు ఆరోపించారు. చెన్నైలో సోమవారం రిటైర్డ్ జడ్జిలు చంద్రు, అరిపరంధామన్ సంయుక్తంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ శాసనం ప్రకారం... సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో సామాజిక న్యాయాన్ని పాటించడం లేదని అన్నారు. దేశంలోనే అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో 34 శాతం మంది బ్రాహ్మణ వర్గానికి చెందిన వారే ఉన్నారని చెప్పారు. దేశ జనాభాలో 10% మాత్రమే ఉన్న ఓ వర్గానికి ప్రాధాన్యం ఇస్తున్నారని, న్యాయమూర్తుల పోస్టుల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు సరైన న్యాయం జరగడం లేదన్నారు. 75 శాతం న్యాయమూర్తుల పోస్టుల్లో అగ్రవర్ణాలకే అవకాశం ఇవ్వడం విచారకరమన్నారు. కేరళ రాష్ట్రంలో 74 శాతం దిగువ కోర్టులలో మహిళలే ఉన్నారని, అయితే వారిలో ఒకరు కూడా సుప్రీంకోర్టుకు వెళ్లలేదని జస్టిస్ చంద్రు వ్యాఖ్యానించారు.

బాబోయ్.. బూతు!

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుతోంది!! ఇదీ ప్రస్తుతం రాష్ట్రంలో, దేశంలో కొనసాగుతున్న విపరీత పోకడ!! యూట్యూబ్‌లోనే కాదు.. యువత ఎక్కువగా వినియోగించే ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా అశ్లీల, బూతు వీడియోలు, షార్ట్‌లు కోకొల్లలు. ఓ రియాల్టీ షోలో రణ్‌వీర్ అలహాబాదియా వ్యాఖ్యల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనం, విపరీతమైన స్వేచ్ఛ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో పాటు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల సంగతేంటి..? ఎప్పుడో హద్దులు దాటేసిన తెలుగు యూట్యూబర్ల సంగతేంటి..? వీరి విచ్చలవిడితనాన్ని ప్రశ్నించేది ఎవరు..? వారికి అడ్డుకట్ట వేసేవారే లేరా..? రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకోలేవా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వేల సబ్‌స్క్రైబర్లు.. లక్షల 'వ్యూస్'లు..

దేశంలో లక్షలాది మంది యూట్యూబ్ వేదికగా భారీగానే ఆర్జిస్తున్నారు. వీడియోలు రూపొందించి ప్రతినెలా లక్షల్లో ఆర్జిస్తున్నవారు ఎంతో మంది ఉన్నారు. యూట్యూబ్ వీడియోలకు వ్యాపార సంస్థలు భారీ ప్రకటనలు ఇస్తుండడం, ఎంత ఎక్కువ లైక్‌లు, సబ్‌స్క్రైబర్లు ఉంటే అంత ఎక్కువ ఆదాయం వస్తుండడంతో ఇప్పుడు ఆన్‌లైన్లో ఇదో పెద్ద వ్యాపారంగా మారింది. అనేకమంది ఉద్యోగాలు వదిలి పూర్తిస్థాయి యూట్యూబ్ చానళ్లు నిర్వహిస్తున్నారు. కానీ, ఇటీవలి కాలంలో ఈ వ్యాపారం పూర్తిగా గాడితప్పింది. తక్కువ సమయంలో భారీగా సబ్‌స్క్రైబర్లను పెంచుకోవాలంటే, వీక్షకులు, ఫాలోవర్లను పొందాలంటే దేనికైనా తెగించే యూట్యూబర్లు తెలుగు రాష్ట్రాల్లో పెద్దసంఖ్యలో ఉన్నారు. ఉదాహరణకు.. 'శ్రీ..' అనే మహిళ, గతంలో ఓ చానల్‌లో పనిచేసి, ఆనక ఓ పార్టీకి మద్దతుదారుగా మారిపోయి.. జననావయవాలకు సంబంధించిన పచ్చిబూతులను వాడుతూ అనర్గళంగా మాట్లాడే వీడియోలకు లక్షల్లో వ్యూస్ వస్తున్నాయి! 'సా....' అనే మరో యూట్యూబర్ ఆడపిల్లలను ఇంటర్వ్యూ చేసే పేరుతో.. ఆ సాంతం బూతునే నమ్ముకుని రూపొందించే వీడియోలకూ భారీగా అభిమానులు ఉండడం విషాదం! విజయ్... పేరుతో ఉన్న ఓ యూట్యూబ్ చానల్‌లో రాయడానికి వీల్లేని విధంగా భాష వినియోగిస్తారు. కొందరు మహిళలు, యువతులను ఇంటర్వ్యూలు చేస్తూ.. అసభ్య మాటలతో సమాధానాలు చెప్పిస్తారు. ఈ చానల్‌లో ఇలాంటి బూతు వీడియోలు 1300 ఉండగా, 5 లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. అలాగే 'సూపర్ --- స్టార్స్' పేరుతో ఉన్న యూట్యూబ్ చానల్లో ఓ మహిళ వాడే భాష, ఆమె చేసే ఇంటర్వ్యూల్లో వేసే ప్రశ్నలు, ఆమె వ్యక్తిగత అనుభవాలు.. అన్నింటినీ సెన్సార్ చేస్తే అరగంట వీడియోలో ప్రసారానికి అర్హమయ్యే నిడివి అరనిమిషం కూడా ఉండదంటే అతిశయోక్తి కాదు.

రాష్ట్రాలు ఏం చేస్తున్నాయి!

యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో దేశ సమగ్రత, మతాలు, ప్రాంతాలు మధ్య విద్వేషం, తప్పుడు వార్తలకు సంబంధించిన వీడియోలను ఆన్‌లైన్ నుంచి తొలగించే అధికారం కేంద్ర ఐటీ శాఖకు ఉంది. కేంద్రప్రభుత్వం సైతం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసే చానళ్లపైనే చర్యలు తీసుకుంటోంది తప్ప బూతులు, అశ్లీల అంశాల జోలికి వెళ్లడం లేదన్న విమర్శలున్నాయి. అయితే ఆన్‌లైన్ కంటెంట్‌ను నియంత్రించే హక్కు రాష్ట్రాలకూ ఉంది. ఏదైనా వీడియో అభ్యంతరకరంగా అనిపిస్తే వాటిని తొలగించమని యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాం లాంటి సంస్థలను కోరవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫిర్యాదు వస్తే వాటిని వెంటనే పరిశీలించి ఆ సంస్థలు నిర్ణయం తీసుకుంటాయి. అయితే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్రకే పరిమితం కావడం, అశ్లీల, బూతు వీడియోలపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) శాఖ సైతం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విచ్చలవిడితనం కొనసాగుతోంది.

అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనలు..

అసభ్య, అశ్లీలతకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పంచుకోకుండా యూట్యూబ్ ప్రత్యేక నిబంధనలు అమలుచేస్తోంది. తొలుత యూట్యూబ్ సంబంధిత ఛానల్‌కు హెచ్చరికలు జారీ చేస్తుంది. రెండోసారి 'స్ట్రైక్' చేస్తే వారంపాటు వీడియోలు అప్‌లోడ్ చేయకుండా నిషేధిస్తుంది. అయితే రాష్ట్రంలోని అనేక యూట్యూబ్ చానళ్లపై ఫిర్యాదులు వస్తున్నా.. స్పందించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.



ఎన్‌సీసీ కంపెనీ నిర్మించిన గృహ సముదాయం

అల్లూరి అనుచరుడు గాం గంటందొర వారసులకు గృహాలు

» ఉచితంగా నిర్మించి ఇచ్చిన ఎన్‌సీసీ

కొయ్యూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అనుచరుడు గాం గంటందొర వారసుల కోసం నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీసీ) ఉచితంగా నిర్మించిన గృహ సముదాయాలను సంస్థ ఛైర్మన్ ఏఎస్ దుర్గా ప్రసాద్, జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. గంటందొర వారసులైన బుచ్చిదొర, లక్ష్మణదొర, బోడిదొర, తెల్లనదొర, సోమన్నదొరలకు చెందిన 11 మంది సంతానం గాం పెంటన్నదొర, బాబూరావు, నీలకంఠం, రాంబాబు, దార మల్లేశ్వరి, బోడిదొర, సీతారామయ్య, సీతమ్మ, రాజబాబు, మలయ్యమ్మ, శివలకు యాజమాన్య హక్కు ధ్రువ పత్రాలతో పాటు ఇంటి తాళాలు అందజేశారు. వారికి స్వయం ఉపాధి కల్పనకు త్వరలో చర్యలు తీసుకుంటామని కలెక్టర్, ఎన్‌సీసీ ఛైర్మన్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏజీకే రాజు, క్షత్రియ పరిషత్ ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.



గృహ లబ్ధిదారులతో ఎన్‌సీసీ ఛైర్మన్ ఏఎస్ దుర్గాప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏజీకే రాజు, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, తదితరులు



శ్రీవారి ఎస్వీ అన్నదానం ట్రస్టుకు

రూ.11 కోట్లు విరాళం

తిరుమల, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.11కోట్లు విరాళం అందింది. ముంబైలోని ప్రసిద్ యునో ఫ్యామిలీ ట్రస్టుకు చెందిన తుషార్ కుమార్ అనే భక్తుడు సోమవారం ఈ విరాళం అందజేశారు. తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి ఈమేరకు డీడీ అందజేశారు.

ఎస్ఐ పోస్టులకు 65% ప్రత్యక్ష నియామకాలు

ఏఎస్ఐ, హెచ్‌సీలకు పదోన్నతి ద్వారా 30% పోస్టులు భర్తీ | రిజర్వు కేటగిరీ ఎస్ఐలకు 5% పోస్టులు

» పోలీసు రిక్రూట్‌మెంట్ నిబంధనల సవరణ

» జీవో జారీ చేసిన ప్రభుత్వం



అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పోలీసు రిక్రూట్‌మెంట్ నిబంధనలు సవరిస్తూ రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి కుమార్ విశ్వజీత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్(సివిల్) పోస్టులను 65 శాతం ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు. గతంలో ఇది 55% మాత్రమే ఉండేది. ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌లకు పదోన్నతి కల్పించడం ద్వారా 30 శాతం, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్(ఏఆర్, ఏపీఎస్పీ, ఎస్ఏఆర్ఎస్‌పీఎల్) నుంచి బదిలీ ద్వారా 5 శాతం పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించారు. డైరెక్ట్ రిక్రూటీ ఖాళీల్లో ప్రత్యేక కేటగిరీలకు కొన్ని రిజర్వేషన్లు కల్పించారు.

- పోలీస్ ఎగ్జిక్యూటివ్స్‌కి 5%, పోలీస్ మినిస్టీరియల్స్‌కి 1%, క్రీడల్లో మెరిట్ ఉంటే 2%, పోలీసు సిబ్బంది పిల్లలైతే 2%, డ్యూటీలో ఉండగా మరణించిన వారి పిల్లలకు 2%, ఎన్‌సీసీవారికి 3% రిజర్వేషన్లు.
- ఆర్ఎస్ఐ(రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్) నుంచి ఎస్ఐ కావాలనుకునే వారికి 5% కేటాయించారు. వీరికి వారి స్థానిక జోన్‌లోనే నియామకాలు చేపట్టాలి. పోస్టింగ్ ఇచ్చే ఏడాది జూలై ఒకటో తేదీ నాటికి వయసు 40 ఏళ్లు దాటకూడదు. పైగా వాళ్లు ఏఆర్, ఎస్ఏఆర్ఎస్‌పీఎల్, ఏపీఎస్‌పీలో కనీసం ఐదేళ్లు పనిచేసి ఉండాలి. ట్రాక్‌రికార్డు మెరుగ్గా ఉండాలి. నక్సల్స్, మావోయిస్టుల నియంత్రణ కార్యాకలాపాల్లో పాల్గొని ఉండాలి. వీటితో పాటు ఎస్ఐకి కావాల్సిన విద్యార్హతలన్నీ ఉండాలి.
- ఈ నియామకాలన్నీ రాష్ట్రస్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ పర్యవేక్షణలో జరుగుతాయి. గతేడాది జూలై 1వ తేదీ నుంచి ఉన్న ఖాళీలను ఇప్పుడు భర్తీ చేస్తారు.
- ఏఎన్ఎస్, ఏపీఎస్పీ-ఆర్ఎస్ఐఎస్, కౌంటర్ ఇంటెలిజెన్స్, డిస్ట్రిక్ స్పెషల్ పార్టీ రిజర్వ్ ఎస్ఐలు, గ్రేహౌండ్స్, ఎస్ఐబీ, ఆక్టోపస్, నక్సలైట్ ప్రభావిత ప్రాంతాల్లో కనీసం ఏడాది కంటే ఎక్కువ పనిచేసి ఉండాలి. నక్సల్, మావోయిస్టు, ఉగ్రవాద వ్యతిరేక విభాగాల్లో ఏదైనా గ్యాలంట్రీ మెడల్ ఉండాలి. ఈ ప్రాంతాల్లో 1-3 ఏళ్లు పనిచేసి ఉంటే 5 మార్కులు, 3-5 ఏళ్లు పనిచేసి ఉంటే 10 మార్కులు, ఐదేళ్ల కంటే ఎక్కువ పనిచేసి ఉంటే 15 మార్కులు వస్తాయి.
- అశోక్ చక్ర అవార్డుకు 25 మార్కులు, కీర్తి చక్ర అవార్డుకు 20 మార్కులు, పీపీఎంజీ, పీఎంజీ 15 మార్కులు, ముఖ్యమంత్రి శౌర్య పతకానికి 10 మార్కులు.
- ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం ఏ జోన్‌లో ఖాళీలను ఆ జోన్‌వారితోనే భర్తీ చేయాలి. స్థానిక అభ్యర్థులు లేనప్పుడు డిప్యూటేషన్‌పై జిల్లాల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారిని సీనియారిటీ ప్రాతిపదికన భర్తీ చేయవచ్చు. ఇలాంటి సందర్భాల్లో పోటీ ఉన్నప్పుడు ఐదేళ్ల ఏసీఆర్‌లు పరిగణనలోకి తీసుకోవాలి. ఒకే ఏడాది ఒకటి కంటే ఎక్కువ ఏసీఆర్‌లు ఉంటే ఎక్కువ కాలం ఉన్నది తీసుకోవాలి. రెండు కంటే ఎక్కువ ఏసీఆర్‌లు ఉంటే మెరుగైన ఏసీఆర్‌లు ఉన్నది పరిగణనలో తీసుకోవాలి. ఔట్‌స్టాండింగ్ ఏసీఆర్‌కి 5, వెరీగుడ్ 4, గుడ్ 3, సంతృప్తికరం 2 మార్కులేయాలి.
- ముఖ్యమంత్రి శౌర్యపతకం ఉంటే 10 మార్కులు, ఇతర గ్యాలంట్రీ మెడల్స్‌కు కూడా 10 మార్కులు, ఏపీ పోలీస్ సేవా పతకం, కఠిన సేవా పతకం, ఉత్తమ సేవా పతకం, మహోన్నత సేవా పతకం ఉంటే ఒక్కో మెడల్‌కు 5 మార్కులు వేస్తారు. డీజీపీ కమెండేషన్ డిస్క్‌కి 2 మార్కులు వేస్తారు.
- అభ్యర్థులకు మార్కులు సమానంగా వస్తే సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకే ర్యాంకులో ఉంటే పుట్టిన తేదీ ఆధారంగా పెద్దవారికి ప్రాధాన్యం ఇవ్వాలి.
- ఇంకా భర్తీ కానీ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లోని స్టైపెండరీ కేడెట్ ట్రైనీ ఎస్ఐలతో భర్తీ చేయాలి.
- ఎంపిక విధానం, మార్గదర్శకాలపై పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్‌దే తుదినిర్ణయం. ఏవైనా ఉల్లంఘనలు ఉంటే ఛైర్మన్ నిర్ణయమే అంతిమం అవుతుంది.

మల్లన్న సేవలో జస్టిస్ ఎన్వీ రమణ



శ్రీశైలం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను సోమవారం రాత్రి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం వచ్చిన ఆయనకు అర్చకులు, అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. మంగళవారం ఆయన స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనల్లో పాల్గొంటారు.

శ్రీశైలంలో హీరో సాయి ధరమ్‌తేజ్



శ్రీశైలం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను సోమవారం హీరో సాయి ధరమ్ తేజ్ దర్శించుకున్నారు. ఆలయయానికి వచ్చిన ఆయనకు రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు సాదరంగా ఆహ్వానం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు వేదపండితులు, అర్చకులు ఆశీర్వదించారు.

నేడు మే నెల శ్రీవారి టికెట్ల కోటా విడుదల

తిరుమల, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన టికెట్ల మే నెల కోటాను ఆన్‌లైన్‌లో టీటీడీ మంగళవారం ఉదయం 10 గంటలకు విడుదల చేయనుంది. ఈలక్కీడిప్ రిజిస్ట్రేషన్ కోసం 18 నుంచి 20వ తేదీ ఉదయం 10 గంటలకు వరకు ఆన్‌లైన్‌లో భక్తులు నమోదు చేసుకోవచ్చు. డిప్ ద్వారా టికెట్లు పొందిన వారు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12గంటల లోగా సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను కూడా విడుదల చేస్తారు. 22న ఉదయం 11 గంటలకు శ్రీవాణిటికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్న భక్తులకు టోకెన్లను జారీ చేస్తారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి, తిరుమలలో గదుల కోటాను విడుదల చేయనున్నారు.

గురజాల వైసీపీకి భారీ షాక్!

» పిడుగురాళ్ల మున్సిపాల్టీ ఛైర్‌పర్సన్ సహా టీడీపీలోకి 17 మంది కౌన్సిలర్లు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గ పరిధి పిడుగురాళ్లలో వైసీపీకి ఆ పార్టీ కౌన్సిలర్లు భారీ షాక్ ఇచ్చారు. సోమవారం 17 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకొన్నారు. ఈ నెల 3, 4 తేదీల్లో జరగాల్సిన మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. దాంతో సోమవారం ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్న తరుణంలో ఊహించని విధంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో సహా వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ కండువా కప్పుకొన్నారు.

సొంత కౌన్సిలర్లను నిర్బంధించిన వైసీపీ

» ఛైర్మన్ ఇంటి నుంచి కదలనీయని నేతలు

» తుని వైస్ ఛైర్మన్ ఎన్నిక మళ్లీ నేటికి వాయిదా

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/తునిరూరల్: కాకినాడ జిల్లా తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక మూడోసారి కూడా వాయిదా పడింది. ఉదయం 11గంటలకు వైస్ ఛైర్మన్ ఎన్నిక జరగాల్సి ఉండగా, వైసీపీ కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాకుండా ఆ పార్టీకి చెందిన మున్సిపల్ ఛైర్మన్ ఇంట్లో నిర్బంధించారు. దీంతో కోరం లేక అధికారులు ఎన్నికను రద్దు చేశారు. వాస్తవానికి తుని మున్సిపాల్టీలో మొత్తం 30మంది కౌన్సిలర్లకుగాను వైసీపీ బలం 27గా ఉంది. వీరిలో పది మంది ఇటీవల టీడీపీలో చేరిపోయారు. దీంతో మిగిలిన తమ పార్టీ కౌన్సిలర్లు కూడా చేజారిపోతారనే భయంతో, సోమవారం మున్సిపల్ ఛైర్మన్ ఇంటి వద్దకు వారందరినీ తరలించి నిర్బంధించారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఛైర్మన్ నివాసంలో బంధించిన కౌన్సిలర్లను బయటకు తీసుకురావాలని టీడీపీ నేతలు ఛైర్మన్ నివాసానికి కొద్దిదూరంలో ఆందోళనకు దిగారు. అయితే ఉదయం నుంచీ అక్కడే మాకం వేసిన మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, ఆయన అనుచరులు కవ్వింపు చర్యలకు దిగారు. ఇరువర్గాల తోపులాట జరిగింది. రాజా సైతం టీడీపీ నేతలపైకి దురుసుగా దూసుకువచ్చారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు. కాగా, మంగళవారం ఉదయం 11 గంటలకు నాలుగోసారి మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికకు ఏర్పాట్లు చేశారు. కాగా, తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికలో కౌన్సిలర్లు ఓటు వేయకుండా అడ్డుకోవడంతో పాటు, టీడీపీ నేత పోలిశెట్టి రామలింగేశ్వరరావుపై దాడి చేసినట్టు అందిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, ఆయన అనుచరులపై కేసు నమోదు చేసినట్టు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు.

కేసీఆర్‌కు చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావుకు ఏపీ సీఎం చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈమేరకు సోమవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. కేసీఆర్‌కు ఆరోగ్యవంతమైన జీవితాన్ని ప్రసాదించాలని ఆ దేవుడిని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా ఎక్స్ వేదికగా కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నాక్ కేసులో నిందితులకు షాక్

» కేఎల్ వర్సిటీ ప్రతినిధులు, అధ్యాపకులకు బెయిల్‌ను తిరస్కరించిన సీబీఐ కోర్టు

విజయవాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఏ ప్లస్ ప్లస్ గుర్తింపు కోసం నాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్) అధికారులకు లంచాలు ఇచ్చి జైలు పాలైన కేఎల్ యూనివర్సిటీ ప్రతినిధులు, అధ్యాపకులకు షాక్ తగిలింది. ఈ కేసులో నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను విజయవాడ సీబీఐ కోర్టు సోమవారం తిరస్కరించింది. కొద్దిరోజుల క్రితం ఈ కేసులో సీబీఐ పది మంది నిందితులను అరెస్టు చేసింది. ఇందులో నాక్ అధికారులతోపాటు కేఎల్ వర్సిటీ ప్రతినిధులు, అధ్యాపకులు కూడా ఉన్నారు.

ప్రజల్లోకి కేంద్ర బడ్జెట్

» కీలక నిర్ణయాలపై బీజేపీ ప్రచారం

» నేటి నుంచి రాష్ట్రంలో మేధావుల సదస్సులు

» హాజరుకానున్న పలువురు కేంద్ర మంత్రులు

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఈసారి కేంద్ర బడ్జెట్‌లో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే ఎన్నో కీలక నిర్ణయాలు ఉన్నాయని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది. ఈనేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌పై మేధావులతో సదస్సులు నిర్వహించేందుకు రాష్ట్ర బీజేపీ నాయకులు సిద్ధమయ్యారు. రాష్ట్రంలో మంగళవారం నుంచి ప్రారంభం అయ్యే ఈ సదస్సులు ఈనెల 26 వరకు కొనసాగనున్నాయి. అన్ని జిల్లాల్లో నిర్వహించే ఈ సదస్సుల్లో కేంద్ర మంత్రులు, ఎంపీలు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వైసత్యకుమార్ యాదవ్‌తోసహా బీజేపీ ఎమ్మెల్యేలు, వ్యాపారవేత్తలు పాల్గొంటారు. 18న గుంటూరులో జరిగే కార్యక్రమానికి కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు హాజరవుతారు. 19న తిరుపతిలో సదస్సుకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, 21న విజయవాడలో జరిగే సదస్సుకు కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పూరి, 22న విశాఖలో జరిగే సదస్సుకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, 24న రాజమహేంద్రవరంలో జరిగే కార్యక్రమానికి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, 22న కాకినాడ సదస్సుకు ఎంపీ సీఎం రమేశ్ హాజరవుతారు. వీటితో పాటు 19న శ్రీకాకుళం జిల్లాలో, 21న ఏలూరు, నెల్లూరు, శ్రీసత్యసాయి జిల్లాల్లో, 22న పార్వతీపురం మన్యం, అనకాపల్లి, పశ్చిమగోదావరి, బాపట్ల, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప జిల్లాల్లో, 23న అల్లూరి సీతారామరాజు, విజయనగరం, విశాఖపట్నం, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పల్నాడు, కృష్ణా జిల్లాల్లో ఈ సమావేశాలు జరుగుతాయి.

ప్రభుత్వ వైద్యులపై నిఘా

» కేజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్యుడిపై వేటు

» ఏలూరు బదిలీకి ఆరోగ్య మంత్రి ఆదేశాలు

» క్రమశిక్షణారాహిత్యాన్ని సహించేదిలేదని స్పష్టీకరణ

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో సేవల్ని మెరుగుపర్చే చర్యల్లోభాగంగా వైద్యులపై నిఘా పెట్టాలని, విధి నిర్వహణలో క్రమశిక్షణా రాహిత్యం, అక్రమాలకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. 2019-24 కాలంలో అప్పటి ప్రభుత్వ అలసత్వం వల్ల ప్రభుత్వ వైద్యుల్లో నెలకొన్న నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం, సర్వీసు నిబంధనల్ని ఉల్లంఘించే వైఖరిపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో దారితప్పి వ్యవహరిస్తున్న డాక్టర్ల వైఖరిని కట్టడి చేసే చర్యల్లో భాగంగా విశాఖ కేజీహెచ్‌లోని ఆర్థోపెడిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అంపోలు అచ్యుతరావుపై చర్యలకు మంత్రి ఆదేశించారు. సదరు వైద్యుడిని తక్షణమే ఏలూరు ప్రభుత్వాస్పత్రికి బదిలీ చేయాలని, ఆయనపై వచ్చిన పలు ఫిర్యాదులపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్ అచ్యుతరావు వికలాంగులకిచ్చే సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలకు పాల్పడినట్లు, ఆపరేషన్లు చేయడానికి డబ్బు తీసుకోవడంతో పాటు ఆయన చేసిన శస్త్ర చికిత్సల్లో వైఫల్యాలు ఎక్కువగా ఉన్నట్లు ఆరోగ్యశాఖ గుర్తించింది. వీటితో పాటు సహచర సిబ్బంది, వైద్య విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు, ఆస్పత్రి సూపరింటెండెంట్, ఇతర సీనియర్ల ఆదేశాల్ని ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో మంత్రి చర్యలకుఆదేశించారు. డాక్టర్ అనుచిత ప్రవర్తన, క్రమశిక్షణా రాహిత్యంవల్ల ప్రజలకు మెరుగైన సేవలందించేలక్ష్యం దెబ్బతింటుందంటూ, ఇలాంటి విషయాల్లో కఠిన చర్యలు ఎంతైనా అవసరమని మంత్రి పేర్కొన్నారు.

'బనకచర్ల'తో మారనున్న రాష్ట్ర ముఖచిత్రం

» ఈ ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వాలి: ఆళ్ల గోపాలకృష్ణారావు



విజయవాడ (గాంధీనగర్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుతో రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాలు అభివృద్ధి చెంది.. రాష్ట్ర ముఖచిత్రం మారనుందని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు ప్రాంతాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. సోమవారమిక్కడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టు వల్ల రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో 7.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు ఏర్పడుతుందన్నారు. వెలిగొండ, నాగార్జున సాగర్ కుడి కాలువ, కండలేరు, సోమశిల ప్రాజెక్టుల కింద ప్రస్తుతమున్న 22 లక్షల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని తెలిపారు. అలాగే పారిశ్రామిక అవసరాలకు 20 టీఎంసీలు అందుతాయన్నారు. ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతించారు. కృష్ణా జలాల్లో ఏపీకి 66 శాతం, తెలంగాణకు 34 శాతం నీరు దక్కుతోందని.. దీనిని యథాతథంగా కొనసాగించేలా బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట ఈ నెల 19న తన వాదనను రాష్ట్రప్రభుత్వం సమర్థంగా వినిపించాలని కోరారు. భేటీలో కృష్ణా తూర్పు డెల్టా, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌లు దేవరబోయిన వెంకటేశ్వరరావు, పంతాని మురళీధరరావు, నాగార్జునసాగర్ ఎడవ కాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి రంగానికి 30 వేల కోట్లు కేటాయించాలి

» రాష్ట్ర బడ్జెట్‌పై సీపీఐ రామకృష్ణ డిమాండ్



కర్నూలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో సాగునీటి రంగానికి రూ.30 వేల కోట్లు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. అందులో సింహభాగం రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించాలన్నారు. సోమవారం కర్నూలులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1985 తరువాత అప్పటి సీఎం ఎన్టీఆర్ హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు బీజం వేశారని, నాలుగు దశాబ్దాలు దాటినా వాటిని పూర్తి చేసి ఆయకట్టు స్థిరీకరించకపోవడం బాధాకరమన్నారు. కర్నూలు జిల్లాలో తక్షణ వలసలు ఆపేందుకు చర్యలు తీసుకోవాలన, వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి: సీపీఎం


విజయవాడ(గవర్నర్‌పేట), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రైతులకు, వినియోగదారులకు హానికరంగా ఉన్న సౌర, పవన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. విజయవాడలో సోమవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సెకీతోపాటు అన్ని కార్పొరేట్ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు రైతులకు హానికరంగా ఉన్నాయన్నారు. ఆ ఒప్పందాల వల్ల రైతులు భూములపై హక్కును కోల్పోతారని చెప్పారు. 30 సంవత్సరాల ఒప్పందాలు ఒకేసారి చేసుకోకుండా ఏటా లీజు రెన్యువల్ చేసుకునేలా ఒప్పందాలు ఉండాలన్నారు. అలాగే, ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ పార్టీలు వాటికి దూరంగా ఉండాలని ఆయన కోరారు.

రాజధాని మహిళలను దూషించిన కేసులో కోర్టులో లొంగిపోయిన నందిగం సురేశ్

» బెయిల్ మంజూరు చేసిన సత్తెనపల్లి కోర్టు

» 2020లో అమరావతిలో బాధితుల ఫిర్యాదు

సత్తెనపల్లి/అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రాజధాని అమరావతిలో మహిళలను దూషించి, అసభ్యంగా ప్రవర్తించిన కేసులో బాపట్ల వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ సోమవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి కోర్టులో లొంగిపోయారు. ఆయన బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా, న్యాయమూర్తి మంజూరు చేశారు. 2020 ఫిబ్రవరి 23వ తేదీన అమరావతిలో రథోత్సవంలో పాల్గొనేందుకు అప్పటి పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆహ్వానం మేరకు వైసీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి, అప్పటి బాపట్ల ఎంపీ సురేశ్, ఆయన అనుచరులు వచ్చారు. రాజధాని అమరావతి కోసం పోరాటం చేస్తూ రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులకు తమ సంఘీభావాన్ని తెలియజేసేందుకు బస్సు యాత్రగా వచ్చిన మహిళలను సురేశ్‌తో పాటు ఇతర నాయకులు దూషించి, అసభ్యంగా ప్రవర్తించారు. ఈ సంఘటనకు సంబంధించి విజయవాడకు చెందిన మహాలక్ష్మమ్మ అమరావతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు పలు సెక్షన్ల కింద నాయకులపై కేసు నమోదు చేశారు. సురేశ్ మినహా మిగిలినవారు కోర్టులో లొంగిపోయి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. ఆయన సోమవారం కోర్టులో లొంగిపోయారు.



సత్తెనపల్లి కోర్టుకు వచ్చిన నందిగం సురేశ్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అలవాటైన నిర్లక్ష్యం!

మహాకుంభమేళాతో ముడివడిన మరో ఘటన ఇది. ప్రయాగ్ రాజ్‌కు ప్రయాణం కట్టిన సామాన్యులను భద్రంగా గమ్యానికి చేర్చని మన రైల్వేవ్యవస్థ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం ఇది. తొక్కిసలాటలను ఊహిస్తామా, కలగంటామా అన్న అడ్డగోలువాదనలకు ఇక్కడ తావులేదు. లక్షలాదిమంది రైళ్ళలో ప్రయాగ్‌రాజ్‌కు పయనమవుతున్నందున ప్రమాదాలకు ఆస్కారం లేని రీతిలో అన్ని ఏర్పాట్లు చేయాలి, అడుగడుగునా వారిని కనిపెట్టుకోవాలి. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో 18మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన అత్యంత విషాదకరమైంది. ఆప్తులను కోల్పోయిన లోటు ఎన్నటికీ తీర్చలేనిది. తండ్రి కళ్ళెదుట కుమార్తె శిరస్సు ఛిద్రమైన ఘోరం సహా తొక్కిసలాట తీవ్రత ఏ స్థాయిలో, ఎంత దారుణంగా ఉన్నదో తెలియచెబుతూ పలు కథనాలు వెలుగుచూశాయి. ఎముకలు విరిగి, అవయవాలు దెబ్బతినిపోయిన క్షతగాత్రుల వేదన మరో రకమైనది. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ సమీప భవిష్యత్తులో ఎంత అద్భుతంగా ఉండబోతున్నదో చూడండి అంటూ ఐదేళ్ళక్రితం అప్పటి రైల్వేమంత్రి పీయూష్ గోయల్ విడుదల చేసిన కొన్ని చిత్రాలు ఇప్పుడు తిరిగి సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్నాయి. వేలాదికోట్లు ఖర్చుచేసి రైల్వేస్టేషన్లకు మెరుగులుదిద్దుతున్న మాటలు ఒకపక్క వినబడుతూండగానే, మరోపక్క ఇటువంటి దారుణాలు సంభవించడం ఆశ్చర్యం.

జరిగిన ఘోరానికి పద్ధతీపాడూ లేని ఆ సాధారణజనమే కారణం తప్ప తమ నిర్లక్ష్యం కాదని పాలకులు, అధికారులు పరోక్షంగా వాదిస్తున్నారు. ఆఖరునిముషంలో మరో ప్లాట్‌ఫామ్ మీదకు రైలును తెచ్చి, మీరు ఎక్కాల్సిన రైలు మీరు వేచివున్నదగ్గరకు కాక, వేరే చోటకు వస్తున్నదని ప్రకటించి రైల్వే అధికారులే తొక్కిసలాటకు కారకులైన సందర్భాలు గతంలో లేకపోలేదు. ఆ తరువాత అటువంటి తప్పటడుగులు వేయకూడదని నిర్ణయించుకున్నప్పటికీ, ఇప్పుడు జరిగింది కూడా దాదాపు అటువంటిదే. అనేక రైళ్ళు ప్రయాగ్‌రాజ్‌కే ప్రయాణం కడుతూ, వేలాదిమంది యాత్రికులు వాటికోసం ఎదురుచూస్తున్నప్పుడు 'ప్రయాగ్‌రాజ్' అన్న ఒక్కమాట సదరు సామాన్యయాత్రికుల్లో గందరగోళాన్ని సృష్టించడం సర్వసాధారణం. మామూలురోజుల్లోనే ఎక్కాల్సిన రైలు ఎక్కి కూర్చునేంతవరకూ ప్రయాణికుడి మనసులో ఆందోళన నెలకొనే ఉంటుంది. ఈ కుంభమేళాకాలంలో పేరు చివర్లో చిన్నచిన్న మార్పులతో అన్ని రైళ్ళకూ గమ్యస్థానం పేరు తగిలించి, ఒకే సమయంలో వేర్వేరు ప్లాట్‌ఫామ్‌ల మీదకు పలు రైళ్ళను తెస్తే యాత్రికులు గాభరాపడటం సహజం. పైగా, చాలా రైళ్ళు ఆలస్యంగా నడుస్తున్న స్థితిలో ఎదురుచూపుల్లోనే వారి వివేకం, సహనం చచ్చిపోతాయి. స్టేషన్‌లో ఎస్కలేటర్లు పనిచేయడం లేదని, యాత్రికులు దగ్గరతోవలో పోయేందుకు ప్రయత్నించి ప్రాణాలమీదకు తెచ్చుకున్నారని పలు విశ్లేషణలు వింటున్నాం. వాటిని అటుంచితే, చివరి రెండు గంటల్లో యాత్రికుల సంఖ్య విపరీతంగా పెరిగిన స్థితిలో వారిని నియంత్రించడానికి నిర్దిష్టమైన ప్రయత్నాలు జరిగిన దాఖలాలు కూడా లేవు. పావుగంటలో ఇన్ని ప్రాణాలు పోయిన తరువాత, అతివేగంగా వరుసరైళ్ళలో యాత్రికులను తరలించగలిగిన రైల్వేశాఖ ముందుచూపుతో ఎందుకు వ్యవహరించలేకపోయిందో తెలియదు. ఈ ఘటన తరువాత అమలులోకి తెచ్చిన పలురకాల రక్షణలు, జాగ్రత్తలు ముందే ఎందుకు లేవన్నది ప్రశ్న.

ఈ ఘటనకు మూడురోజుల ముందు రైల్వేభవన్‌లో మంత్రి అశ్విన్ వైష్ణవ్ కూర్చొని అన్ని ప్రధాన స్టేషన్లలో రద్దీని సమీక్షిస్తున్న చిత్రాలను మీడియా ప్రసారం చేసింది. పడుతున్న కష్టాన్ని ప్రజలకు చెప్పుకోవడంలో తప్పులేదు కానీ, మీడియా నిర్వహణ కంటే జనసమ్మర్దాన్ని నిర్వహించడం మరీ ముఖ్యం, ఎంతో కష్టం అని ఈ ఘటన గుర్తుచేస్తోంది. రైల్వేమంత్రి రాజీనామాకు విపక్షాలు డిమాండ్ చేయడం సహజం. మూడువందలమంది ప్రాణాలు తీసిన బాలాసోర్ రైలు ప్రమాదం తరువాత కూడా రైల్వేమంత్రి రాజీనామా చేయలేదు. ఆయనకు అటువంటి ఇబ్బంది రాకుండా ఉండేందుకే కాబోలు ఆ ఘోరం జరగగానే చాలా కుట్రసిద్ధాంతాలు తెరమీదకు వచ్చాయి. రైలుదుర్ఘటనలు జరిగినప్పుడు వీలైతే విదేశీశక్తులను, లేకుంటే దేశీకుట్రదారులను తప్పుబట్టి అసలు కారణాలను బయటకు పొక్కనివ్వకపోవడం అనాదిగా జరుగుతున్నదే. ఎన్ఐఏ, సీబీఐ వంటి సంస్థలను రంగంలోకి దించిన ఘోర రైలుప్రమాదాల్లో సైతం నిజం ఇంకా వెలుగుచూడలేదు. ఢిల్లీ తొక్కిసలాట ఘటనను మొదట్లోనే కప్పిపుచ్చడానికి ప్రయత్నించినవారు ఆ నామమాత్రపు దర్యాప్తును సరైనదిశగా సాగనిస్తారా?

పరిశోధనా ప్రమాణాలు ఏమయ్యేను?

విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు ప్రాతిపదికలు. జ్ఞానాన్వేషణలకు, వైజ్ఞానిక ఆవిష్కరణలకు అవి విధానాలు నిర్ణయిస్తాయి. కార్యక్రమాలు రూపొందిస్తాయి. వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాలు, ఇంజినీరింగ్, గణిత శాస్త్రంలో మౌలిక, అనువర్తిత పరిశోధనలకు, సామాజిక, మానవీయ శాస్త్రాలలో విద్వత్ శోధనలు, సమాలోచనలకు; సాహిత్యం, లలిత కళల్లో కొత్త సృజనలకు అవి ఆలంబనలు. ఆ పరిశోధనలు, అన్వేషణలు, సృజనలు అన్నీ వినూత్న సత్యాలను ఆవిష్కరిస్తాయి, కొత్త పరికరాలను రూపొందిస్తాయి, జ్ఞానసీమలను విశాలం చేస్తాయి. క్లిష్ట సమస్యలపై అవగాహనను పెంపొందిస్తాయి. ఒక జాతి అభ్యున్నతికి కొత్త ఆవిష్కరణలు, నవ కల్పనలు, మేధో, కళాత్మక సృజనలు అత్యావశ్యకాలు.

సమాజ పురోగమనానికి, ఆర్థిక వ్యవస్థను సంపద్వంతం చేసేందుకు, నవీకరణకు, ప్రజలు, ప్రాంతాలు, దేశాలు, భూఖండం మొత్తంగా ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు శాస్త్ర పరిశోధనలు, జ్ఞానాన్వేషణలు అత్యావశ్యకం. పరిశోధన, విద్వత్తు, చరిత్ర ద్వారానే మన చరిత్రను, మనలను మనం తెలుసుకుంటాం, వర్తమాన పరిస్థితులను అర్థం చేసుకుని భద్రమైన భవిష్యత్తును నిర్మించుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోగలుగుతాము. అధ్యయనం, ఆవిష్కరణ, జ్ఞానసృష్టి విధులలో భాగంగా విశ్వవిద్యాలయాలు పరిశోధనల్లో నిమగ్నమవుతాయి. ఆ పరిశోధనలు వాటి బోధనా ప్రమాణాలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దోహదం చేస్తాయి. ఆ ప్రమాణాలే అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు బోధించే కళాశాలల నుంచి విశ్వవిద్యాలయాలను భిన్నంగా ఉంచుతాయి. ప్రత్యేకిస్తాయి. మన దేశంలో 1400 విశ్వవిద్యాలయాలు (ప్రభుత్వ, ప్రైవేట్, డీమ్డ్) ఉన్నాయి. 40 వేలకు పైగా కళాశాలలు ఉన్నాయి. అధ్యాపకుల నియామకాలకు, ఆచార్యులుగా పదోన్నతికి అవశ్యమైన అర్హతల విషయమై యూజీసీ నిర్ణీత కాలంలో మార్గదర్శక సూత్రాలు / నిబంధనలు జారీ చేస్తుంది.

కళాశాల, విశ్వవిద్యాలయ అధ్యాపకుల అర్హతల విషయంలో ఎటువంటి భేదాన్ని పాటించదు. కళాశాలల్లోను, విశ్వవిద్యాలయాల్లోను బోధనా సిబ్బంది పదోన్నతుల విషయంలో ఒకే విధమైన ప్రమాణాలను పాటించడం వల్ల నాసిరకం ప్రమాణాలతో కూడిన అకడమిక్ జర్నల్స్ తామరతంపరగా వెలుస్తున్నాయి. అవి విచక్షణారహితంగా 'పరిశోధనా పత్రాలు' ప్రచురిస్తున్నాయి. తొలుత నిశితంగా పరిశీలించి వాటి ప్రచురణ యోగ్యతలను నిర్ధారించే సంపాదకవర్గ పర్యవేక్షణ లేని ఆ జర్నల్స్ వల్ల పరిశోధనా ప్రమాణాలకు తీవ్ర హాని వాటిల్లుతోంది. అటువంటి జర్నల్స్‌ను ప్రోత్సహించడం వల్ల అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, పరిశోధకుల సంఘాలలో భారత్‌కు చాలా చెడ్డ పేరు వస్తోంది. వాసి కంటే రాశికి ప్రాధాన్యమిస్తూ కనీస ప్రమాణాలు లేని పరిశోధనా పత్రాలను అవి ప్రచురిస్తున్నాయి. మరి ఇవి జ్ఞాన వికాసానికి ఎలా దోహదం చేస్తాయి? ఉన్నత విద్యా సంస్థలు అన్నిటినీ కలగలపి వేసే బదులు బోధన, పరిశోధనల ప్రాతిపదికన వాటి మధ్య తేడాల ఆధారంగా వర్గీకరించవలసిన అవసరమున్నది. అప్రామాణిక అకడమిక్ జర్నల్స్‌లో ప్రచురించిన పరిశోధనా పత్రాలు ఆధారంగా నియామకాలు, పదోన్నతులు జరగడం పరిపాటి అయింది. విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులుగా ఉన్న వారి పరిశోధనా పత్రాలు కనీస ప్రమాణాలు కూడా లేనివని ఇటీవల వార్తలు వెలువడ్డాయి. ఆ పరిశోధనా పత్రాల ప్రాతిపదికనే వారు సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందుతున్నారు! విచక్షణారహితంగా పరిశోధనా పత్రాలను ప్రచురిస్తున్న అప్రామాణిక జర్నల్స్ ఉండడం వల్లే ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయనడంలో సందేహం లేదు. ఉన్నత విద్యావ్యవస్థలో ఉన్నత స్థాయిలో ఉన్న వారి వైదుష్య ప్రమాణాలు వాస్తవంగా నాసిరకమైనవి కావడం మన విద్యారంగానికి శోభనిస్తుందా? అవినీతి ఆరోపణలు నెదుర్కొంటున్న అధ్యాపకులను ప్రభుత్వాలు నిస్సిగ్గుగా ఆచార్యులుగా నియమించడం, ఆచార్యులుగా ఉన్న వారిని వీసీలుగా నియమించడం జరుగుతోంది.



akbar

> వీసీల నియామకానికి సంబంధించి యూజీసీ ప్రతిపాదించిన కొత్త ముసాయిదా నిబంధనలు ఆ ప్రక్రియలో రాష్ట్ర గవర్నర్‌కు ప్రాధాన్యమివ్వడాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిరసిస్తున్నాయి. ఇదే సమయంలో అకడమిక్ జర్నల్స్‌కు సంబంధించి UGC CARE జాబితాను పూర్తిగా రద్దు చేస్తూ యూజీసీ నిర్ణయం తీసుకున్నది. మన విశ్వవిద్యాలయాలలో పరిశోధనల ప్రమాణాలను ప్రతికూలంగా ప్రభావితం చేసే నిర్ణయమిది. రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యావేత్తలు ఈ నిర్ణయాన్ని మాత్రం పట్టించుకోకపోవడం ఆశ్చర్యం.

పరిశోధనల నేపథ్యాన్ని, నాణ్యతను కనీసమాత్రంగానైనా పరిశీలించకుండా ఇలా నియామకాలు జరపడం గర్హనీయం. వీసీల నియామకానికి సంబంధించి ఇటీవల కొత్త ముసాయిదా నిబంధనలను ప్రజల పరిశీలనకు నివేదించింది. అత్యున్నత స్థాయి నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి అధినేతలకు కాకుండా రాష్ట్ర గవర్నర్‌కు ప్రాధాన్యమివ్వడం పలు రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిరసన తెలుపుతున్నాయి. అయితే అకడమిక్ జర్నల్స్‌కు సంబంధించి UGC CARE జాబితాను పూర్తిగా రద్దు చేస్తూ యూజీసీ ఇటీవల నిర్ణయం తీసుకున్నది. మన విశ్వవిద్యాలయాలలో పరిశోధనల ప్రమాణాలను తీవ్రంగా ప్రభావితం చేసే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోకపోవడం విస్మయకరంగా ఉన్నది. ఉన్నత విద్యా రంగంలో అత్యున్నత స్థాయి బాధ్యతలకు ఎంపిక చేసే ఆచార్యుల అర్హతల విషయంలో రాజీ పడుతున్నప్పుడు పరిశోధనా పత్రాలు ప్రచురించే అకడమిక్ జర్నల్స్ నాణ్యత ఉత్కృష్టంగా ఉండేలా ఎలా చేయగలం?

2010లో జారీ చేసిన నిబంధనల కారణంగా యూజీసీ 2018లో అప్రామాణిక అకడమిక్ జర్నల్స్‌పై దృష్టి పెట్టింది. పరిశోధనా పత్రాలను నిశితంగా పరిశీలించకుండా, వాటి మంచి చెడ్డలను నిర్ణయించకుండా సులువుగా ప్రచురించే అవకాశాలు ఉండడంతో తమ పదోన్నతిని దృష్టిలో ఉంచుకుని పరిశోధనా పత్రాలను ప్రచురించడం విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, ఆచార్యులకు ఆనవాయితీ అయిపోయింది. అయితే UGC CARE జాబితాలో చేర్చాలని విశ్వవిద్యాలయాలు సూచించిన జర్నల్స్‌లో 88 శాతం నాసిరకం ప్రమాణాలతో ఉన్నవేనని తేలింది. సత్ సంకల్పంతోనే జారీ చేసిన నిబంధనలు పూర్తిగా దుర్వినియోగమైపోయాయి. ప్రచురించడం లేదా వెనుకబడి పోవడం అనే ధోరణి అధ్యాపక లోకంలో బాగా పెరిగిపోయింది.

ఈ వాస్తవాల దృష్ట్యా UGC List of Journalsలో వెలువడుతున్న పరిశోధనా పత్రాల ప్రమాణాలను విశ్లేషించి, పూణేలోని సావిత్రీబాయి పూలే విశ్వవిద్యాలయంలోని 'సెంటర్ ఫర్ పబ్లికేషన్స్ ఎథిక్స్' పరిశోధనా పత్రాల ప్రచురణకు మార్గదర్శక సూత్రాలను రూపొందించింది. వీటి ప్రేరేపణతో ఉన్నత విద్యా సంస్థల ప్రమరణ ప్రమాణాలను నిర్దేశించి, నియంత్రించే బాధ్యతను యూజీసీ చేపట్టింది. ఆ మేరకు 'Reference List of Quality Journals' నిర్వహించేందుకు 'Consortium For Academic and Research Ethics'ను నెలకొల్పింది. ఈ చర్య ద్వారా యూజీసీ జాబితా నుంచి వందలాది అప్రామాణిక అకడమిక్ జర్నల్స్‌ను తొలగించడం జరిగింది. ఈ జాబితాను ప్రతి మూడు నెలలకు ఒకసారి అప్‌డేట్ చేసే ఆనవాయితీని కూడా యూజీసీ పాటించింది. ఇది పరిశోధనా రంగంలో ఉత్కృష్ట ప్రమాణాలను నెలకొల్పిందనడంలో సందేహం లేదు. దురదృష్టవశాత్తు యూజీసీ ఇటీవల UGC CARE జాబితాను రద్దుచేసింది. ఈ నిర్ణయం వల్ల అంతర్జాతీయ ఉన్నత విద్యా రంగంలో మన దేశానికి మళ్లీ అప్రతిష్టపాలయ్యే ప్రమాదమెంతైనా ఉన్నది. యూజీసీ నిర్ణయం వల్ల పరిశోధన పత్రాలు ప్రచురించే జర్నల్స్ నాణ్యత విషయంలో విశ్వవిద్యాలయాలు రాజీపడే అవకాశమున్నది. ఇది ఎవరికి మేలు చేస్తుంది?

దీనివల్ల అప్రామాణిక జర్నల్స్ ప్రచురణ మళ్లీ పెరుగుతుంది. పైగా యూజీసీ ఇటీవల జారీ చేసిన ముసాయిదా రెగ్యులేషన్స్ ప్రకారం ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ పదోన్నతికి మూడు పరిశోధన పత్రాలు ప్రచురిస్తే సరిపోతుంది; అలాగే ఒక అసోసియేట్ ప్రొఫెసర్ ఏడు పరిశోధన పత్రాల ప్రచురణతో పదోన్నతి పొందే అవకాశమున్నది. గతంలో పదోన్నతికి ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ UGC CARE జాబితాలోని జర్నల్స్‌లో ఏడు పరిశోధనా పత్రాలు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్ పది పరిశోధనా పత్రాలను ప్రచురించవలసి ఉండేది. యూజీసీ ఒక పక్క ముసాయిదా మార్గదర్శక సూత్రాలు జారీ చేసి మరోపక్క UGC CARE జాబితాను రద్దు చేసింది! అంతేకాకుండా అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు పదోన్నతికి ప్రచురించాల్సిన పరిశోధనా పత్రాల సంఖ్యను కూడా తగ్గించింది! ఇది ఉన్నత విద్యా ప్రమాణాల ఉన్నతికి ఎలా దోహదం చేస్తుంది?

యూజీసీ కేర్ జాబితా ఉన్న కారణంగా కనీసం గత ఆరు సంవత్సరాలుగా ఆ జాబితాలోని జర్నల్స్‌లో తమ పరిశోధనా పత్రాలు ప్రచురితమయ్యేందుకు అధ్యాపకులు, ఆచార్యులు శ్రద్ధ చూపారు ఈ జాబితాను రద్దు చేయడం వల్ల ప్రతి విశ్వవిద్యాలయం తన సొంత జర్నల్స్ జాబితాను అనుసరిస్తుంది. ఇది గందరగోళానికి తప్పక దారితీస్తుంది. UGC CARE జాబితాకు ప్రత్యామ్నాయంగా మరింత పటిష్టమైన యంత్రాంగం లేనిపక్షంలో పరిశోధనా ప్రమాణాలు మళ్లీ పడిపోవడం ఖాయం. UGC CARE జాబితా రద్దు నిర్ణయంలోని అంతస్సూచనలు, పర్యవసానాలను అర్థం చేసుకుని, విశ్వవిద్యాలయాల బోధనా సిబ్బంది నియామకాలలో అత్యున్నత స్థాయి ప్రమాణాలను రాష్ట్ర ప్రభుత్వాలు పాటించాలి.



▪ అప్పారావు పొదిలె
మాజీ వీసీ
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

మూడు భవనాలు, ముగ్గురు మాజీలు!

హైదరాబాద్‌లోని ప్రగతి భవన్, విశాఖపట్నంలోని రుషికొండ ప్యాలస్, ఢిల్లీలోని శీష్ మహల్.. ఈ మూడు భవనాలూ ఇటీవల దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచాయి. ప్రగతి భవన్‌ను తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, రుషికొండ ప్యాలస్‌ను ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్‌రెడ్డి వారి హయాంలో నిర్మించగా, శీష్ మహల్ ఆధునీకరణకు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన హయాంలో శ్రీకారం చుట్టారు. అత్యాధునిక వసతులతో కూడిన ఈ మూడు భవనాలు ఎంత ప్రాచుర్యం పొందాయో, అంతకు రెట్టింపు స్థాయిలో విమర్శలపాలయ్యాయి. వీరు ముగ్గురూ మాజీలు కావడంలో వాటి పాత్ర కాదనలేనిది.

హైదరాబాద్ నడిబొడ్డులో ఉన్న ఐఏఎస్, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారుల నివాస గృహాలను నేలమట్టం చేసి అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యాధునిక సౌకర్యాలతో ప్రగతిభవన్‌ను నిర్మించారు. దానిని ముఖ్యమంత్రి అధికారిక నివాసగృహంగా, సీఎం క్యాంప్ ఆఫీసుగా ప్రకటించి అక్కడినుంచే పాలనా వ్యవహారాలు చూసుకున్నారు. ఆ కాలంలో కేసీఆర్ రాష్ట్ర సచివాలయానికి వెళ్ళిన దాఖలాలు లేవు. ప్రగతిభవన్‌లోకి కేవలం ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు, ప్రముఖులకు మాత్రమే ప్రవేశం ఉండేది. సామాన్య ప్రజలకు, కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడినవారికి ప్రవేశం లేకపోవడం ఆయన నియంతృత్వ పోకడలకు నిదర్శనమని రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ఉధృతంగా ప్రచారం చేసింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ గడీ గోడలు బద్దలు కొట్టి, సామాన్య ప్రజలకు ప్రవేశం కల్పిస్తామని ప్రకటించింది. అధికారంలోకి రాగానే ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి గేట్లు తొలగించారు, అందులో ప్రజావాణి కార్యాలయాన్ని నెలకొల్పారు.



> శాశ్వతంగా తామే ముఖ్యమంత్రులం అన్నరీతిలో కేసీఆర్, జగన్, కేజ్రీవాల్ తమ హయాంలో ప్రగతిభవన్, రుషికొండ ప్యాలస్, శీష్ మహళ్ళ నిర్మాణానికి భారీగా ప్రజాధనాన్ని వెచ్చించడం శోచనీయం. ముఖ్యమంత్రులకు అధికారిక నివాస గృహాలు, క్యాంప్ ఆఫీసులు ఉండాల్సిందే కానీ, వాటిని విలాసవంతమైన దర్బార్లుగా మార్చేందుకు వందల కోట్లు ఖర్చుచేయడం సరికాదు.

అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ఫ్లాగ్ స్టాఫ్ రోడ్డు, సివిల్ లైన్స్‌లో ఉన్న ఆరో నెంబరు బంగ్లాను తన అధికారిక నివాసంగా ఉపయోగించారు. ఆ సమయంలో ఆ బంగ్లాను అత్యాధునిక వసతులతో కేజ్రీవాల్ ఆధునీకరించారు. దీనికి సుమారు రూ.80కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ పరిణామమే కేజ్రీవాల్ పాలిట శాపంగా మారింది. సకల సౌకర్యాలతో ఆధునీకరించిన ఈ బంగ్లాను అయిదు నక్షత్రాల వసతులతో కూడిన అద్దాలమేడ (శీష్ మహల్)గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణిస్తూ కేజ్రీవాల్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. లిక్కర్ స్కామ్ కూడా దీనికి తోడవటంతో బీజేపీ ధాటికి ఆప్ ఉక్కిరిబిక్కిరి అయ్యింది. పర్యవసానంగా ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ పార్టీతో పాటూ స్వయంగా దాని అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఓటమి పొందారు. ఆప్ అధికారాన్ని కోల్పోయాక కేజ్రీవాల్ కోట్లాది రూపాయలు వెచ్చించి ఆధునీకరించిన శీష్ మహల్‌పై తలెత్తిన వివాదాల నేపథ్యంలో కొత్త ప్రభుత్వం కూడా దానిని ఉపయోగించుకునే పరిస్థితి కనిపించడం లేదు.

ఇక, ఆంధ్రప్రదేశ్‌లో రుషికొండ ప్యాలస్ నిర్మాణాలపై అనేక విమర్శలు వెల్లువెత్తినా జగన్ వాటిని బేఖాతరు చేశారు, తాను కోరుకున్నట్టుగా దానిని పూర్తి చేశారు. ఆ ప్యాలస్ ఫోటోలు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జగన్ ఓటమి పాలై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగుదేశం నేతలు ఆ భవనాల ఫోటోలు బయటపెట్టారు. ఆ విలాసాల్ని చూసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలతో పాటు యావత్ దేశ ప్రజలు బిత్తరపోయారు. రుషికొండపై ఆ రాజసౌధాల నిర్మాణానికి రూ.500కోట్లకు పైగా జగన్ ఖర్చు చేసినట్లు విపక్ష పార్టీలు చెపుతున్నాయి. ఈ భవనాల నిర్మాణంలో జాతీయ పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల పరిరక్షణ సంస్థ నియమాలను జగన్ ప్రభుత్వం ఉల్లంఘించింది. వైసీపీ వర్గాలు కాదంటున్నప్పటికీ ముఖ్యమంత్రి అధికారిక నివాసం, క్యాంప్ ఆఫీసు కోసమే రుషికొండపై ఈ ఇంద్రభవనాలను నిర్మించినట్లు ప్రజలు బలంగా విశ్వసించారు. జగన్ రాజకీయాలలో ఉన్నంత వరకు రుషికొండ ప్యాలస్ నిర్మాణాలు విపక్ష పార్టీలకు రాజకీయ విమర్శనాస్త్రాలుగా ఉపయోగపడతాయి. వందల కోట్ల రూపాయలతో నిర్మించిన ఆ ప్రభుత్వ భవనాలు ఇప్పుడు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ఎలా ఉపయోగించుకోవాలో ప్రస్తుత ప్రభుత్వ పెద్దలకు కూడా అర్థం కావడం లేదు.


ముఖ్యమంత్రులకు ప్రభుత్వపరంగా స్థిరమైన అధికారిక నివాస గృహాలు, క్యాంప్ ఆఫీసులు ఉండాల్సిందే. కానీ దీనిని ఆసరా చేసుకుని వాటిని విలాసవంతమైన దర్బార్లుగా మార్చేందుకు వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం ఏ మాత్రం సరికాదు. ముఖ్యమంత్రుల అధికారిక నివాస గృహాలు ప్రజల సొమ్ముతో నిర్మించతలచినప్పుడు పాలకులు కచ్చితంగా కొన్ని నియమాలు పాటించాలి. సదరు నివాసాలను ఎక్కడ, ఎందుకు, ఎంత ఖర్చుతో నిర్మించబోతున్నదీ, వాటి ప్లాన్ ఎలా ఉన్నదీ క్యాబినెట్ సమావేశాల్లో చర్చించాలి, శాసనసభకూ తెలియచేయాలి. ప్రజాక్షేత్రంలో ఆ వివరాలన్నీ ఉంచి, అందరి ఆమోదంతో ముందుకు వెళ్ళాలి. ఇటువంటి కనీస నియమాలు పాటించకుండా, శాశ్వతంగా తామే ముఖ్యమంత్రులం అన్నట్లుగా కేసీఆర్, జగన్, కేజ్రీవాల్‌లు తమ హయాంలో ప్రగతిభవన్, రుషికొండ ప్యాలస్, శీష్ మహళ్ళ విషయంలో వ్యవహరించడం శోచనీయం. జవాబుదారీతనాన్ని విస్మరించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన ఎంత గొప్ప నాయకుడైనా ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

• కైలసాని శివప్రసాద్

అభ్యుదయ సాహిత్యోద్యమ యోధుడు

కమ్యూనిస్టు ఉద్యమం ఎందరో సామాన్యులను కవులుగా, రచయితలుగా, ప్రజా కళాకారులుగా తయారు చేసింది. అలాంటి వారిలో ప్రముఖుడైన అభ్యుదయ రచయిత, కవి కాగితాల రాజేశ్వరరావు కమ్యూనిస్టు ఉద్యమంతో మమేకమై అభ్యుదయపథమే తన జీవన విధానంగా బతికినవాడు.

తెలుగు బాలల్లో శాస్త్రీయ భావాల వ్యాప్తి కోసం విశాలాంధ్ర వెలువరించిన 'చిన్నారి లోకం' మాసపత్రికకు దశాబ్ద కాలం (1985–1995) సంపాదకుడిగా ఉన్న రాజేశ్వరరావు (కేరా) మూడున్నర దశాబ్దాలు విద్యార్థి, యువజన, ప్రజా నాట్యమండలి, కమ్యూనిస్టు ఉద్యమాల్లో అవిశ్రాంతంగా పనిచేశాడు. అన్ని సాహిత్య ప్రక్రియలలోనూ ప్రవేశం ఉన్నా అభ్యుదయ కవిగానే ప్రసిద్ధి పొందాడు. విజయవాడ నగర కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన కాగితాల కృష్ణమూర్తి రెండో కుమారుడిగా, తండ్రి సాంస్కృతిక, ఉద్యమ వారసత్వాన్ని కేరా పుణికిపుచ్చుకున్నాడు. విజయవాడ వన్ టౌన్‌లోని హిందూ హైస్కూల్లో ఎస్ఎస్ఎల్‌సీ వరకు మాత్రమే చదివినప్పటికీ తెలుగు భాషపై గట్టి పట్టు, అపార పద సంపద రాజేశ్వరరావు సాధించాడు. మిలిటెంట్, సౌమ్య, స్నేహ, చిన్నారి లోకం మాసపత్రికలకు సంపాదకుడిగా వ్యవహరించాడు. చురకత్తుల్లాంటి పదాలతో కష్టజీవుల కడగండ్లు కవనంలో పలికించాడు. కన్నీటి హృదయాలను సమర పతాకాలుగా మలిచాడు. మాత్రాబద్ధ ఛందస్సులో నిప్పులు కురిపించి తనకు కవితా స్ఫూర్తి గురువైన గజ్జెల మల్లారెడ్డిని అబ్బురపరిచాడు. భారత కమ్యూనిస్టు పార్టీ 10వ మహాసభలు 1975లో విజయవాడలో జరిగినప్పుడు అందులో ప్రదర్శించిన 'జనశ్రేణి కదిలింది' నృత్య నాటిక ఎన్నో ప్రశంసలు పొందింది. అధిక ధరలపై, రైతు శ్రామికుల ఐక్య పోరాటంతో భూస్వామ్య శక్తులను ఓడించటం అనే కథాంశంతో రాజేశ్వరరావు ఈ నృత్యనాటిక రచించాడు. 1984, 1985 సంవత్సరాల్లో భారత ప్రభుత్వం, వయోజన విద్యా శాఖ నిర్వహించిన పోటీలో 'వెలుగు బాట' రచనకు, NCERT బాలసాహిత్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీలలో వాణీరంగారావుతో కలిసి 'శ్రీహరికోట' రచనకు బహుమతి అందుకున్నారు.



"సాహిత్యంలో సవ్యసాచి" అని సొదుం రామ్మోహన్; "ఛందోతరంగవేది రాజేశ్వరరావు. ఇలాంటివాళ్ళు ఇక ముందు దొరకటం కష్టం. ఇంత పాండిత్యం, ఇంత ప్రతిభ ఒక వ్యక్తిలో ఉండటం అరుదైన విషయం" అని చేకూరి రామారావు; "అభ్యుదయ సాహిత్యోద్యమ యోధుడు కేరా" అని చందు సుబ్బారావు; "అభ్యుదయోద్యమ ఉత్తుంగ తరంగం రాజేశ్వరరావు" అని తెలుగు యూనివర్సిటీ రిటైర్డ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్వీ సత్యనారాయణ లాంటి ప్రముఖ సాహితీ విమర్శకులు, ఆప్తులు రాజేశ్వరరావుకు కితాబు ఇచ్చారు.

కొవ్వొత్తిలాగా కాలిపోతున్నా వెలుగును చిమ్ముతూనే బతికిన కవి కాగితాల రాజేశ్వరరావు. ఇంటి పేరు సార్థకమై అతని సంపదనంతా కాగితాలకే పరిమితమైపోయింది. అగ్నిని కడుపులో దాచుకుని పూలు కక్కినట్లు (ఇది ఖలీల్ జీబ్రాన్ సూక్తి) కమ్యూనిస్టు ఉద్యమంలో ఎదిగి ఒదిగిన గొప్ప కవి రాజేశ్వరరావు.

– కె. రాజశేఖర్

(నేడు కాగితాల రాజేశ్వరరావు వర్ధంతి)

స్వదేశీ ఏఐ అభివృద్ధి ఏదీ?

కృత్రిమ మేధస్సు (ఏఐ–AI) ప్రపంచ సాంకేతిక దృశ్యాన్ని మార్చుతున్న యుగంలో, భారతదేశం ఒక కీలకమైన మలుపు దగ్గర ఉన్నది. ఐటీ శక్తిగా మన దేశానికి ఎంతో ఖ్యాతి, విశాలమైన సాంకేతిక ప్రతిభ ఉన్నప్పటికీ, ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ఇంకా స్వంతంగా ఏఐ ప్లాట్‌ఫామ్‌లను అభివృద్ధి చేయలేదు.

టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ దిగ్గజాలను ప్రపంచానికి అందించిన దేశం మనది. కానీ OpenAI నుంచి విడుదలైన ChatGPTకు లేదా చైనాకు చెందిన DeepSeekకు సమానమైన స్వంత ఏఐ ఉత్పత్తులను మనం ఇంకా తయారు చేయలేదు. ఈ లోటు ఇప్పుడు మన ముందు ఒక పెద్ద సవాలును నిలబెట్టింది: అది సేవా ప్రదాత స్థాయి నుంచి ఉత్పత్తి సృష్టికర్త స్థాయికి ఎదగాల్సిన సవాలు. ఈ దిశగా పెట్టుబడి, పరిశోధనలతో పాటు– ప్రభుత్వ – ప్రైవేట్ సంస్థల మధ్య మరింత సమగ్ర సహకారం అవసరం.

భారతదేశంలో కొన్ని ఏఐ అంకుర సంస్థలు లేకపోలేదు. కానీ భారీగా నిధులు పొందిన పాశ్చాత్య, చైనీస్ ప్రత్యర్థులతో అవి పోటీపడలేక ఇబ్బందిపడుతున్నాయి. ఏఐ అభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాలు పరిమితంగా లభించడం, అధిక కంప్యూటింగ్ ఖర్చులు, అంకితభావంతో కూడిన ఏఐ పరిశోధనా కేంద్రాల కొరత ఇక్కడ అడ్డంకులుగా ఉన్నాయి. ప్రపంచ స్థాయిలో పోటీ పడగల స్వదేశీ ఏఐను అభివృద్ధి చేయాలంటే ముందుగా ఈ సమస్యలను పరిష్కరించడం అత్యవసరం.

సరైన మౌలిక సదుపాయాలు, నిధులు లేకుండా, స్వదేశీ ఏఐ అభివృద్ధి దాదాపు అసాధ్యం! ప్రస్తుతం దేశంలో అధునాతన ఏఐ మోడల్‌లకు శిక్షణ ఇవ్వడానికి అవసరమైన పెద్ద స్థాయి కంప్యూటింగ్ క్లస్టర్‌లు, అధిక శక్తిగల జీపీయూలు తదితర మౌలిక సదుపాయాలు లేవు. ఓపెన్‌ఏఐ వంటి కంపెనీలు బిలియన్ల డాలర్ల పెట్టుబడులను పొందుతున్నాయి (మైక్రోసాఫ్ట్ నుంచి $13 బిలియన్ల మద్దతుతో సహా). భారతదేశంలో ఏఐ ఆవిష్కరణల కోసం వెంచర్ కాపిటల్ ఇంకా శైశవ దశలో ఉన్నది. పెట్టుబడిదారులు దీర్ఘకాలిక పరిశోధన ప్రాజెక్టుల కంటే త్వరిత రాబడులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ పెట్టుబడి కొరత ప్రపంచ వ్యాప్తంగా పోటీపడగల అత్యాధునిక ఏఐ సాంకేతికతలను అభివృద్ధి చేయకుండా మన దేశాన్ని అడ్డుకుంటున్నది. ఈ అడ్డంకిని అధిగమించాలంటే ప్రభుత్వం మౌలిక సదుపాయాల విషయంలో చొరవ చూపాలి. ప్రభుత్వ నిధులతో నడిచే సూపర్ కంప్యూటింగ్ సౌకర్యాలు, అంకితభావంతో కూడిన ఏఐ పరిశోధనా కేంద్రాల స్థాపన, ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు అవసరమైన వనరులు ప్రభుత్వం కల్పించాలి.

రిలయన్స్ జియో వంటి ప్రైవేట్ సంస్థలు డిజిటల్ సౌకర్యాలను విప్లవాత్మకంగా మార్చాయి. కోట్ల మందికి వేగవంతమైన ఇంటర్నెట్‌ను అందుబాటులో ఉంచాయి. ఈ డిజిటల్ అభివృద్ధి ఆరోగ్య సంరక్షణ నుంచి, విద్య, వ్యవసాయం వరకు అన్ని రంగాల్లో విస్తృత ఏఐ వినియోగానికి పునాదిని వేయగలదు. ఇక్కడ 1.3 బిలియన్లకు పైగా పౌరులు ఆధార్‌లో నమోదు చేసుకోవటం, యూపీఐ ద్వారా నెలకు 8 బిలియన్ల లావాదేవీలు జరగడం మొదలైన ఋజువులను బట్టి పెద్దస్థాయి డిజిటల్ పరిష్కారాలను అమలు చేయగల సామర్థ్యం మన దేశానికి ఉందని అర్థమవుతుంది.

భారతదేశ విద్యా వ్యవస్థ సంవత్సరానికి 1.5 మిలియన్లకు పైగా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను ఉత్పత్తి చేస్తున్నది. గొప్ప ఏఐ కార్యబలాన్ని నిర్మించడానికి విశాల సామర్థ్యాన్ని అందిస్తున్నది. అయితే, ఈ ప్రతిభను పూర్తిగా వినియోగించుకోవడానికి, పాఠశాల నుండి ఉన్నత విద్య వరకు విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. సాంకేతికతపై ఆసక్తిని పెంపొందించడానికి పాఠశాల స్థాయిలో ఏఐ అక్షరాస్యత, కోడింగ్, సమస్య పరిష్కార నైపుణ్యాలను పరిచయం చేయాలి. కళాశాల స్థాయిలో ప్రాక్టికల్ ఏఐ ప్రాజెక్టులు, అంతర్విభాగ అభ్యాసాలు, ఏఐ నైతికతపై చర్చలు అమలు జరపాలి. విశ్వవిద్యాలయాలు అధునాతన ఏఐ, మెషిన్ లెర్నింగ్, పరిశ్రమ సమన్వయం వంటి అంశాల్లో పాఠ్య ప్రణాళికను తయారు చేయాలి. ఈ అంశంలో విద్యా సంస్థలకు పరిశ్రమలకు మధ్య వారధి ఏర్పడాలి. పరిశ్రమలలో తప్పనిసరి ఇంటర్న్‌షిప్‌లు, మెంటర్‌షిప్ కార్యక్రమాలు జరగాలి.



> ప్రపంచ శక్తి సమీకరణాల్లో ఏఐ ప్రధానపాత్ర పోషిస్తున్న ఈ దశలో భారతదేశం కేవలం సేవల ప్రదాతగానే మిగిలిపోతే, అంతర్జాతీయంగా తన ప్రభావాన్ని కోల్పోతుంది. విదేశీ సాంకేతికతపై ఆధారపడకుండా, భారతదేశం తన స్వంత ఏఐ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడం అత్యవసరం.


ఏఐ విషయంలో సమగ్ర వ్యూహం అవసరం. ఇటీవల భారత ప్రభుత్వం ప్రకటించిన రూ.10,000 కోట్లు ఈ దిశగా తీసుకున్న సరైన చర్య. ఈ పెట్టుబడి ఇంకా ఎక్కువగా, ఈ అంశంలో ప్రపంచ స్థాయిలో మన పోటీదారులతో సమానంగా ఉండాలి. అలాగే అమెరికాలోని 'DARPA', లేక చైనాలోని ఏఐ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ లాంటి ప్రత్యేక ఏఐ పరిశోధనా సంస్థను ఏర్పాటు చేయాలి.


స్వదేశీ ఏఐ మోడల్స్ భారతీయ భాషలను, స్థానిక సందర్భాలను బాగా అర్థం చేసుకునేలా ఉండాలి. 22 అధికారిక భాషలు, 1600కి పైగా ఉప భాషలతో, భారతదేశంలో ఏఐ అభివృద్ధికి ప్రత్యేకమైన సవాళ్లు ఉన్నాయి. ఈ ఏఐ మోడళ్లు కేవలం భాషలను మాత్రమే కాకుండా, భారతీయ సంస్కృతీ లక్షణాలను, కమ్యూనికేషన్ సందర్భాలను అర్థం చేసుకోవాలి. దీనిని సాధించడానికి, భారతదేశం ప్రాంతీయ భాషలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టే ఏఐ పరిశోధనా కేంద్రాలను నెలకొల్పాలి. నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (NLP) మోడళ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టి, భిన్న ప్రజా సమూహాల కోసం ప్రత్యేకమైన ఏఐ పరిష్కారాలను రూపొందించాలి.

ప్రపంచ శక్తి సమీకరణాల్లో ఏఐ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ దశలో భారతదేశం కేవలం సేవల ప్రదాతగానే మిగిలిపోతే, అంతర్జాతీయంగా తన ప్రభావాన్ని కోల్పోతుంది. స్వదేశీ ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడం కేవలం వ్యాపార అవకాశాల కోసం మాత్రమే కాదు; ఇది డిజిటల్ స్వాయత్తతకు, జాతీయ భద్రతకు సంబంధించిన అంశం. రక్షణ, సైబర్ భద్రత, ఆరోగ్య సంరక్షణ, పాలన వంటి రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషించనుంది. విదేశీ సాంకేతికతపై ఆధారపడకుండా, భారతదేశం తన స్వంత ఏఐ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడం అత్యవసరం.

భారతదేశం ఐటీ సేవా రంగంలో సాధించిన ప్రఖ్యాతిని రాబోయే దశాబ్దంలో ఏఐలోనూ సాధిస్తుందా లేదా అన్నది కీలకం. సరైన పెట్టుబడి, దూరదృష్టి, సమర్థవంతమైన అమలు ఉంటే, భారతదేశం ఒక గ్లోబల్ ఏఐ శక్తిగా ఎదగగలదు. అమెరికా, చైనా ఏఐ మోడళ్లకు ప్రత్యామ్నాయాలను అందించే సమర్థవంతమైన దేశంగా మారగలదు. ప్రపంచ దేశాలు ఏఐ ప్రభావాలను అర్థం చేసుకుంటున్న ఈ సమయంలో భారతదేశం ఈ మార్పులో విజయం సాధిస్తే, అభివృద్ధి చెందుతున్న దేశాలకు గ్లోబల్ ఏఐ రంగంలో తమ స్థానాన్ని ఎలా ఏర్పాటు చేసుకోవాలో ఒక కొత్త నమూనాను అందించగలదు. ముందుకు సాగాల్సిన మార్గం స్పష్టంగా ఉంది: ఏఐ మౌలిక సదుపాయాల్లో భారీగా పెట్టుబడులు పెట్టాలి; స్వదేశీ ఆవిష్కరణలను ప్రోత్సహించాలి; విద్యా వ్యవస్థను నవీకరించాలి; ప్రభుత్వ –ప్రైవేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహించాలి. భారతదేశ సాంకేతిక భవిష్యత్తుకై నిర్ణయాత్మక చర్య తీసుకోవాల్సిన సమయం ఇదే.

◆ ఎన్. శివప్రసాద్
విశ్రాంత ఆచార్యులు, ఐఐటీ మద్రాస్




సిద్ధమవుతున్న పూజా మందిరాల భవన సముదాయం


యాగశాల


తుదిదశకు చేరుకుంటున్న అన్నదాన సముదాయం

మల్టీ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై కసరత్తు

శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో కీలకమైన మల్టీ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై దేవస్థాన అధికారులు కసరత్తు చేస్తున్నారు. దుర్గగుడిని శాశ్వతంగా అభివృద్ధి చేయటానికి వీలుగా మాస్టర్ ప్లాన్‌కు శ్రీకారం చుడుతున్న సంగతి తెలిసిందే. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్న నేపథ్యంలో పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టేందుకు ఈ మల్టీ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై దృష్టిసారించారు. ప్రస్తుతం ఘాట్‌రోడ్డులో కింద నుంచి పైవరకు సుమారు 150 కార్లు, కనకదుర్గానగర్‌లో సుమారు 100 కార్లకు పార్కింగ్ మాత్రమే ఉంది. మిగిలిన కార్లను పార్కింగ్ చేయటానికి భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఆలయ అధికారులు కనకదుర్గానగర్‌లో అభివృద్ధి పనులు చేపట్టారు. ఫలితంగా ఆ ప్రాంతంలోకి వాహనాలను అనుమతించడం లేదు. ఇందుకు ప్రత్యామ్నాయంగా దేవస్థానం అధికారులు విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని వాడుకుంటున్నారు. అయినా వాహనాలు పెద్ద సంఖ్యలో రావటంతో పార్కింగ్‌కు సమస్యగానే ఉంది. ఈ నేపథ్యంలో మల్టీ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయితే పార్కింగ్ సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉంటుంది.

చకచకా

దుర్గగుడి అభివృద్ధి పనులు వేగవంతం

రెండు, మూడు నెలల్లో కీలక పనులు పూర్తి

(ఇంద్రకీలాద్రి, ఆంధ్రజ్యోతి) : దుర్గగుడి మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ మాస్టర్ ప్లాన్‌లో అన్నదాన భవనం, లడ్డూ ప్రసాదం తయారీ (పోటు) భవనం, కొండ పైన యాగశాల, పూజా మండపాలు, కనకదుర్గానగర్‌లో ఎలివేటెడ్ క్యూలు, ఘాట్‌రోడ్డులో కొండకు సుమారు 260 మీటర్ల షాక్ క్రీటింగ్‌తో పాటు ఘాట్‌రోడ్డుకు సమాంతరంగా కనకదుర్గానగర్‌లో సుమారు రూ.40 కోట్లతో జీప్లస్10 మల్టీ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, ఇంకా పలు అభివృద్ధి పనులు ఉన్నాయి. ఇప్పటికే కొండపైన సుమారు రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్లతో యాగశాల, సుమారు రూ.2.5 కోట్లతో పూజా మండపాల భవనం నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ అభివృద్ధి పనులు రెండు, మూడు నెలల్లో పూర్తికానున్నాయి. శివాలయం మెట్ల పక్కన అన్నదాన భవన సముదాయం, మహామండపం ఎదురుగా లడ్డూ ప్రసాదం తయారీ భవన సముదాయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రెండు భవన సముదాయాలను దసరాలోపు పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావటానికి చర్యలు తీసుకుంటు న్నారు. దేవదాయ శాఖ కమిషనర్, దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్, పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సుజనాచౌదరి తరచూ ఈ మాస్టర్ ప్లాన్లపై సమావేశాలు నిర్వహిస్తున్నారు.




అస్తవ్యస్తంగా ఉన్న ఘాట్ పరిసరాలు

సమస్యల సంగమం

అపరిశుభ్రం, నిర్మానుష్యంగా పవిత్ర సంగమం ఘాట్

- గతంలో టీడీపీ హయాంలో పర్యాటక కేంద్రంగా వెలుగు
- వైసీపీ హయాంలో నిత్యహారతులు నిలిపివేత
- నిలిచిపోయిన భక్తుల రాక..
- అస్తవ్యస్తంగా పరిసరాలు
- మహాశివరాత్రికైనా బాగుచేయాలని కోరుతున్న భక్తులు

గతంలో టీడీపీ హయాంలో ఓ వెలుగు వెలిగిన ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమ ప్రాంతం నేడు అందవిహీనంగా మారింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ నిత్య హారతులను నిలిపివేయడంతో ఈ ఘాట్‌వైపు చూసేవారే కరువయ్యారు. ఫలితంగా పవిత్రమైన ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా, అపరిశుభ్రతతో అస్తవ్యస్తంగా మారిపోయింది. టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మహాశివరాత్రి నాటికైనా పవిత్ర సంగమం ఘాట్‌ను బాగుచేయించాలని భక్తులు కోరుతున్నారు.

8లో

లోటస్ లోగుట్టు..!

లోటస్ ల్యాండ్‌మార్క్‌లో దుర్గగుడి స్థలం ఉందా?

ఓ సామాజిక కార్యకర్త ఫిర్యాదుతో విచారణ మొదలు

నగరంలో ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీగా ఉన్న లోటస్ ల్యాండ్‌మార్క్‌లో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూమి ఉందా? ఆ భూమిని కలుపుకొని లోటస్‌లో నిర్మాణాలు చేపట్టారా? దేవస్థాన రికార్డుల్లో కనిపించని వివరాలు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయా? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. ఓ సామాజిక కార్యకర్త చేసిన ఫిర్యాదుతో దుర్గగుడి అధికారులు కళ్లు తెరిచారు. ఈ అంశం మూడు శాఖల మధ్య దుమారాన్ని రేపుతోంది.

- లోటస్‌లో ఆలయ స్థలం ఉందని లేఖ
- రెవెన్యూ రికార్డుల్లోనూ కనిపించిన భూమి
- శ్రీకనకదుర్గ నగరోత్సవం పేరుతో 11.54 ఎకరాలు
- దేవస్థాన రికార్డుల్లో మాత్రం కనిపించని ఆధారాలు
- వివరాల కోసం వీఎంసీకి ఆలయ అధికారుల లేఖ
- అసెస్‌మెంట్ నెంబర్లు ఇచ్చిన వీఎంసీ
- రీసర్వే చేస్తేనే వివరాలు తెలిసే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో ఉన్న లోటస్ ల్యాండ్‌మార్క్‌లో శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూమి ఉందని ఓ సామాజిక కార్యకర్త 2023 డిసెంబరులో అప్పటి కలెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి, ఆ భూమిని దేవస్థానానికి చెందేలా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. సదరు లేఖను దేవస్థాన అధికారులకు కూడా అందజేశారు. దీనిపై దేవస్థానం అధికారులు.. రెవెన్యూ శాఖను సంప్రదించారు. ప్రస్తుతం లోటస్ సర్వే నెంబర్లలో దేవస్థానానికి చెందిన భూమి ఉందో లేదో నిర్ధారించాలని కోరారు. రెవెన్యూ సర్వే రికార్డులను పరిశీలించగా, అందులో శ్రీకనకదుర్గ నగరోత్సవం పేరుతో 11.54 ఎకరాలు ఉన్నట్లు రాసి ఉంది. దీనికి సంబంధించిన టైటిల్ డీడ్లు గానీ, డాక్యుమెంట్లు గానీ దేవస్థాన అధికారుల వద్ద లేవు.

దేవస్థాన రికార్డులో వివరాలు ఏమైనట్టు?

రాష్ట్రంలో ప్రతి దేవస్థానానికి ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయి? ఎంతెంత ఉన్నాయి? అనే వివరాలను నమోదు చేయడానికి ఏపీ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ చట్టంలోని సెక్షన్ 43 ప్రకారం ఓ రికార్డు ఉంటుంది. ఈ రికార్డుల్లో సంబంధిత దేవస్థానం కొనుగోలు వస్తువులు, వేలం వేసిన పరికరాలు, నిర్మించిన భవనాలు, తొలగించిన మిగతా 6లో..



అయోధ్యనగర్‌లోని లోటస్ ల్యాండ్ మార్క్

ఇదీ లోటస్ చరిత్ర

ప్రస్తుతం లోటస్ ల్యాండ్‌మార్క్ ఉన్న స్థలంలో ఒకప్పుడు సిమెంట్ తయారీ కర్మాగారం ఉండేది. నష్టాలు రావడంతో దాన్ని మూసేశారు. తర్వాత నలుగురు భాగస్వాములు కలిసి ఈ స్థలాన్ని కొనుగోలు చేసి వెంచర్లు వేశారు. 14-15 ఏళ్ల క్రితం ఇక్కడ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఇది ఇప్పుడు నగరంలో ఓ ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీగా తయారైంది. సుమారు 50 ఎకరాల్లో విస్తరించి ఉన్నట్టు తెలుస్తోంది.

నేడు వీరమ్మ శిడిబండి ఉత్సవం



ఉయ్యూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న శిడిబండి ఉత్సవం 11వ రోజు మంగళవారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుక తిలకించేందుకు భక్తులు వేలాదిగా ఉయ్యూరు తరలిరానున్నారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఓ దళిత కుటుంబానికి చెందిన వివాహానికి సిద్ధంగా ఉన్న యువకుడి (పెళ్లి కొడుకు)ని శిడిబండికి కట్టిన ఉట్టి బుట్టలో కూర్చోబెట్టి మేళ తాళాలు, డప్పువాయిద్యాల నడుమ ఊయల స్తంభాల వద్దకు తీసుకెళ్తారు. అనంతరం ఆలయ ప్రదక్షిణ చేసి, అమ్మవారి దర్శనం చేయిస్తారు. అమ్మవారి తిరునాళ్లలో అత్యంత కీలకమైన ఈ ఘట్టం నిర్వహించేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆర్టీసీకి 'టోల్' నష్టం

రూ.2 కోట్లు!



- రెండు జిల్లాల ఆర్టీసీ అధికారుల ఘనకార్యం
- బస్సులకు లోకల్ రిజిస్ట్రేషన్ చేయకుండా తాత్సారం
- టోల్‌ప్లాజాల వద్ద కోల్పోయిన రాయితీలు
- జిల్లాల పునర్విభజన నుంచి ఇప్పటి వరకు రూ. 2 కోట్ల నష్టం
- నిగ్గు తేల్చిన ఆడిట్ .. ఉన్నతాధికారులకు రిపోర్టు

6లో

రైతులకు విశిష్ట సంఖ్య

వ్యవసాయ సేవలను సులభం చేసే కొత్త పథకం

- సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు ఉపయుక్తం
- జిల్లాలో మొదలైన నమోదు కార్యక్రమం

(కంచికచర్ల, ఆంధ్రజ్యోతి) : రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వ్యవసాయ సేవలను సులభతరం చేయటానికి, సంక్షేమ పథకాలను అందించటానికి వీలుగా ఈ విశిష్ట సంఖ్యను అందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో అమలుచేయడం ప్రారంభించారు. భూమి కలిగిన ప్రతి రైతుకు 11 అంకెలతో ఈ ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తారు. ప్రభుత్వ పథకాలు తేలిగ్గా పొందేందుకు ఇది ఉపయోగపడుతుంది. రైతులందరూ తప్పనిసరిగా ఈ సంఖ్యను పొందాలని జిల్లా వ్యవసాయ అధికారులు కోరుతున్నారు.

ఈ విశిష్ట సంఖ్య ఎందుకు?

భూమి కలిగిన ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి, పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావచ్చు. రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేశాక ప్రతి రైతుకు ఉండే గుర్తింపు సంఖ్య ఇది. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రాయితీలు, ఇతర వ్యవసాయ సంబంధ సేవలు పొందటానికి ఇది పనిచేస్తుంది. పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుంది. ప్రభుత్వం అందించే భూ ఆధారిత పథకాలైన పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంటరుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా పొందే వీలుంటుంది. సత్వర మిగతా 6లో..



నమోదు ఇలా..

భూమి కలిగిన రైతులు.. ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నెంబర్ తీసుకుని రైతుసేవా కేంద్రాలకు వెళ్లాలి. అక్కడ ఏఈవో, వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈవోల ద్వారా ఆధార్, ఫోన్ నెంబరు, భూమి వివరాలను ధ్రువీకరించుకోవాలి. ఇందుకు ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నెంబర్‌కు మూడుసార్లు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ధ్రువీకరణతో నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు ధ్రువీకరించి, సదరు రైతుకు 11 నెంబర్లు కలిగిన గుర్తింపు సంఖ్యను ఇస్తారు.

దుర్గమ్మ విధుల్లో ఇష్టారాజ్యం

- గైర్హాజరవుతున్న భజంత్రీలు, పంచవాయిద్యకారులు
- వీఐపీలు వచ్చినా అందుబాటులో ఉండని వైనం
- పలువురికి నోటీసులు?

6లో

బర్డ్ ఫ్లూ బఫర్ జోన్‌లు అప్రమత్తం

- 35 గ్రామాల పరిధిలో కట్టుదిట్టమైన బయో సెక్యూరిటీ కీలకం
- 24 గంటల పాటు పర్యవేక్షణ, విస్తృత పారిశుధ్య పనులు చేపట్టండి
- జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

6లో


మృతిచెందిన కోళ్లను తరలిస్తున్న యజమాని

బర్డ్‌ఫ్లూ ఆందోళన

ఎ.కొండూరు తండాలో 3 వేల కోళ్లు మృతి

అధికారులకు సమాచారం ఇచ్చిన పౌల్ట్రీ యజమాని

- మృతిచెందిన కోళ్ల పూడ్చివేత
- బతికున్నవాటి రక్త నమూనాలు సేకరణ

ఎ.కొండూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం రేగుతోంది. గంపలగూడెం ఉదంతం మరవక ముందే.. ఏ.కొండూరు మండలంలోని ఓ పౌల్ట్రీ ఫారంలో 3 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామ శివారున ఉన్న దీప్లానగర్ తండాలోని హనుమాన్ పౌల్ట్రీ ఫారంలో బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకి 3 వేల కోళ్లు మృతిచెందాయి. ఈ ఫారాన్ని కొంతకాలం కిందటే ఏర్పాటు చేశారు. కోడిపిల్లలను తీసుకొచ్చి పెంచుతున్నారు. ప్రస్తుతం ఫారంలో 3 వేల కోళ్లు ఉన్నాయి. రెండు రోజులుగా కొన్ని మిగతా 6లో..

పరిశ్రమలకు పెద్దవరం



- పరిశ్రమల ఏర్పాటు దిశగా చర్యలు
- రంగంలోకి ఏపీఐఐసీ అధికారులు
- నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల ప్రజలకు విస్తృత ఉపాధి అవకాశాలు

ఇండస్ట్రియల్ పార్క్‌కు పునర్వైభవం

పరిశ్రమల స్థాపన కోసం అభివృద్ధి చేసిన ఏపీఐఐసీ భూములు

'పెద్దవరం' ఇండస్ట్రియల్ పార్క్(ఐపీ) పునరుజ్జీవనం దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయి. నియోజకవర్గానికి ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఉండాలన్న ఉద్దేశ్యంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నందిగామ మండలంలోని పెద్దవరం గ్రామంలో అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసి ఏపీఐఐసీకి భూములు కేటాయించింది. ఇండస్ట్రియల్ పార్క్ వచ్చినా తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు అవాంతరాలు తలెత్తాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక ప్రోత్సాహకాలు, ఇండస్ట్రియల్ పార్క్‌ల విస్తరణ లేకపోవటంతో అభివృద్ధికి నోచని 'పెద్దవరం' ఇండస్ట్రియల్ పార్క్‌కు మరల కూటమి ప్రభుత్వం రాకతో మహర్దశ పట్టింది. పెద్దవరం ఇండస్ట్రియల్ పార్క్‌పై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

(నందిగామ, ఆంధ్రజ్యోతి)

పరిశ్రమల స్థాపనకు అవసరమైన సకల హంగులతో కూడిన ఏపీఐఐసీ 'పెద్దవరం' ఇండస్ట్రియల్ పార్క్ భూములపై ప్రభుత్వం దృష్టి సారించింది. పెద్దవరం ఇండస్ట్రియల్ పార్క్‌ను తిరిగి అభివృద్ధి పరిచేందుకు ఏపీఐఐసీ ముందుకు వచ్చింది. నందిగామ మండలం 'పెద్దవరం' గ్రామంలో 1170 ఎకరాల మైన్యూర్ సర్క్యూట్(ఎంసీ) భూములను గుర్తించిన గత టీడీపీ ప్రభుత్వం 2016లో ఆభూమిని ఏపీఐఐసీకి అప్పగించాలని నిర్ణయించింది. దీంతో పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యారు. చంద్రబాబు నిర్ణయంతో ఈ ప్రాంత ప్రజలు సంబర పడ్డారు. ఉద్యోగ, ఉపాధి రంగాలతో పాటు వ్యవసాయం, వ్యాపార రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని అందరూ భావించారు. అప్పటి వరకు ఎంసీ భూములుగా ఉన్న సదరు భూమికి సబ్ డివిజన్ చేసి సర్వే నెంబర్లు 669, 667, 1-4గా నిర్ణయించింది. తొలిదశగా 515.7 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి అప్పగించింది. సుమారు యాభై కోట్లతో పరిశ్రమల స్థాపనకు అనువుగా రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించారు. కొండలు, గుట్టలుగా ఉన్న భూమిని సుందరంగా తీర్చిదిద్దారు. గజం రెండు వేల రూపాయలు నిర్ధారించిన ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించింది. సదరు భూములు పరిశీలించిన పారిశ్రామిక వేత్తలు సైతం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చారు. ఈ తరుణంలో ఎన్నికలు జరగడం, రాష్ట్రంలో జగన్ అధికారంలోకి రావడంతో పరిశ్రమల స్థాపనకు ఆటంకం ఏర్పడింది.

ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి

ప్రభుత్వం చొరవ తీసుకొని ఈ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజల జీవనప్రమాణాలు పెరగనున్నాయి. ప్రస్తుతం రెండు పరిశ్రమలు ఉంటేనే పెద్దవరం ప్రాంతంలో ప్రత్యక్ష, పరోక్షంగా వెయ్యిమందికి ఉపాధి లభించింది. ఏపీఐఐసీ భూముల్లో కనీసం వంద పరిశ్రమలు ఏర్పాటైతే లక్షలమందికి జీవనాధారం ఏర్పడుతుంది. చంద్రబాబు పాలనలోనే అది సాధ్యమని ప్రజలు నమ్మకంతో ఉన్నారు. ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

నిలిచిపోయిన బల్క్ డ్రగ్ పరిశ్రమ

కరోనా సమయంలో భారీగా బల్క్ డ్రగ్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రభుత్వం నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాలను ఎంచుకుంది. దీంతో వందలసంఖ్యలో పారిశ్రామిక వేత్తలు దరఖాస్తులు అందజేశారు. అప్పటికే ఏపీఐఐసీ భూములు సకల వసతులతో సిద్ధంగా ఉన్నా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. పరిశ్రమలకు దరఖాస్తు చేసినా భూములు కేటాయించలేదు. దీంతో కొంతమంది ప్రైవేటు వ్యవసాయ భూములు కొనుగోలు చేసుకున్నారు. సకాలంలో సదరు భూములు కన్వర్షన్ కాకపోవడంతో పాటు ప్రభుత్వం నుంచి ఎదురౌతున్న ఇబ్బందులతో పరిశ్రమ స్థాపనలో జాప్యం ఏర్పడింది.

జమీందారీ వారసుల న్యాయపోరాటం

ఏపీఐఐసీ భూములు ఉన్న 'పెద్దవరం' గ్రామం ముక్త్యాల జమీ కింద ఉండేది. 1956లో ఇనామ్ అబాలిషన్ చట్టం అమలులోకి వచ్చిన తరువాత గ్రామంతో పాటు జమీ అధీనంలో ఉన్న సదరు 12 వందల ఎకరాల భూమి ప్రభుత్వ అధీనంలోకి వచ్చింది. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న సదరు భూమిని గత చంద్రబాబు ప్రభుత్వం ఏపీఐఐసీకి అప్పగించింది. దీంతో జమిందారు వారసులు కోర్టును ఆశ్రయించారు. ఇనాం అబాలిషన్ చట్టం ప్రకారం ప్రభుత్వం సాధీనం చేసుకొనే భూమిలో 1-3వ వంతు భూమి తమకు వస్తుందని వారు వాదిస్తున్నట్టు తెలిసింది.

సాగు రైతుకు అందని పరిహారం

ఏపీఐఐసీ స్వాధీనం చేసుకున్న భూమిలో సుమారు ఎనభై మంది రైతులు 120 ఎకరాల వరకూ సాగు చేసుకుంటున్నారు. ఏళ్ల తరబడి సాగులో ఉంటున్న తమకు న్యాయం చేయాలని వారు కోరడంతో అంగీకరించిన ప్రభుత్వం ఎకరాలనికి రూ.6 లక్షల చొప్పునపరిహారం నిర్ణయించింది. ఆ తరుణంలో గ్రామస్థులు పెద్దఎత్తున తాము కూడా సాగులో ఉన్నామంటూ ఆందోళనకు దిగారు. దీనిపై ప్రభుత్వం నిజనిర్ధారణ కమిటీ వేసింది. కమిటీ నివేదిక అందేలోగా ప్రభుత్వం మారింది. దీంతో నిజంగా సాగు చేస్తున్న రైతులకు కూడా పరిహారం అందలేదు. తిరిగి చంద్రబాబు ప్రభుత్వం రావడంతో పరిహారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

అనువైన ప్రదేశం

ఏపీఐఐసీ అభివృద్ధి చేసిన పెద్దవరం భూములు పరిశ్రమల స్థాపనకు పెద్ద వరమే అని చెప్పాలి. కేవలం 15 కిలోమీటర్లలోపే జాతీయ రహదారి.. దీనికి తోడు జాతీయ రహదారుల సంస్థ ఇటీవల ప్రకటించిన గ్రీన్‌ఫీల్డ్ హైవే కూడా ఈ ప్రాంతం సమీపంలోనే ఉంది. కిలోమీటరు దూరంలోనే కృష్ణానది.. పరిశ్రమలకు అవసరమైన నీరు అక్కడ పుష్కలంగా లభిస్తుంది. వ్యవసాయాధారిత పరిశ్రమలకు ముడి సరుకు కూడా ఇక్కడే లభ్యమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో లిక్కర్, ఇథనాల్ పరిశ్రమలను స్థాపించారు. ఇథనాల్ పరిశ్రమ ఈ ఏడాది నుంచి ఉత్పత్తులు ప్రారంభించనుంది. ఈ పరిశ్రమకు ప్రధానమైన ముడి సరుకు బియ్యం, మొక్కజొన్నలు ఇక్కడే లభ్యమౌతున్నాయి. దీనివల్ల పరిశ్రమకు, రైతులకు ఇద్దరికీ మేలు జరిగే అవకాశం ఉంటుంది.

దుర్గమ్మ విధుల్లో ఇష్టారాజ్యం!

- గైర్హాజరవుతున్న భజంత్రీలు, పంచవాయిద్యకారులు
- వీఐపీలు వచ్చినా అందుబాటులో ఉండని వైనం
- పలువురికి నోటీసులు?



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ప్రధాన ఆలయం కవాట ఉద్ఘాటనం చేసినప్పటి నుంచి (తలుపులు తెరచినప్పటి నుంచి) తిరిగి రాత్రి కవాట బంధనం చేసే వరకు దేవస్థాన భజంత్రీలు, పంచ వాయిద్యకారులు విధుల్లో ఉండటంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అమ్మవారి దర్శనానికి వీఐపీలు వచ్చిన సమయంలో వారు అందుబాటులో వలన ఆలయ ఉద్యోగులు, అర్చకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కొందరికి ఆలయ అధికారి నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. దేవస్థానంలో 25 మంది పర్మినెంట్ భజంత్రీలు, ఐదుగురు ఔట్‌సోర్సింగ్ పంచ వాయిద్యకారులు పనిచేస్తున్నారు. అయితే కొందరు విధులకు హాజరై సంతకం చేసి డ్యూటీ పూర్తిగా నిర్వహించకుండా మధ్యలోనే వెళ్లిపోతున్నారని, మరికొందరు విధులకు రావటం లేదని, కొందరు ప్రైవేటు కార్యక్రమాలకు వెళుతున్నట్టు ఆలయంలోని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇటీవల అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఓ వీఐపీకి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికినప్పుడు భజంత్రీలు అందుబాటులో లేక ఇబ్బందులకు గురవడంతో ఆరోజు విధుల్లో ఉన్న ఆలయ ఉద్యోగి గైర్హాజరైన భజంత్రీలకు నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. భజంత్రీలు, పంచ వాయిద్యకారులపై అధికారుల పర్యవేక్షణ కొరవడటం వలన వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తు డ్యూటీలకు హాజరవుతున్నారని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

దేవస్థానం షాపుల అద్దె బకాయిల వసూలుకు చర్యలు

- రెండు రోజుల్లో రూ. 30 లక్షలు వసూలు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం షాపుల అద్దె బకాయిల వసూలుకు చర్యలు చేపట్టారు. పేరుకుపోయిన మొండి బకాయిలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం మేరకు అధికారులు స్పందించారు. గత రెండు రోజుల నుంచి అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రూ. 30 లక్షలు వరకు వసూలు చేశారు. దేవస్థానం నుంచి షాపులను లీజుకు తీసుకున్న యజమానులు పాత బకాయిలు సుమారు రూ 1.20 కోట్లు, ప్రస్తుత వ్యాపారస్తులు రూ. 30 లక్షలు బకాయిపడ్డారు. నోటీసులు ఇచ్చినప్పటికీ తాత్సారం చేస్తూ బకాయిలు చెల్లించడం లేదు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన దేవదాయ కమిషనర్, దుర్గగుడి ఈవో కె.రామచంద్రమోహన్ సంబంధిత అధికారులు, ఉద్యోగులపై సీరియస్ అయ్యారు. వెంటనే బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. ఆ విభాగం ఏఈవో దుర్గారావు, సూపరింటెండెంట్ డీవీవీ సత్యనారాయణ, సిబ్బంది బకాయిలు చెల్లించాలని లీజుదారులపై ఒత్తిడి పెంచారు. దీంతో సుమారు రూ.30 లక్షలు వసూలైంది. విగిలిన మొత్తం నెలాఖరు లేదా, మార్చినెలలో వసూలు చేస్తామని ఏఈవో తెలిపారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



జీజీహెచ్ వద్ద రోదిస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు

ప్రాణాలతో చెలగాటమా!

- చికిత్స పొందుతూ మహిళ మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే.. అంటూ బంధువుల రోదనలు

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పేదల ప్రాణాలతో వైద్యులు చెలగాటమాడుతున్నారని, వైద్యం కోసం వెళ్లిన వారు క్షేమంగా ఇంటికి వస్తారనే ఆశ లేకుండా చేస్తున్నారని, మెరుగైన వైద్య సేవలు దేవుడెరుగు కనీస వైద్య సేవలైనా అందించలేని దయనీయస్థితిలో ప్రభుత్వఆసుపత్రి ఉందని మృతుల బంధువులు బోరున విలపించారు. జి.కొండూరు మండలం కందులపాడు శివారు చేగిరెడ్డిపాడు గ్రామానికి చెందిన వల్లూరు సునీత (30) రెండ్రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెను సోమవారం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆమెకు షుగర్ లెవల్స్ అధికంగా ఉండటంతో కంట్రోల్ చేసేందుకు ఇంజక్షన్ ఇచ్చారు. ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించి కోమాలోకి వెళ్లిపోయి మృతి చెందింది. దీంతో వైద్యుల నిర్లక్ష్యం వల్లే సునీత మృతి చెందిందని ఆమె కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. తమ బిడ్డను వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణాలు తీశారని ఆమె తల్లి, బంధువులు బోరుమన్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ.వెంకటేశ్వరరావును వివరణ కోరగా.. రోగికి షుగర్ లెవల్స్ అధికంగా ఉండటం వల్లే మృతి చెందిందని, ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని.. షుగర్ లెవల్స్ అధికమై నిమోనియాకు దారితీసి రోగి మృతి చెందిందని తెలిపారు.

బర్డ్ ఫ్లూ బఫర్ జోన్‌లు అప్రమత్తం

- 35 గ్రామాల పరిధిలో కట్టుదిట్టమైన బయోసెక్యూరిటీ కీలకం
- 24 గంటల పాటు పర్యవేక్షణ, విస్తృత పారిశుధ్య పనులు చేపట్టండి
- జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గంపలగూడెం మండలంలోని అనుమల్లంకలో కోళ్ల మరణాలకు సంబంధించి బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో పది కిలోమీటర్ల పరిధిలోని 35గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలను కొనసాగించాలని, సమన్వయ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా వుండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. అనుమల్లంక ఘటన నేపథ్యంలో చేపడుతున్న చర్యలపై సమీక్షించేందుకు కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైసెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ (నిహ్సాద్) నుంచి ఫిబ్రవరి 14న వచ్చిన ఫలితాల్లో హెచ్5ఎన్1 ఏవీఎస్ ఇన్‌ఫ్లూయంజా వైరస్ పాజిటివ్ వచ్చినట్టు పశుసంవర్ధక అధికారులు తెలిపారు. అప్పటికే యుద్ధప్రాతిపదికన భద్రతా చర్యలు తీసుకొన్నట్టు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధాన కేంద్రం (0-1 కి.మీ)తో పాటు అనుమల్లంకకు పది కిలోమీటర్ల పరిధిలోని బఫర్ జోన్‌లో నియంత్రణ చర్యలను పకడ్బందీగా కొనసాగించాలన్నారు. బఫర్ జోన్‌లో చికెన్, గుడ్ల దుకాణాలను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు మూసివుంచాలని స్పష్టం చేశారు. పారిశుధ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని శానిటైజేషన్‌కు స్ప్రేయర్లు, ఫాగర్లను అందుబాటులో వుంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా వుండాలన్నారు. జిల్లాలోని 116 కోళ్ల ఫారాల్లోను 24 గంటలూ నిరంతర పర్యవేక్షణతో పాటు బయో సెక్యూరిటీ చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి చర్యలోను నిర్దిష్ట స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను అనుసరించాలన్నారు. బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బఫర్‌జోన్‌లో ఫీవర్ సర్వేలను నిర్వహించాలని, అవసరమైతే నమూనాలను పరీక్షించాలని, వైద్య, ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. అటవీ ప్రాంతంలో పక్షుల్లో అసహజ మరణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలని అటవీ అధికారులకు కలెక్టర లక్ష్మీశ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీపీవో పి.లావణ్యకుమారి, ఫారెస్ట్ రేంజ్ అధికారి పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలకు మంచి ధర..

ప్రస్తుతం జిల్లాలో అధికంగా సాగవుతూ అధిక దిగుబడి కలిగిన టమాట, క్యాబేజ్, వంగ వంటి కూరగాయలు ధరలు తగ్గిన నేపథ్యంలో రైతులకు సరైన ధరలు లభింపచేసే ప్రక్రియలో భాగంగా కలెక్టర్ లక్ష్మీశ, టోకు వ్యాపారులు, వ్యవసాయ మార్కెటింగ్, ఉద్యానశాఖ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మన ప్రాంతంలో పండుతున్న కూరగాయలకు మంచి ధర కల్పించే ఉద్దేశ్యంతో టమాట, వంగ, క్యాబేజి, పచ్చిమిర్చి, కాప్సికం వంటి కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేయరాదని టోకు వ్యాపారస్తులను ఆదేశించినట్టు తెలిపారు. రైతు బజారుల్లో ఈ ప్రాంతంలో పండే కూరగాయలనే విక్రయించాలని, ఎవరైనా బయట రాష్ట్రాల నుంచి దిగుమతి చేసి అమ్మినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రైతుబజారు ఎస్టేట్ అధకారులను ఆయన హెచ్చరించారు. రైతులు రైతుబజారుల్లో నేరుగా తమ కూరగాయలను అమ్ముకునే సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీనివాసరావు,లావణ్య, ఎం.దివాకర్, కె.మంగమ్మ, హార్టీకల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సూక్ష్మ పరిశీలన

ఈనెల 27న ఉమ్మడి కృష్ణా-గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు పోలింగ్ జరగనుందని, పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్ల (సూక్ష్మ పరిశీలకులు) పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్ల శిక్షణా కార్యక్రమం జరిగింది. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని, పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి సాధారణ పరిశీలకులకు నివేదిక అందించాల్సి వుంటుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 112 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు వివరించారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. నిర్దేశించిన తొమ్మిది అంశాలతో పాటు పోలింగ్ సమయంలో ఎదురయ్యే వివిధ అంశాలపై సరైన విధంగా నివేదిక అందించాల్సి వుంటుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌వో, సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం, నోడల్ అధికారి కె.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 78,063 మంది ఓటర్లు

ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని కలెక్టర్ లక్ష్మీశ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్సీ ఎన్నికలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలో ఓటర్లు, పోలింగ్ స్టేషన్ లొకేషన్లు, ఆగ్జలరీ పోలింగ్ స్టేషన్లు తదితరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లాలో 78,063 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 45,425 మంది కాగా మహిళలు 32,625 మంది, టీజీ ఓటర్లు 13 మంది ఉన్నట్లు వివరించారు. 11 అనుబంధ పోలింగ్ స్టేషన్లతో సహా మొత్తం 112 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు. క్రమంలో కలెక్టరేట్‌లో 0866-2575822 నెంబరుతో కమాండ్ కంట్రోల్ రూం పనిచేస్తోందని, ఉల్లంఘనలపై ఈ నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అభ్యర్థులు అనుమతుల మేరకు ఎన్నికల ప్రచారకర్తలకు ఓటర్‌స్లిప్‌లు పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు.

లోటస్ లోగుట్టు..!

(5వ పేజీ తరువాయి)

భవనాలు.. ఇలా ప్రతి అంశాన్నీ నమోదు చేయాలి. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని 43వ రికార్డు బుక్‌లో మాత్రం రెవెన్యూ సర్వే రికార్డుల్లో ఉన్న వివరాలు కనిపించలేదు. 2010 వరకు మాత్రమే వివరాలున్నాయి. తర్వాత దీనిలో ఎటువంటి అంశాలను నమోదు చేయలేదు. కొత్త అంశాలను నమోదు చేయాలంటే కచ్చితంగా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అనుమతి తీసుకోవాలి. రెవెన్యూ సర్వే రికార్డు (ఆర్ఎస్ఆర్)లో ఉన్న వివరాలను 43 రికార్డులో నమోదు చేయడానికి అనుమతి ఇవ్వాలని అధికారులు దేవదాయ శాఖ సహాయ కమిషనర్‌ను లేఖ రాశారు. అనుమతి రావడంతో కొద్ది నెలల క్రితం ఆర్ఎస్ఆర్‌లో ఉన్న 11.54 ఎకరాల వివరాలను 43 రికార్డులోకి ఎక్కించారు.

పూర్తి వివరాలివ్వండి

లోటస్‌లో దేవస్థానానికి చెందిన భూమి ఎంతమేర ఉంది? ఏయే సర్వే నెంబర్లలో ఎంతెంత ఆక్రమణలో ఉంది.. అనే వివరాలను తేల్చడానికి దేవస్థాన అధికారులు సిద్ధమవుతున్నారు. రెవెన్యూ సర్వే రికార్డుల్లోని వివరాలను బట్టి తమకు లోటస్ ల్యాండ్‌మార్క్‌కు చెందిన వివరాలు ఇవ్వాలని దేవస్థాన అధికారులు.. వీఎంసీ అధికారులకు లేఖ రాశారు. దీని ప్రకారం ఒక మ్యాప్‌ను వీఎంసీలోని సర్వే, రెవెన్యూ విభాగ అధికారులు చూపించినట్టు తెలిసింది. అసెస్‌మెంట్ నెంబర్లను దేవస్థాన అధికారులకు అందజేశారు. వీఎంసీలోని రెవెన్యూ విభాగం ప్రతి స్థలానికి ఒక అసెస్‌మెంట్ నెంబరు ఇస్తుంది. అందులో ఏమైనా నిర్మాణాలు జరిగాక ఇంటి నెంబరును కేటాయిస్తుంది. లోటస్ ల్యాండ్‌మార్క్‌లో ప్రస్తుతం ఎటు చూసినా భవనాలు కనిపిస్తున్నాయి. అసెస్‌మెంట్ నెంబర్లు ఇచ్చిన వీఎంసీ అధికారులు ఇప్పటివరకు ఇంటి నెంబర్లు ఇవ్వలేదు. ఇంటి నెంబర్లు ఇస్తేనే ఏయే అసెస్‌మెంట్ నెంబర్లలో దేవస్థాన భూమి ఉంది అనేది తెలుస్తుందని దేవస్థాన అధికారులు అభిప్రాయపడుతున్నారు. మళ్లీ సర్వే చేయించాల్సి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

లే అవుట్‌కు అనుమతి ఉంది

అయోధ్యనగర్‌లో ఉన్న లోటస్ ల్యాండ్‌మార్క్ ప్రైవేట్ స్థలంగా మా రికార్డుల్లో ఉంది. దీనికి లే అవుట్ అనుమతులు ఉండటంతో నిర్మాణాలకు అనుమతి ఇచ్చాం. ఇది ప్రభుత్వ భూమి అని తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

- వెంకట ప్రసాద్, చీఫ్ సిటీప్లానర్

బర్డ్‌ఫ్లూ ఆందోళన

(5వ పేజీ తరువాయి)

కోళ్లు అనారోగ్యానికి గురై మృతిచెందుతుండగా, సోమవారం ఒక్కసారిగా 1,500 కోళ్లు మృతిచెందాయి. దీంతో పౌల్ట్రీ యాజమాని.. పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. పశుసంవర్ధకశాఖ ఏడీ రామారావు, అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ భరత్.. వచ్చి పౌల్ట్రీని పరిశీలించారు. చనిపోయిన కోళ్లను వేరు చేసి సమీపంలో ఓ గోతిలో పూడ్చి పెట్టాలని యాజమానికి ఆదేశాలు జారీ చేశారు. విజయవాడ నుంచి వైరాలజీ సిబ్బందిని పిలిపించారు. వారు బతికి ఉన్న కోళ్ల రక్త నమూనాలు సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శాంపిళ్లను భోపాల్‌లోని వ్యాధి నిర్ధారణ కేంద్రానికి పంపుతున్నామని, మూడు రోజుల తరువాత నివేదిక వస్తుందన్నారు. కాగా, ఆదివారం చీమలపాడు, ఎ.కొండూరు, కంభంపాడు గ్రామాల్లో చికెన్, చేపల మార్కెట్లు కిటకిటలాడాయి. ఈ ఘటనతో చికెన్ తిన్నవారు ఆందోళన చెందుతున్నారు.

వైసీపీకి డాక్టర్ సౌమ్య గుడ్ బై



జగ్గయ్యపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేటకు చెందిన ప్రముఖ డెంటిస్ట్, వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీరమాచినేని సౌమ్య వైసీపీకి రాజీనామా చేస్తూ లేఖను పార్టీ అధ్యక్షుడు జగన్‌కు సోమవారం అందజేశారు. విజయసాయిరెడ్డి వర్గానికి చెందిన నేతగా గుర్తింపు పొందారు. ఎన్నికల తర్వాత పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. గతేడాది బుడమేరు వరదల సమయంలో విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాంను కలిసి రూ.50వేలు సీఎం సహాయనిధికి అందజేశారు. ప్రస్తుతం ఏ పార్టీలో చేరే యోచన లేదని చెప్పారు.

ఆర్టీసీకి టోల్ నష్టం రూ.2 కోట్లు!

- ఎన్టీఆర్ , కృష్ణా ఆర్టీసీ అధికారుల ఘనకార్యం
- బస్సులకు లోకల్ రిజిస్ట్రేషన్ చేయకుండా తాత్సారం
- టోల్‌ప్లాజాల వద్ద రాయితీలు కోల్పోయారు
- జిల్లాల పునర్విభజన నుంచి ఇప్పటి వరకు రూ. 2 కోట్ల నష్టం
- నిగ్గు తేల్చిన ఆడిట్ .. ఉన్నతాధికారులకు నివేదిక



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్టీసీలో ఒక కండక్టర్ ఒక్క రూపాయి టిక్కెట్ తక్కువ కొడితే అతడ్ని డిపో స్పేర్‌లో పెడతారు.. రోజుల తరబడి విధుల్లోకి తీసుకోరు .. రిమార్కు రాసి ఇంక్రిమెంట్‌ను కట్ చేస్తారు.. అదే ఓ అధికారి ఎంత పెద్ద తప్పు చేసినా చర్యలుండవు! అధికారులు చేసిన తప్పును ఉన్నతాధికారులు కాపుకాస్తారు! ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఆర్టీసీ అధికారులు చేసిన తప్పు వల్ల సంస్థపై రూ.2 కోట్ల నష్టం పడింది. ఇది ఆడిట్ తేల్చిన లెక్క! ఆర్టీసీకి నష్టం జరిగిందని ఆడిట్ నిగ్గు తేల్చితే.. ఇప్పటి వరకు ఆ అధికారులపై ఉన్నతాధికారుల చర్యలు లేవు? ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పరిధిలోని పలు బస్సులకు స్థానికంగా రిజిస్ట్రేషన్స్ నిర్వహించకపోవటం వల్ల టోల్‌ప్లాజాల దగ్గర అధికంగా రుసుము కట్టాల్సి వచ్చింది. జిల్లాల పునర్విభజన తర్వాత నుంచి ఇప్పటి వరకు ఆర్టీసీకి టోల్ ప్లాజాల దగ్గర ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వచ్చింది. ఈ నష్టం రూ.2 కోట్లుగా ఆడిట్ తేల్చింది. నష్టంపై ఆర్టీసీ ఎండీకి నివేదిక ఇవ్వటంతో పాటు రెండు జిల్లాల అధికారులకు కూడా కాపీ పంపించినట్టుగా తెలుస్తోంది. ఆర్టీసీలో ఆడిట్ నివేదిక సంచలనంగా మారింది. ఈ నివేదికపై ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది వేచి చూడాల్సి ఉంది. జిల్లాల పునర్విభజన తర్వాత రెండు జిల్లాలకు వేర్వేరుగా ఆర్టీసీ బస్సులను కేటాయించారు. బస్సుల కేటాయింపు నేపథ్యంలో, ఎక్కడికక్కడ స్థానికంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉండగా.. ఆ పని అధికారులు చేయలేదు. దీంతో పాటు కొత్తగా కొనుగోలు చేసిన బస్సులకు కూడా స్థానికంగా ఎక్కడకక్కడ రిజిస్ట్రేషన్ చేయించలేదు. రిజిస్ట్రేషన్ చేయించకుండానే ఆర్టీసీ వాటిని నడుపుతోందన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. బస్సులకు స్థానిక రిజిస్ట్రేషన్ ఉంటే టోల్‌ప్లాజాల దగ్గర అందులో 75 శాతం మాత్రమే ఛార్జీలు చెల్లించటానికి అవకాశం ఉంటుంది. ఆర్టీసీ అధికారులు స్థానికంగా రిజిస్ట్రేషన్ చేయించకపోవటం వల్ల రాయితీ ప్రయోజనాలు పొందలేని పరిస్థితి ఏర్పడింది. ఈ అంశం ఆడిట్ పరిశీలనలో వెలుగు చూసింది. ఇన్నాళ్లుగా ఆర్టీసీ అధికారులు ఈ విషయాన్ని గుట్టుగా ఉంచారు. ఆడిట్ ఈ అంశంపై సీరియస్‌గా స్పందించింది. ఆర్టీసీకి రూ. 2 కోట్లు నష్టం కలిగించగా.. కేంద్ర ప్రభుత్వానికి రూ. 2 కోట్ల మేర లబ్ధి కలిగించారన్నది ఆడిట్ గట్టిగా ఎత్తి చూపినట్టుగా తెలుస్తోంది. ఇది సర్దుబాటు చేయలేని నష్టంగా ఆడిట్ అధికారులు పేర్కొనటం గమనార్హం. ఆడిట్ నివేదిక ఉన్నతాధికారులకు అందినా కిమ్మనటం లేదు. బాధ్యులైన అధికారులకు కనీసం షోకాజ్ నోటీసులు కూడా ఇవ్వలేదు. దీంతో ఆర్టీసీ ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. చిన్న ఉద్యోగుల విషయంలో పావలా తేడా వచ్చినా నానా హడావిడి చేస్తారని, అదే అధికారులు తప్పులు చేస్తే మాత్రం చర్యలు ఉండటం లేదని ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి.

రైతులకు విశిష్ట సంఖ్య

(5వ పేజీ తరువాయి)

పరిహారం అందుకునేందుకు కూడా ఇది ఉపయోగపడుతుంది. నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవటానికి తోడ్పడుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో భూమి కలిగిన ప్రతి రైతుకు, మున్ముందు కౌలు రైతులకు, భూమిలేని వ్యవసాయ కూలీలకు, ఇతర వ్యవసాయ ఆధారిత వృత్తుల్లో ఉన్నవారికి ఇది వర్తిస్తుంది. ఈ రైతు గుర్తింపు సంఖ్య పొందేందుకు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలి.

గుర్తింపు సంఖ్యతో బహుళ ప్రయోజనాలు

రైతు గుర్తింపు సంఖ్యతో బహుళ ప్రయోజనాలున్నాయి. ఇక నుంచి ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఈ గుర్తింపు సంఖ్య తప్పనిసరి. భూమి కలిగిన రైతులందరూ తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈ గుర్తింపు సంఖ్యను త్వరగా నమోదు చేయించుకోవాలి. లేనిపక్షంలో ప్రభుత్వ పథకాలకు అనర్హులవుతారు. ఇందుకు సంబంధించి వ్యవసాయాధికారులు.. రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

- డీఎంఎఫ్ విజయకుమారి, జిల్లా వ్యవసాయాధికారిణి

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 110,119, 130
చికెన్ విత్ స్కిన్ 210
చికెన్ స్కిన్‌లెస్ 220
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

21న పీబీ సిద్ధార్థలో తెలుగు భాషా పోటీలు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న ముమ్మనేని సుబ్బారావు కళాపీఠం, పీబీ సిద్ధార్థ కళాశాల తెలుగు శాఖ, ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల ఉయ్యూరు ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల స్థాయిలో తెలుగు భాషా పోటీలు నిర్వహిస్తున్నట్లు పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో పద్యాలాపన, ఆంగ్ల పదాలకు తెలుగు మాటలు రాయడం, అచ్చంగా తెలుగులో మాట్లాడటం, తెలుగు గద్య పఠనం పోటీలు నిర్వహిస్తామన్నారు. పాల్గొనదలచిన వారు 8374865621,9848547022 నెంబర్లలో సంప్రదించి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు.

కృష్ణలంకలో అగ్నిప్రమాదం

● మూడు పోర్షన్ల తాటాకు ఇల్లు అగ్నికి ఆహుతి ● కాలిబూడిదైన సామాన్లు
● కట్టుబట్టలతో బాధితులు ● మంటలను అదుపుచేసిన ఫైర్ సిబ్బంది


అగ్నిప్రమాదంలో కాలిపోతున్న ఇళ్లు, దగ్ధమైన సామాన్లు

కృష్ణలంక, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక 20వ డివిజన్‌లో ఆదివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి మూడు పోర్షన్ల ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. మూడు పోర్షన్లలో ఉంటున్న కుటుంబసభ్యులు కట్టుబట్టలతో, ప్రాణాలతో బయటపడగా సామాన్లన్నీ కాలిబూడిదయ్యాయి. సేకరించిన వివరాల మేరకు 20వ డివిజన్, ద్వారకానగర్‌లో నిర్మలా శిశుభవన్ సమీపంలో అల్లమల్ల ఆంజనేయులుకు మూడు పోర్షన్ల తాటాకు ఇలు వుంది. ఒక పోర్షన్‌లో అతడు తన కుటుంబసభ్యులతో, మధ్య పోర్షన్‌లో అతని తల్లి లక్ష్మీ, మరో పోర్షన్‌లో బి.రమణమ్మ తన కుటుంబసభ్యులతో కలిసి అద్దెకు వుంటోంది. ఆదివారం రాత్రి అందరూ భోజనం చేసి నిద్రపోయారు. రాత్రి సుమారు 12 గంటల సమయంలో రమణమ్మ కుమారుడు వాష్‌రూంకు వెళ్లేందుకు ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. తాను ఉంటున్న ఇంటిపై తాటాకు కాలుతున్న మంటలు చూసి పెద్దగా కేకలు వేశాడు. మూడు పోర్షన్లలో ఉంటున్న వారితో పాటు చుట్టుపక్కల వారు ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చి చూశారు. అందరూ చూస్తుండగానే ఒక్కసారిగా మంటలు మిగతా రెండు పోర్షన్లకు సైతం అంటుకోవడంతో క్షణాల్లో ఇళ్లన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. మూడు పోర్షన్లలోని వంటసామాగ్రి, బీరువాలు, దుస్తులు, టీవీలు, కుట్టుమిషన్లు, పిల్లల పుస్తకాలు, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు విలువైన వస్తువులన్నీ కాలిపోవడంతో మూడు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. సమాచారం అందుకొని సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, కృష్ణలంక పోలీసులు గంట పాటు శ్రమించి ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన అగ్నిప్రమాదం జరిగి వుండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. బాధితులను స్థానిక కార్పొరేటర్ అడపా శేషు పరామర్శించారు.

అగ్ని బాధితులకు అండగా ఉంటాం

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నిర్మల శిశుభవన్ దగ్గర జరిగిన అగ్నిప్రమాద సంఘటనలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో వున్న కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తానని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్వయంగా సంఘటన జరిగిన ప్రాంతానికి స్థానిక టీడీపీ, జనసేన నాయకులతో కలిసి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద ఘటనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి వారికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు. ఇళ్ల నిర్మాణం చేసుకొంటామంటే ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు అందచేస్తారని, మిగిలిన వ్యయాన్ని ఆయా కుటుంబాలు భరించాల్సి వుంటుందన్నారు. అప్పటివరకు బాధితులు ఉండడానికి తాత్కాలికంగా ఒక రేకుల షెడ్డు నిర్మాణాన్ని తన స్వంత నిధులతో చేయిస్తానని గద్దె చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోటేపల్లి చిన్నా, కార్పొరేటర్ అడపాశేషు, జనసేన నాయకులు జి.జయకుమార్, బీజేపీ నాయకులు వాసా పల్లపురాజు, నిమ్మల జ్యోతిక, గల్లా శ్రీను, అడపా శివ, రావి శేషు, బండ్రెడ్డి నాగరాజు, వన్నెంరెడ్డి రాధాకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రామలింగేశ్వరనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లు మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం మంగళవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు స్క్యూ బ్రిడ్జి సెక్షన్, రామలింగేశ్వరనగర్ విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ రామాలయం ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. చినరామాలయం ప్రాంతం, గరికపాటి వారి వీధి, కాలువకట్ట, జాస్తి వారి వీధి, ఆశ్రమం వీధి, గంగానమ్మ గుడి ఏరియా, జీకే టవర్స్, వెంకట్ హైట్స్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

బీఎస్ఆర్‌కే విద్యార్థులకు అమ్మ అండ

అధ్యక్షుడు గొరపాటి సతీష్


విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న అమ్మ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ తదితరులు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బోయపాటి శివరామకృష్ణయ్య పాఠశాలలో చదువుకునే ప్రతి విద్యార్థికి ఆంధ్రామోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) ఎపుడూ అండగా ఉంటుందని అధ్యక్షుడు గొరపాటి సతీష్ హామీ ఇచ్చారు. పాఠశాలలో ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 7 వరకు నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌కు హాజరయ్యే పదవతరగతి విద్యార్థులకు అమ్మ అసోసియేషన్ అల్పాహార పంపిణీని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మార్చి 14 వరకు పాఠశాలలోని 117 మంది విద్యార్థులకు ప్రతి రోజు సాయంత్రం అల్పహారం అందిస్తామని చెప్పారు. మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని మంచి కోర్సులకు వెళ్లి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, అమ్మ సంఘం సభ్యులు యార్లగడ్డ శివరామకృష్ణ, ఆర్. శ్రీనివాసరావు, బాషా, కె. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు


బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య తదితరులు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువు సంబంధమైన పోటీలో పాల్గొనడం వల్ల నైపుణ్యాలను మరింత మెరుగుపరచుకోవచ్చని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్‌స్కూల్ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య తెలిపారు. పీబీ సిద్ధార్థ కళాశాల స్టూడెంట్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో ఈ నెల 12న జరిగిన సింటిలా 6.0 కార్యక్రమంలో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ బహుమతులు సాధించిన విద్యార్థులను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోటస్‌లో దాసాంజనేయస్వామి మందిర పునః ప్రతిష్ఠకు శ్రీకారం



వన్‌టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్ర జ్యోతి): లోటస్‌లో కార్యసిద్ధి దాసాంజనేయ స్వామి మందిర పునః ప్రతిష్ఠకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించి ఆలయ ధర్మశాస్త్ర సలహాదారు, ఘనాపాటి చల్లపల్లి వెంకట సుబ్రహ్మణ్య శర్మ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందిర నిర్వాహకులు మాట్లాడుతూ, సుమారు 55 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న లోటస్ ఐదు సెక్టార్లుగా ఉందని, ఇందులో 1938 నుంచి ఆంధ్రా సిమెంట్ కంపెనీ నడిచిందని, ఫ్యాక్టరీలో అప్పటి నుంచి కార్యసిద్ధి దాసాంజనేయ స్వామి పూజలందుకుంటున్నట్లు తెలిపారు. అయితే వెంచర్ వేసిన సుబ్బరాజు ఆనాడు విగ్రహాన్ని పక్కన ఒక షెడ్డులోకి తరలించారని తెలిపారు. ఐదు సెక్టార్లలోని వారంతా కూడా దాసాంజనేయస్వామిని దర్శించుకుని తరిస్తున్నారని తెలిపారు. మహిమాన్వితమైన స్వామి వైభవం గురించి కార్యసిద్ధి హనుమ పేరిట పుస్తకం కూడా ప్రచురితమైందన్నారు. మందిర పునః ప్రతిష్ఠలో భాగంగా స్వామివారి వైభవానికి చిహ్నంగా శిలాఫలక ఆవిష్కరణ జరిగినట్లు తెలిపారు.

మద్దతివ్వండి

ఉద్యోగ సంఘాలను కోరిన ఎమ్మెల్సీ అభ్యర్థిని

వన్‌టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న వలంటీర్ గంటా మమత సోమవారం ఉద్యోగ సంఘాల నాయకులను కలిసి మద్దతు కోరారు. ఏపీఎన్‌జీవో సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి ఏ విద్యాసాగర్‌ను గాంధీనగర్‌లోని ఎన్‌జీవో హోమ్‌లో ఆమె కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయన వారితో కొంచెంసేపు ముచ్చటించారు.

● గవర్నరుపేటలోని రెవెన్యూ భవన్‌లో ఏపీ అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లును కలసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు, నాయకులు ఆమె వెంట ఉన్నారు.

వీరమ్మ తిరునాళ్లకు కొనసాగుతున్న భక్తుల రద్దీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వీరమ్మ తిరునాళ్లకు భక్తుల రద్దీ కొనసాగుతుంది. తిరునాళ్లలో పదవ రోజైన సోమవారం అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు పలు ప్రాంతాలనుంచి భక్తులు వేకువ జామునుంచి తరలివచ్చి క్యూల్లో నిలుచున్నారు. శనివారంతో తిరునాళ్ల ముగియనుండగా అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులతో పాటు పలువురు ప్రముఖులు వస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు తయారు చేసి నైవేద్యం సమర్పించగా, పసుపు కుంకుమ, చీరలు, కొబ్బరికాయల స్టాళ్ల వద్ద మహిళల రద్దీ కన్పించింది. వీరమ్మ తిరునాళ్లలో అంత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న శిడిబండి వేడుకు మంగళవారం సాయంత్రం నిర్వహిస్తున్నారు. తిరునాళ్లలో 11వ రోజు అత్యంత వైభవంగా జరిగే శిడిబండి వేడుక తిలకించేందుకు పలు ప్రాంతాలనుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

రాజాకు మొదటి ప్రాధాన్యత ఓటేయండి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


ఫిలిం కాలనీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తదితరులు

భారతీనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యువతకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నా, ఎప్పటికప్పుడు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కోరారు. తూర్పు పరిధి 4వ డివిజన్‌లోని ఫిలింనగర్ కాలనీలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరుపున ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని యువత సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లి ఆయనను ఒప్పించి వారి సమస్యను పరిష్కరించగల నేత ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అని అన్నారు. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాల్సింగా కోరారు.

ఎల్ఐసీ, వెటర్నరీ కాలనీల్లో క్రాంతికుమార్ ప్రచారం

నాల్గో డివిజన్ పరిధిలోని వెటర్నరీ కాలనీలోని వీఎంసీ పార్కు, ఎల్ఐసీ కాలనీలోని నెల్సన్ మండేలా వీఎంసీ పార్కులో ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్, స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావుతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, గొల్లపూడి నాగేశ్వరరావు, నందిపాటి దేవానంద్, గద్దె రమేష్, జాస్తి కృష్ణారావు, దాసరి గాబ్రియేల్, స్వర్ణఆంజనేయులు, సాంబిరెడ్డి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఏఎన్నార్ పార్క్‌ను వాడుకలోకి తీసుకురండి

● నగర కమిషనర్ ధ్యాన చంద్ర


పార్క్‌లో ఆట బొమ్మలు పరిశీలిస్తున్న కమిషనర్

పటమట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పటమట పదో డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అక్కినేని నాగేశ్వరరావు పార్క్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. సోమవారం ఆయన పటమట, పంట కాలువ రోడ్డును, బెంజ్ సర్కిల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటమటలో 50 సెంట్ల విస్తీర్ణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అక్కినేని నాగేశ్వరరావు పార్క్‌లో కాలుష్యాన్ని తగ్గించే విధంగా రకరకాల మొక్కలతో పాటు పిల్లలు ఆడుకునేందుకు ప్లే ఏరియా, ప్రజల ఆరోగ్యానికి ఓపెన్ జిమ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పారిశుధ్యాన్ని పరిశీలించారు. పంట కాల్వలో మ్యాన్ హోల్ తెరిచి ఉండటాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే మూసివేయాలన్నారు. డ్రెయినేజీ వ్యవస్థను సక్రమంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, ఇన్‌చార్జి సీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్ బాబు, ఈఈ సామ్రాజ్యం, ఏఎంహెచ్‌వో గోపి నాయక్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కొలనుకొండ శివాజీ, లక్ష్మణరెడ్డి, రాజేష్ తదితరులు

'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా' పోస్టర్ ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా' ప్రచార పోస్టర్‌ను శుక్రవారం బాలోత్సవ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 21న హనుమంతరాయ గ్రంథాలయంలో తెలుగు భాషోద్యమ గీతాలు, జానపద, సినీ, అభ్యుదయ పాటల సంగీత కార్యక్రమం నిర్వహించనున్నట్లు రంగం ప్రజా సాంస్కృతిక వేదిక నిర్వాహకులు రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా కళాప్రియులు కొలనుకొండ శివాజీ, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి, మాతృభాషా పరిరక్షణపై సామాజిక బాధ్యత వుందని, ప్రభుత్వం తెలుగుకు ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. జాషువా సాంస్కృతిక వేదిక, సుమధుర కళానికేతన్, తదితర సంస్థలు ఈ కార్యక్రమానికి సహకరిస్తున్నాయని తెలిపారు.

రాయల్ సీసీపై షైనింగ్ స్టార్ సీసీ విజయం

● 5 వికెట్లు తీసిన బౌలర్ విమల్ నాయక్



విజయవాడ(స్పోర్ట్స్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌ల్లో సోమవారం మూడు మ్యాచ్‌లు జరిగాయి, మొదటి మ్యాచ్ రాయల్ సీసీ, షైనింగ్ స్టార్ సీసీ మధ్య జరిగిన మ్యాచ్‌లో రాయల్ సీసీ జట్టు 32ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 136 పరుగులు చేసింది. బౌలింగ్ చేసిన షైనింగ్ స్టార్ బౌలర్ విమల్ నాయక్ 5వికెట్లు తీశాడు. అనంతరం బ్యాంటింగ్ చేసిన షైనింగ్ స్టార్ జట్టు 28.2ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 138పరుగుల విజయంతో 4పాయింట్లు సాధించింది. రెండో మ్యాచ్‌లో ఆంధ్రా బ్లూస్, కొండపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కొండపల్లి జట్టు 46ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 192పరుగులు చేసింది. అనంతరం బ్యాంటింగ్ చేసిన ఆంధ్రా బ్లూస్ జటు 36.3ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 123పరుగులు చేసి ఓటమి చెందగా, కొండపల్లి జట్టు విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో ఎస్‌సీ రైల్వే, వీవీకేఆర్ఎం మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎస్‌సీ రైల్వే జట్టు 50ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 287పరుగులు చేసింది. బ్యాటింగ్ చేసిన వీవీకేఆర్ఎం జట్టు 34.2ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 146పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలు కాగా, ఎస్‌సీ రైల్వే జట్టు 141పరుగులతో విజయం సాధించింది.

గంజాయితో నిందితుడి అరెస్టు

చిట్టినగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన డెక్క రాజేష్‌ను కొత్తపేట పోలీసులు 2.5కిలోల గంజాయితో అరెస్టు చేశారు. అతడిని సోమవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

సమస్యల సంగమం!

అపరిశుభ్రంగా పవిత్ర సంగమ ప్రాంతం

- టీడీపీ హయాం(2014-2019)లో ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా వెలుగొందిన ప్రదేశం
- 2019లో వైసీపీ ప్రభుత్వమొచ్చాక నిత్యహారతులు నిలిపివేత.. నిలిచిపోయిన భక్తుల రాక
- మహా శివరాత్రినాటికి సంగమ ప్రాంతాన్ని బాగుచేయాలని కోరుతున్న భక్తులు



బురదతో నిండిపోయిన స్నానాల ఘాట్



నిరుపయోగంగా బయో టాయిలెట్స్

(ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ హయాం(2014 నుంచి 2019)లో ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా పవిత్ర సంగమం ఓ వెలుగు వెలిగింది. రోజూ సాయంత్రం 6 గంటలకు కృష్ణా- గోదావరి నదుల కలిసే ప్రదేశం వద్ద నిత్య హారతులు ఉండేవి. ఆ సమయంలో భారీ సంఖ్యలో ప్రజలు, భక్తులు, పర్యాటకులు ఇక్కడకు వచ్చేవారు. నిత్యం జనంతో కళకళలాడుతూ ఉండేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ పవిత్ర సంగమం నిర్వహణను గాలికొదిలేసింది. అప్పటి వరకు నిర్వహిస్తున్న నిత్య పుణ్యహారతులను నిలిపివేసింది. భక్తుల రాక నిలిచిపోయింది. పవిత్ర సంగమ ప్రాంతం అపరిశుభ్రంగా మారిపోయింది.

శివరాత్రికి పుణ్యస్నానాలు ఆచరించేదెలా?

ఈనెల 26న మహా శివరాత్రి సందర్భంగా కృష్ణానది-గోదావరి కలిసే ప్రాంతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తారు. అయితే ఆ ప్రాంతంలో అన్నీ సమస్యలే ఉన్నాయి. ఇబ్రహీంపట్నం నుంచి పవిత్ర సంగమం వద్దకు వెళ్లే రహదారి బీటలు వారింది. వేడి నీళ్ల కాలువ వైపు మట్టి కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. సంగమం వద్ద అంతా అపరిశుభ్రంగా ఉంది. స్నానాల ఘాట్ వద్ద దుమ్ము, ధూళితో నిండి ఉంది. కృష్ణానది-గోదావరి కలిసే ప్రాంతం వద్ద అంతా బురదమయంగా ఉంది. గత వరదలకు కొట్టుకు వచ్చిన బురదతో మెట్ల భాగంతో పాటు ఘాట్ కూడా అధ్వానంగా ఉంది. ఇక చెట్లను నరికి ఎక్కడి అక్కడే తగలబెడుతున్నారు. వాటిని శుభ్రం చేయడం లేదు. బయో టాయిలెట్స్ నిరుపయోగంగా ఉన్నాయి. పోలీస్ పోస్టులో పోలీసులు ఉండటం లేదు. ఇలా అనేక సమస్యలతో పవిత్ర సంగమ ప్రాంతం జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిపోయింది.

లవర్స్ స్పాట్‌గా సంగమ ప్రాంతం

నిర్మానుష్యంగా ఉండడంతో ఈ ప్రాంతాన్ని ప్రేమికులు లవర్స్ స్పాట్‌గా చేసుకొని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. సరైన నిఘా లేకపోవడమే దీనికి కారణమని భక్తులు అంటున్నారు. అధికారులు పవిత్ర సంగమం ప్రాంతాన్ని శుభ్రం చేయించి శివరాత్రి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.



వేడి నీళ్ల కాలువ పక్కనే నిలువునా చీలిపోయిన రహదారి



వేడి నీళ్ల కాలువ వెంట కుంగిపోయిన రహదారి

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

విద్యాధరపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గొల్లపూడి సారా కొట్టు సెంటర్‌లో ఓ మహిళ కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. భర్తతో మనస్పర్థలు రావడంతో ఆమె గాలిబ్ అనే వ్యక్తిని రెండో వివాహం చేసుకుంది. ఒంగోలులోని తాతయ్య ఇంటి వద్ద ఉండే ఆమె కుమార్తె(13) గొల్లపూడిలోని తల్లి వద్దకు వస్తూ ఉంటుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలిక పట్ల గాలిబ్ తరచూ అసభ్యంగా ప్రవర్తిస్తుండడంతో మహిళ పలుమార్లు అతడిని మందలించింది. ఇటీవల కూడా బాలిక పట్ల గాలిబ్ అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

100 కిలోల గంజాయి స్వాధీనం.. నలుగురు యువకుల అరెస్టు

విజయవాడ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం నుంచి చెన్నైకు గంజాయి తరలిస్తున్న నలుగురు తమిళ, కేరళ యువకులను పటమట పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడుకు చెందిన రామాజయం రమేష్, రాజేష్, కేరళకు చెందిన శివ అర్జున్, రామ్‌జిత్ కారులో గంజాయిని చెన్నైకి తీసుకెళ్తున్నారు. టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు రామవరప్పా డు రింగ్ వద్ద కారును తనిఖీ చేశారు. అందులో 100 కిలోల గంజాయిని గుర్తించారు. యువకులను అరెస్టు చేసి, కారును సీజ్ చేశామని ఇన్‌స్పెక్టర్ వి.పవన్‌కిషోర్ తెలిపారు.



కార్పొరేషన్ స్థలంలో కబ్జా గ్యాంగ్ ఏర్పాటు చేసిన సరిహద్దు రాళ్లను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

కబ్జాపై కొరడా

- కార్పొరేషన్ స్థలంలో సరిహద్దు రాళ్లు ధ్వంసం చేసిన అధికారులు

పాయకాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కండ్రిక కాలనీ శివారులోని ఆంధ్ర సిమెంట్ ఫ్యాక్టరీ ఎంప్లాయిస్ అండ్ ఇండస్ట్రియల్ వర్కర్స్ హౌస్ సొసైటీ లిమిటెడ్ వెంచర్‌కు ఆనుకుని ఉన్న కార్పొరేషన్ స్థలంలో కబ్జా గ్యాంగ్ వేసిన సరిహద్దు రాళ్లను సోమవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు ధ్వంసం చేశారు. స్థానికంగా రూ.10 కోట్లు విలువైన కార్పొరేషన్ స్థలం కబ్జాకు గురవుతోందంటూ రెండు రోజులుగా కబ్జా గ్యాంగ్ పేరుతో ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. సోమవారం కబ్జాకు గురైన కార్పొరేషన్ స్థలాన్ని పరిశీలించారు. కబ్జా గ్యాంగ్ ఏర్పాటు చేసిన పునాదిరాళ్లను ధ్వంసం చేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సునీత హెచ్చరించారు. కార్పొరేషన్ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

పారిశుధ్య సేవలు ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పొద్దు

కృష్ణలంక, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సేవలను ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పొద్దని ఏడీఎం మురళీకృష్ణ గౌడకు ఆయన కార్యాలయంలో సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ నాయకులు రంగనాయుడు, పి.సుబ్బరాయుడు వినతిపత్రం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 17 నుంచి మార్చి 3 వరకు దశలవారీగా పారిశుధ్య పనులను ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పారిశుధ్య కార్మికులు ఆందోళన చెందుతున్నారని వారు తెలిపారు. మున్సిపల్ పాసింజర్ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పూర్తి బాధ్యత స్థానిక కమీషనర్లకే ఉండాలని వారు కోరారు. పర్మినెంట్ మున్సిపల్ ఉద్యోగ కార్మికులకు నాలుగేళ్లుగా సరెండర్ లీవులు, 3 డీఏలు విడుదల కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం వాటిని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని లేని పక్షంలో మార్చి 6న చలో విజయవాడ నిర్వహిస్తామని హెచ్చరించారు.



ఏడీఎం మురళీకృష్ణ గౌడకు వినతిపత్రం అందిస్తున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ నాయకులు

సీపీఎస్ ఉద్యోగులందరికీ డీఏ బకాయిలు చెల్లించాలి

- ఏపీసీపీఎస్ఈఏ అధ్యక్షుడు బాజీ పఠాన్

గాంధీనగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొన్ని విభాగాల్లో పని చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు విడుదల చేసి లక్షలాది మంది ఉద్యోగులకు అందకుండా చేయడం రాజ్యాంగ సమానత్వపు హక్కుకు విరుద్ధమని ఏపీసీపీఎస్ఈఏ అధ్యక్షుడు బాజీ పఠాన్ అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోల ప్రకారం మార్చి నాటికి బకాయిలు ఉన్న మొత్తం సొమ్మును ప్రతి సీపీఎస్ ఉద్యోగి తీసుకునేలా ట్రెజరీ సైట్‌లో ఎనేబుల్ చేయాలని కోరారు. ఈ మేరకు సచివాలయంలో సీఎఫ్ఎంఎస్ ఉన్నతాధికారులకు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సాంబేల శాంతాబాయి, ఆర్గనైజింగ్ సెక్రటరి మహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

నవ వధువుపై వేధింపుల కేసులో ఆర్టీసీ ఉద్యోగికి రిమాండ్

- పరారీలో వరుడి తల్లి, పిన్ని

విద్యాధరపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వివాహమైన రెండో రోజే వధువును వేధించిన కేసులో వరుడి తండ్రి విజయవాడ బస్సు స్టేషన్‌లో కంట్రోలర్‌గా పనిచేస్తున్న గొల్లపూడికి చెందిన చెరుకూరి లక్ష్మణరావును భవానీపురం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది. అతనిని నెల్లూరులోని జైలుకు తరలించారు. వరుడి తల్లి భవాని, ఆమె సోదరి పరారీలో ఉన్నట్లు సమాచారం. బాధితురాలు ఈనెల 12న ఫిర్యాదు చేయగా, ఆరోజే ఎన్ఆర్ఐ వరుడు చెరుకూరి హేమంత్ అజయ్‌తో పాటు తండ్రి లక్ష్మణరావును కూడా పోలీసులు అరెస్టు చేశారు. లక్ష్మణరావు ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఆయన అరెస్టును బహిర్గతం చేయలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్టీసీ ఉద్యోగి లక్ష్మణరావుపై చర్యలకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. అరెస్టుపై నివేదిక ఇవ్వాలని ఆర్టీసీ ఎన్టీఆర్ జిల్లా అధికారి ఎంవై దానం కింది అధికారులను ఆదేశించారు. అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పుణ్యస్నానాల పుష్కరఘాట్‌ను రహదారిగా మార్చేశారు!

వ్యాపార అవసరాల కోసం భక్తుల మనోభావాలతో చెలగాటం

- రివర్ కన్జర్వేన్సీ, రెవెన్యూ అధికారుల సహకారం!



ఐలూరు జంట పుష్కరఘాట్లలో ఎడమవైపు ఘాట్‌ను బుసకతో వాహనాల రహదారిగా మార్చేసిన దృశ్యం

దక్షిణకాశీగా ప్రసిద్ధి గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం ఐలూరులో కృష్ణానది వద్ద పుణ్యస్నానాలు ఆచరించే పుష్కరఘాట్‌ను ఓ వ్యక్తి తన వ్యాపార అవసరాల కోసం రహదారిగా మార్చేశారు. లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఘాట్‌ను వాహనాల నడిచే రహదారిగా పూడ్చివేశారు. ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీయటమేనని హిందూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు): ఐలూరు పుణ్యక్షేత్రం కావటంతో కృష్ణానది ఒడ్డున 2016లో రెండు పుష్కరఘాట్లను రివర్ కన్జర్వేన్సీ(ఆర్సీ) అధికారులు నిర్మించారు. ఈ ఘాట్లను చాలా పవిత్రంగా భక్తులు భావిస్తారు. నదిలో నీరు లేకున్నా పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. ప్రతి ఏడాది మహాశివరాత్రికి లక్షమంది భక్తులు వచ్చి నదీపాయలో జల్లుస్నానాలు ఆచరిస్తారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఐలూరులో పుష్కరఘాట్‌ను పూడ్చివేయటం దారుణమని భక్తులు అంటున్నారు. ఘాట్‌ను రహదారిగా మార్చేందుకు రివర్ కన్జర్వేన్సీ(ఆర్సీ) అధికారులు, రెవెన్యూ అధికారులు సహకరించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 13వ తేదీన ఐలూరు శ్రీరామేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశం ముగిశాక అధికారులు నదీపాయ వద్దకు వచ్చి పూడ్చేసిన పుష్కరఘాట్‌ను కళ్లారా చూసి కూడా పట్టనట్టుగా ఉన్నారని, పలువురు తెలిపారు. కొందరు తమ వ్యాపార అవసరాలకు పుష్కరఘాట్‌ను పూడ్చేసి రహదారిగా మార్చారని ఆరోపిస్తున్నారు.

మాకు తెలియదు

పుష్కరఘాట్‌ను తొలగించినట్టు మాకు తెలియదు. తొలగించేందుకు వీల్లేదు. రహదారిగా మార్చేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. - శ్రీరాం జనార్దన్, ఆర్సీ జేఈ

రహదారిగా మార్చిన ఘాట్ ఇదే



2016 కృష్ణా పుష్కరాల్లో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు(ఫైల్)

ఆలపాటిని ఎమ్మెల్సీగా గెలిపిద్దాం

- అందరం కలిసికట్టుగా, ప్రణాళికాబద్ధంగా పనిచేద్దాం
- జనసేన పట్టభద్రుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్

వన్‌టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అందరం కలిసికట్టుగా, ప్రణాళికాబద్ధంగా, వ్యూహాత్మకంగా పనిచేసి ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కూటమి బలపరచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపిద్దామని పట్టభద్రులకు జనసేన రాజకీయ వ్యవహారాల విభాగం ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ఆలపాటి గెలుపును కాంక్షిస్తూ శేషసాయి కల్యాణమండపంలో సోమవారం జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజేంద్రప్రసాద్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని, మంత్రిగా పనిచేశారని, ఆయనను శాసనమండలికి పంపిస్తే సమస్యల పరిష్కారానికి పని చేస్తారని తెలిపారు. 2024 ఎన్నికల్లో జనసేన గెలుపుకోసం తెనాలిలో విస్తృత ప్రచారం చేశారని తెలిపారు. వైసీపీ తన ఐదేళ్ల పాలనలో ప్రజాధనాన్ని లూటీ చేసిందని, వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని మనోహర్ ఆరోపించారు. జనసేన ఎప్పుడూ ప్రజాపక్షమే అన్నారు. గత ఐదేళ్లలో జనసైనికులు, వీర మహిళలపై దాడులు చేసిన వారిని వదిలిపెట్టేది లేదన్నారు. సోషల్ మీడియాలో ప్రశ్నించినందుకు జనసైనికులపై అక్రమ కేసులు పెట్టారని, జైళ్లలో నిర్బంధించారని, వాటిని తేలికగా మరచిపోబోమన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల స్ఫూర్తితో ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీగా పోటీచేయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానని అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణా - గుంటూరు జిల్లాలకు చెందిన జనసేన ఎమ్మెల్యేలు, జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, పీవోసీలు, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, వీర మహిళలు ప్రాంతీయ సమన్వయకర్తలు, క్షేత్రస్థాయి నాయకులతో నిర్వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, పి.అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, కిలారి రోశయ్య, నాయకులు బండ్రెడ్డి రామకృష్ణ, గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాసయాదవ్, చిల్లపల్లి శ్రీనివాసరావు, చిలకలపూడి పాపారావు, అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, బండి రామకృష్ణ, రావి సౌజన్య పాల్గొన్నారు.



చేతులు పైకెత్తి ఐక్యతా చిహ్నాన్ని చూపుతున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను

నా నిర్ణయంలో మార్పులేదు

- రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ఇంతకు ముందే ప్రకటించా: మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని)

వన్‌టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు తాను గత ఏడాది జూన్ పదో తేదీన ప్రకటించానని, ఆ నిర్ణయంలో ఎటువంటి మార్పు లేదని మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మీడియాలో తాను పార్టీ మారుతున్నట్లు వచ్చిన కథనంలో వాస్తవం లేదన్నారు. ప్రజలకు సేవ చేయాలంటే రాజకీయాల్లో ఉండాల్సిన అవసరం లేదని తాను హృదయపూర్వకంగా నమ్ముతున్నానని తెలిపారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రజాసేవ జీవిత నిబద్ధత అని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఉంటుందని పేర్కొన్నారు. తన రాజకీయ పునరాగమనంపై నిరాధారమైన వార్తలు వచ్చినా వాటిని పట్టించుకోవద్దని పేర్కొన్నారు. తన ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కేశినేని నాని కృతజ్ఞతలు తెలిపారు.

అమరావతిలో అంతర్జాతీయ గార్డెన్ సెంటర్

- ఇజ్రాయిల్‌కు చెందిన గ్రీన్‌టెక్ లిమిటెడ్ ఆసక్తి
- ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథితో భేటీలో ప్రతిపాదన
- సీఎం చంద్రబాబు సమక్షంలో మరోమారు సమావేశం

విజయవాడ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో అంతర్జాతీయ స్థాయి లో గార్డెన్ సెంటర్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ఇజ్రాయిల్ దేశానికి చెందిన గ్రీన్‌టెక్ లిమిటెడ్ సంస్థ రాజధానిలో గార్డెన్ సెంటర్ ఏర్పాటుకు ఆసక్తి చూపుతోంది. సోమవారం నగరంలో అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీఎల్) సీఎండీ లక్ష్మీపార్థసారధి భాస్కర్‌తో గ్రీన్‌టెక్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి బృందం భేటీ అయింది. ఇజ్రాయిల్‌తో పాటుగా అనేక అరబ్ దేశాల్లో నెలకొల్పిన ఆకర్షణీయమైన గార్డెన్ సెంటర్లను ప్రజెంటేషన్ చేసి గ్రీన్‌టెక్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు వివరించారు. దేశాల భౌగోళిక పరిస్థితులు అక్కడి శీతోష్ణస్థితు లను పరిగణనలోకి తీసుకుని అక్కడ పెంచగలిగే పండ్లు, పూలు, కూరగాయలు, వృక్షజాలాలను వివరించారు. నర్సరీల్లో పండించిన కూరగాయలు, తయారు చేసిన పలు రకాల ఉత్పత్తులను సీఎండీ ఎదుట ప్రదర్శించారు. ప్రపంచస్థాయిలో నిర్మి స్తున్న అమరావతి రాజధానిలోనూ అంతర్జాతీయ గార్డెన్ సెంటర్ ఏర్పాటుకు తమ ప్రణాళికలను ప్రజెంటేషన్ చేసి, ప్రతిపాదనలను సీఎండీకి నివేదించారు. దీనిపై అత్యున్నత స్థాయిలో నిర్ణయం తీసుకున్న తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒక సమావేశాన్ని నిర్వహించిన తర్వాత అంతిమ నిర్ణయం తీసుకుంటారు. గ్రీన్‌టెక్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు డేవిడ్ మిజ్రహి, ప్రశాంత్ , కిషోర్‌తో పాటు ఏడీసీఎల్ హార్టీకల్చర్ ఏడీ వి.ధర్మజ, అర్బన్ ప్లానింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్ అండ్ డిజైన్ హెడ్స్ పి.సురేష్‌బాబు, కేవీ గణేష్‌బాబులతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథితో మాట్లాడుతున్న గ్రీన్‌టెక్ ప్రతినిధులు

అదానీని కేసుల నుంచి కాపాడేందుకే మోదీ అమెరికా పర్యటన

- మాజీ సీఎంపై విచారణ చేసేందుకు చంద్రబాబుకు భయమెందుకు ?
- కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజల అసంతృప్తి: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్

గాంధీనగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అదానీని కేసుల నుంచి తప్పించేందుకే ప్రధాని మోదీ ఇటీవల అమెరికా పర్యటన చేశారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ ఆరోపించారు. గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ అమెరికా పర్యటన వల్ల దేశ ప్రతిష్ఠ దెబ్బతినేలా ఉందన్నారు. గతంలో అమెరికా వెళ్లిన దేశ ప్రధానులు ఆ దేశ అధ్యక్షుడిని మాత్రమే కలిశారని, కిందిస్థాయి వాళ్లను కలవలేదని గుర్తు చేశారు. ఏపీలో ఆరోగ్యశాఖలో శానిటేషన్ కాంట్రాక్టు కోసం మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్ రాష్ట్రానికి వచ్చారని, దీనికి ఆలయాల పేరు వాడుకోవడం అనైతికమన్నారు. ఈ చర్యతో ఫడ్నవిస్ స్థాయి దిగజారిందన్నారు. మాజీ సీఎం జగన్ పాలనకు భయపడి మాత్రమే ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించారన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రైతులకు ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వలేదన్నారు. కరోనా లాంటి వ్యాధి రాష్ట్రంలో వ్యాపిస్తున్నా ఆస్పత్రుల్లో సూది, మందులు కరువయ్యాయని మండిపడ్డారు. కేవలం అమరావతిలోనే లక్ష కోట్లు ఖర్చు చేయకుండా రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేయాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టులో ఒక మాజీ ముఖ్యమంత్రి రూ.6 వేల కోట్లు తిన్నారని ఆరోపణలున్నా, దీనిపై విచారించేందుకు చంద్రబాబు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. సిద్ధాంతాలను మార్చుకోకపోవడం వల్లనే కాంగ్రెస్ అధికారానికి దూరమవుతోందన్నారు. దేశ ప్రజలందరూ కాంగ్రెస్ పాలన కావాలని కోరుకుంటున్నారన్నారు. 2027లో జమిలి ఎన్నికలు జరుగుతాయని కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందని జోస్యం చెప్పారు. ఢిల్లీ ఘటనకు బాధ్యతవహిస్తూ రైల్వేమంత్రి రాజీనామా చేయాలన్నారు.

కూలీల అకౌంట్లు వాడుకున్నారు

- సైబర్ నేరగాళ్ల కొత్త పంథా
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు పాల్పడుతున్న నేరగాళ్లు కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. అందుకు అమాయక కూలీల అకౌంట్లను వాడుకుంటున్నారు. సోమవారం ఇలాంటి ఘటనే అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో వెలుగు చూసింది. వడ్డెర కాలనీకి చెందిన పీట్ల వెంకటేశ్వరరావు కూలి పని చేస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన డానియేల్, రాముతో ఆయనకు పరిచయం ఉంది. గత ఏడాది వన్‌టౌన్‌లోని బీబీఎస్ బ్యాంక్‌లో అకౌంట్ ఓపెన్ చేస్తే రూ.1,500 ఇస్తారని వెంకటేశ్వరరావుకు డానియేల్, రాము చెప్పారు. దీంతో వెంకటేశ్వరరావు అకౌంట్ ఓపెన్ చేశాడు. రూ.1,500 ఇవ్వడంతో పీట్ల దుర్గాభవాని, వేముల సుశీల, వేముల ఇసాక్‌లతో కూడా అకౌంట్లు ఓపెన్ చేయించారు. ఒకొక్కరికి రూ.1500 ఇచ్చారు. పాస్‌పుస్తకాలు, ఏటీఎం కార్డులు, చెక్‌బుక్‌లను వారి నుంచి తీసేసుకున్నారు. ఈనెల 10న మహారాష్ట్ర జలగాం వద్ద జరిగిన ఓ సైబర్ క్రైమ్ కేసుకు సంబంధించిన నోటీసులు పీట్ల వెంకటేశ్వరరావు, పీట్ల దుర్గాభవాని, వేముల సుశీల, ఇసాక్‌లకు అందాయి. అవి అర్థం కాక తెలిసిన వారికి చూపించారు. పోలీసు నోటీసు వచ్చిందని, వేరే అకౌంట్ల నుంచి నలుగురి అకౌంట్లకు సుమారు రూ. 17.50 లక్షలు జమ అయ్యాయని తేలింది. ఆ నగదు వీరి అకౌంట్లలో లేదు. చెక్‌బుక్‌లు, ఏటీఎం కార్డులు డానియేల్, రాముకు ముందే అప్పగించడంతో వారిపై ఈ నలుగురు బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యా దు చేశారు. తాము రూ.1500 వస్తాయంటే అకౌంట్లు ఓపెన్ చేశామని, తమకు ఏమీ తెలియదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మీకు తెలుసా?

విషాల్ని హరించే కాఫీ

కాఫీతో కొన్ని ఆరోగ్య ప్రయోజనాలుంటాయి. వాటిని పొందాలంటే కాఫీ తాగడానికి కచ్చితమైన పద్ధతిని అనుసరించాలి. అదెలాగంటే...

కాఫీని సరైన మోతాదులో తీసుకుంటే శరీరంలోని విషాలు హరిస్తాయి. దాంతో కాలేయ పనితీరు మెరుగు పడుతుంది. కాఫీ గింజల్లోని క్లోరోజెనిక్ యాసిడ్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్స్ శరీరంలోని ఫ్రీర్యాడికల్స్‌ను స్థిరీకరిస్తాయి. దాంతో మూత్రపిండాల పనితీరు మెరుగై, మూత్రం ద్వారా శరీరంలోని విషాలు బయటకు వెళ్లిపోతాయి. అయితే ఈ ప్రయోజనాలు పొందాలంటే సరైన కాఫీ దినుసులను, సరైన విధానంలో వాడుకుని, సరైన సమయాల్లో, సరైన మోతాదుల్లో కాఫీ తయారుచేసుకుని తాగాలి. అందుకోసం, పురుగు మందులు ఉపయోగించకుండా పండించిన, సేంద్రీయ కాఫీ విత్తనాలను వాడుకోవాలి. అలాగే డికాక్షన్‌కు చక్కెర జోడించకూడదు. బ్లాక్ కాఫీ లేదా దాల్చిన చెక్క జోడించిన కాఫీ తాగాలి. నచ్చినవాళ్లు ఆరోగ్యకరమైన కొబ్బరి నూనె, లేదా వెన్నలను కాఫీకి జోడించి బుల్లెట్‌ప్రూఫ్ కాఫీ తాగొచ్చు. రాత్రిపూట కాఫీ తాగితే విషాలు హరించే ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అయితే ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదకొండున్నర మధ్య సమయం కాఫీకి అనువైన సమయం. కానీ



ఉదయాన్నే నిద్ర లేచిన వెంటనే, రాత్రి పడుకునే ముందు కాఫీ తాగకూడదు. వ్యాయామానికి ముందు బ్లాక్ కాఫీ తాగితే, శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం పెరుగుతుంది. వ్యాయామంతో శరీరం చురుగ్గా మారడం వల్ల విషాలు శరీరంలో నుంచి సునాయాసంగా బయటకు వెళ్లిపోతాయి. అయితే కాఫీ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలంటే రోజుకు రెండు నుంచి మూడు కప్పులకే పరిమితం కావాలి.

పౌష్టికాహారం

పిల్లలు బలంగా

పిల్లలు బలంగా ఎదగాలంటే బలవర్ధకమైన పోషకాహారాలను ఎంచుకుని, వాటికి భోజనంలో స్థానం కల్పించాలి. ప్రత్యేకించి పిల్లలకు తినిపించవలసిన పౌష్టికాహారం ఎలా ఉండాలంటే...

రాగులు: క్యాల్షియం, ఇనుము పుష్కలంగా కలిగి ఉండే రాగులు ఎముకలకు బలాన్నిచ్చి, హీమోగ్లోబిన్ మోతాదును పెంచుతాయి. వీటితో జావ, దోస, లడ్డు తయారుచేసి పిల్లలకు అందించవచ్చు.

ఉసిరి: విటమిన్ సి ఎక్కువగా ఉండే ఉసిరి వ్యాధినిరోధకశక్తిని పెంచుతుంది. జీర్ణశక్తిని మెరుగు పరిచి, చర్మం, వెంట్రుకల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. కాబట్టి ఉసిరి రసం, చట్నీ, మురబ్బా రూపంలో అందించవచ్చు.

నెయ్యి: ఆరోగ్యకరమైన కొవ్వుల భాండాగారమిది. జీర్ణశక్తిని పెంచి, మెదడు అభివృద్ధికి తోడ్పడుతుంది. కాబట్టి అన్నంతో, చపాతీల్లో నెయ్యి జోడిస్తూ ఉండాలి.

పసుపు: పసుపుకు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుంటాయి. రోగనిరోధకశక్తిని పెంచే పసుపు గాయాలను త్వరగా మాన్పుతుంది. కాబట్టి తరచూ పాలు లేదా సూప్స్‌లో పసుపు కలిపి అందిస్తూ ఉండాలి.

మఖానా: ప్రొటీన్, క్యాల్షియం సమృద్ధిగా దొరికే మఖానాలు ఎముకల దృఢత్వాన్ని పెంచుతాయి. వీటిని తింటే పిల్లలు రోజంతా చురుగ్గా ఉంటారు.

ఖర్జూరం: సహజసిద్ధ చక్కెరలను కలిగి ఉండే ఖర్జూరాలు శక్తినిస్తాయి. స్మూదీలు, పండ్ల రసాలు, ఎనర్జీ బాల్స్ రూపంలో ఖర్జూరాలను తినిపిస్తూ ఉండాలి.



బెల్లం: శుద్ధి చేసిన చక్కెరకు ప్రత్యామ్నాయమైన బెల్లంలో ఇనుము ఎక్కువగా దొరుకుతుంది. కాబట్టి పిల్లల కోసం తయారుచేసే తీపి వంటకాల్లో చక్కెరకు బదులుగా బెల్లం వాడుతూ ఉండాలి.

పచ్చి కొబ్బరి: కొబ్బరినీళ్లతో డీహైడ్రేషన్ తొలగిపోతే, కొబ్బరితో ఆరోగ్యకరమైన కొవ్వులు దక్కుతాయి. కాబట్టి కూరలు, స్మూదీలలో పచ్చి కొబ్బరి కోరు కలుపుతూ ఉండాలి. కొబ్బరి చట్నీలు విరివిగా వాడుకోవాలి.

మొలకలు: పెసర మొలకల్లో ప్రొటీన్లు ఎక్కువ. ఇవి తేలికగా అరుగుతాయి కూడా. కాబట్టి సలాడ్స్, వేపుళ్లలో వీటిని కలిపి పిల్లలకు తినిపిస్తూ ఉండాలి.

చిలకడదుంపలు: వీటిలో పీచుకు కొదవ ఉండదు. విటమిన్ ఎ కూడా పుష్కలంగా ఉంటుంది. వీటిని ఉడకబెట్టి, వేయించి, నిప్పుల్లో కాల్చి పిల్లలకు తినిపించవచ్చు.



నెలసరి నత్త నడకన..

8 నుంచి 13 ఏళ్లు... ఆడపిల్లలు యుక్తవయసులోకి అడుగు పెట్టే వయసిది. ఆ తర్వాత పిల్లలు శారీరకంగా పూర్తి స్థాయికి ఎదగడానికి రెండేళ్ల సమయం పడుతుంది. అయితే 15 ఏళ్లు దాటిన తర్వాత యుక్తవయసులోకి అడుగుపెట్టే పిల్లలుంటారు. 8 ఏళ్ల కంటే ముందే కౌమారంలోకి ప్రవేశించే పిల్లలుంటారు. అయితే పిసిఒడిని, యుక్తవయసుకు చేరుకున్న తర్వాత ఆడపిల్లల్లో తలెత్తే ప్రధాన సమస్యగా పరిగణించవచ్చు. సాధారణంగా తొలి నెలసరి మొదలైన ప్రారంభంలో, ఆరు నెలల నుంచి రెండేళ్ల పాటు నెలసరి క్రమం అవకతవకలకు గురవుతూ, నెమ్మదిగా గాడిలో పడుతుంది. ఆ తర్వాత కూడా ఆడపిల్లల్లో నెలసరి క్రమం తప్పుతూనే ఉన్నా, ఆగిపోయినా దాన్ని పిసిఒడిగానే అనుమానించాలి. ఆడపిల్లల్లో పిసిఒడి తలెత్తడానికి ప్రధాన కారణం హార్మోన్ల అసమతౌల్యం.

పిసిఒడి ఎందుకు?

నెలసరి మొదలైన తర్వాత ప్రతి నెలా అండం విడుదల కావాలి. ఈస్ట్రోజన్ హార్మోన్ ఉచ్ఛ స్థాయిలో ఉన్నప్పుడు, నెలలో 14 రోజు నాటికి అండాశయం నుంచి అండం విడుదల అవుతుంది. సాధారణంగా ఆడపిల్లల్లో స్త్రీ, పురుష హార్మోన్లు రెండూ ఉంటాయి. అయితే స్త్రీ హార్మోను ఈస్ట్రోజన్ కంటే పురుష హార్మోన్ టెస్టోస్టిరాన్ మోతాదు తక్కువగా ఉండాలి. కానీ కొందర్లో ఈ పురుష హార్మోన్ ఉండవలసిన పరిమాణం కంటే ఎక్కువగా ఉన్నప్పుడు, ఈస్ట్రోజన్ హార్మోన్ ఉధృతంగా లేకపోవడం వల్ల, పాలీ సిస్టిక్ ఓవరీ డిసీజ్, పిసిఒడి సమస్య తలెత్తి, అండం విడుదల ఆగిపోతుంది. దాంతో అవి అండాశయాల్లో సిస్టులు ఏర్పడతాయి. అయితే హార్మోన్ అసమతౌల్యానికి ఇతరత్రా కారణాలేవీ లేవని నిర్ధారించుకున్న తర్వాతే పిసిఒడిగా నిర్ధారించవలసి ఉంటుంది. నాన్ క్లాసిక్ సిఎహెచ్ (నాన్ క్లాసికల్ కంజెనైటల్ హైపర్‌ప్లేసియా) అనే సమస్యలో కూడా హార్మోన్లు క్రమం తప్పి నెలసరిలో అంతరాయం ఏర్పడుతుంది. కాబట్టి నెలసరిలో అవకతవకలకు ఈ సమస్య కారణం కాదని నిర్ధారించుకోవాలి. అలాగే కొందర్లో ప్రొలాక్టిన్ హార్మోన్ ఎక్కువగా ఉన్నా, నెలసరి క్రమం తప్పుతుంది. కార్టిసాల్ హార్మోన్ ఎక్కువగా ఉన్నా, తక్కువగా ఉన్నా ఇదే సమస్య తలెత్తుతుంది. ఇవేవీ కారణం కాదని నిర్ధారించుకున్న తర్వాతే పిసిఒడిగా నిర్ధారించుకోవాలి.



ప్రధాన లక్షణాలు ఇవే!

పిసిఒడికి గురైన అమ్మాయిల్లో, టెస్టోస్టిరాన్ ఎక్కువగా ఉండడానికి ప్రధాన కారణం, ఇన్సులిన్ సమర్థమైన ప్రభావాన్ని కనబరచకపోవడమే! పురుష హార్మోన్ టెస్టోస్టిరాన్ ఈస్ట్రోజన్ హార్మోన్‌గా మారడానికి ఈ ఇన్సులిన్ రెసిస్టెన్స్ అడ్డుపడడం మూలంగా పిసిఒడి తలెత్తుతుంది. ఈ సమస్య కొన్ని ప్రధాన లక్షణాల రూపంలో బయల్పడుతుంది. అవేంటంటే...

పైపెదవి, ఛాతీ, చేతులు, కాళ్ల మీద అవాంఛిత రోమాలు పెరగడం

- గరుకుగా ఉండే, మందపాటి రోమాలు
- మొటిమలు తలెత్తడం
- నెలసరి క్రమం తప్పడం
- బరువు పెరగడం

పరీక్షలున్నాయి

నెలసరి క్రమం తప్పిన ఆడపిల్లలకు రక్త పరీక్ష, పొత్తికడుపు అల్ట్రాసౌండ్‌తో, నాన్ క్లాసిక్ సిఎహెచ్, కార్టిసాల్, ప్రొలాక్టిన్ మోతాదు, ఫాస్టింగ్ గ్లూకోజ్, పిసిఒడి సమస్యలను నిర్ధారించుకోవాలి. ఈ పరీక్షల్లో బయల్పడిన ఫలితాల ఆధారంగా సమస్యను కచ్చితంగా అంచనా వేసి,

సన్నగా ఉన్నవాళ్లకు 'లీన్ పిసిఒడి'

కేవలం అధిక బరువు కలిగి ఉన్న పిల్లల్లోనే పిసిఒడి తలెత్తుతుందనుకుంటే పొరపాటు. బరువు తక్కువగా ఉండే నాజూకు ఆడపిల్లల్లో కూడా పిసిఒడి తలెత్తవచ్చు. అదే 'లీన్ పిసిఒడి'. దీనికి కారణం... జన్యుపరమైన ఇన్సులిన్ రెసిస్టెన్స్. జన్యుపరంగా ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను కలిగి ఉన్న ఆడపిల్లల్లో పిసిఒడి చికిత్స కొంత క్లిష్టమవుతుంది. సన్నగా ఉంటారు కాబట్టి బరువు తగ్గడం వల్ల అదనపు ప్రయోజనం దక్కదు. అయితే వ్యాయామం చేయడం తప్పనిసరి. దీంతో ప్రయోజనం కనిపించనప్పుడు మాత్రమే వైద్యులు నోటి మాత్రలు సూచిస్తారు. పెళ్లి కాని అమ్మాయిల విషయంలో ఇలా మాత్రలు వాడుకోవచ్చు. కానీ పిల్లల కోసం ప్రయత్నిస్తున్న మహిళల్లో ఈ సమస్య ఉన్నప్పుడు ఇన్‌ఫెర్టిలిటీ చికిత్సలను ఆశ్రయించాల్సి ఉంటుంది.

తగిన చికిత్సతో సమస్యను సరిదిద్దుకోవాలి. పిసిఒడిని సరిదిద్దడం కోసం ప్రధానంగా వ్యాయామానికీ, ఆహార నియమాలకూ ప్రాధాన్యమివ్వాలి. కనీసం ఐదు శాతం బరువు తగ్గినా పరిస్థితి అదుపులోకొస్తుంది. ఇలా మందులతో



పనిలేకుండా సహజసిద్ధంగా పిసిఒడిని సరిదిద్దుకునే ప్రయత్నాలు మొదలుపెట్టాలి. ఇన్ని నియమాలు పాటించినా పరిస్థితి అదుపులోకి రానప్పుడు మాత్రమే, చికిత్స అవసరమవుతుంది. చికిత్సలో భాగంగా హార్మోన్ ఇంజెక్షన్లు ఇవ్వవలసి ఉంటుంది.

ఈ నియమాలు తప్పనిసరి

ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ హార్మోన్ ఇంజెక్షన్లతో నాలుగైదు నెలల పాటు నెలసరి క్రమం తప్పకుండా కనిపిస్తే, వైద్యులు ఆ చికిత్సను ఆపి, కొన్ని నెలల పాటు నెలసరి క్రమాన్ని పరీక్షిస్తారు. ఆలోగా పరిస్థితి గాడిలో పడి నెలసరి గాడిలో పడుతుంది. ఈ నాలుగు నెలలూ వ్యాయామం కూడా కొనసాగిస్తే, ఫలితం మరింత మెరుగు పడుతుంది. అయితే హార్మోన్ ఇంజెక్షన్లతో పని లేకుండా సహజసిద్ధంగా శరీర హార్మోన్లను దారికి తెచ్చుకోవడం కోసం కొన్ని నియమాలను అనుసరించవచ్చు. అవేంటంటే...

- క్రమం తప్పక ఏరోబిక్ వ్యాయామాలు చేయాలి
- నడక వల్ల కూడా ప్రయోజనం ఉంటుంది
- సమతులాహారం తీసుకోవాలి
- ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను అలవరుచుకోవాలి
- కనీసం 5% మేరకు శరీర బరువు తగ్గించుకోవాలి.

డాక్టర్ రాకేష్ బోపన్న
డాక్టర్ రాకేష్ ఎండోక్రైన్ అండ్ డయాబెటిస్ సెంటర్,
ల్యాంకో హిల్స్, మణికొండ, హైదరాబాద్.



కాలానుగుణ ఇన్‌ఫెక్షన్

ఆ రెండూ ఒకటి కావు

ఓ పక్క బర్డ్ ఫ్లూ కొనసాగుతోంది. మరో పక్క ఫారింగ్జయిటిస్ లాంటి శ్వాసకోస ఇన్‌ఫెక్షన్లు వేధిస్తున్నాయి. ఒకే లక్షణాలను కలిగి ఉండే ఈ రెండు ఆరోగ్య సమస్యల్లో ప్రధాన వ్యత్యాసాలు లేకపోలేదు. ఆ వ్యత్యాసాల ఆధారంగా సమస్యను కచ్చితంగా ఎలా గుర్తించాలో, ఎలా సరిదిద్దుకోవాలో వైద్యులు వివరిస్తున్నారు.

చల్లని చలికాలం నుంచి వేడిగా ఉండే వేసవి కాలంలోకి అడుగుపెడుతున్నాం. అటు చలి, ఇటు వేసవి కాని ఈ మధ్యస్థ కాలంలో, రోజు మొత్తంలో వాతావరణం భిన్నమైన ఉష్ణోగ్రతలకు లోనవుతూ ఉంటుంది. పొద్దున్న చలి ఎక్కువగా, మధ్యాహ్నం వేడి ఎక్కువగా, సాయంత్రానికి మళ్లీ చలి పెరుగుతూ ఇలా శరీరం భిన్నమైన ఉష్ణోగ్రతలకు బహిర్గతమవుతూ ఉంటుంది. ఇలాంటి పరిస్థితులకు శరీరం అలవాటు పడే క్రమంలో వాతావరణంలోని పలురకాల వైరస్‌ల వల్ల వేర్వేరు ఇన్‌ఫెక్షన్లు సోకుతూ ఉంటాయి. వాటిలో ప్రధానమైనది... 'ఫారింగ్జయిటిస్'. ముక్కు, నోరు, శ్వాస నాళిక వెనక భాగంలో ఉండే ఫారింగ్స్‌కు వాతావరణంలో విజృంభించే చిన్నపాటి వైరస్‌లు సోకుతూ ఉంటాయి. ప్రధానంగా బడికెళ్లే పిల్లలకు సోకే ఈ ఇన్‌ఫెక్షన్ క్రమేపీ కుటుంబానికీ, ఇతరులకూ వ్యాపిస్తూ ఉంటుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఇది తీవ్రంగా పరిగణించవలసిన సమస్య కాకపోయినప్పటికీ, స్వల్పకాలిక మందులతో లక్షణాలను అదుపులోకి తెచ్చుకోవాలి. అంతిమంగా జ్వరం వరకూ సమస్య ముదిరిపోకుండా ఉండడం కోసం ముందు నుంచే జాగ్రత్త పడాలి. ప్రధానంగా అలర్జీ ప్రతిస్పందన, వైరస్ విజృంభణ మూలంగా ఫారింగ్జయిటిస్ వేధిస్తుంది కాబట్టి అలర్జీని తగ్గించే మందులతో, ఉపశమనాన్నిచ్చే గృహ వైద్యాలతో చికిత్స మొదలుపెట్టాలి. అందుకోసం....

- యాంటీబయాటిక్స్ వాడకూడదు
- రోజుకు మూడు సార్లు ఆవిరి పట్టాలి
- చల్లని పదార్థాలు, ద్రవాలకు దూరంగా ఉండాలి
- గోరువెచ్చని నీళ్లలో ఉప్పు కలిపి నోరు పుక్కిలించాలి
- చల్లని గాలికి బహిర్గతం కాకుండా చూసుకోవాలి
- యాంటీ ఎలర్జిక్ మందులు పరిమితంగా వాడుకోవాలి
- వీలైనంత తక్కువ మోదాదులో పారాసిటమాల్ వాడుకోవాలి



బర్డ్ ఫ్లూలో కూడా ఇవే లక్షణాలు

జ్వరం, ఎగువ శ్వాసకోస ఇన్‌ఫెక్షన్, ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు, వాంతులు బర్డ్ ఫ్లూ ప్రధాన లక్షణాలు. అయితే ఇవి ఫారింగ్జయిటిస్‌ను పోలినట్టే కనిపించినా, బర్డ్ ఫ్లూలో జ్వరం, ఒళ్లు నొప్పులు ఎక్కువగా ఉంటాయి. వీటితోనే ఈ వ్యాధి మొదలవుతుంది. ఫారింగ్జయిటిస్‌లో, ముక్కు దిబ్బెడ, గొంతునొప్పితో మొదలై అంతిమంగా జ్వరం కనిపిస్తుంది. కానీ బర్డ్ ఫ్లూ ఏకంగా జ్వరంతో మొదటి రోజే ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు వేధిస్తాయి. వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉండే పిల్లలు, వృద్ధులకు వినహా బర్డ్‌ఫ్లూ తీవ్రమైన పరిణామాలకు దారి తీయదు. అయితే బర్డ్ ఫ్లూ సోకినప్పుడు, లక్షణాల ఆధారంగా చికిత్స ఇవ్వవలసి ఉంటుంది. అవసరాన్ని బట్టి వైద్యులు మాత్రమే తగిన యాంటీబయాటిక్స్ సూచించగలుగుతారు. దగ్గు, జలుబులను తగ్గించుకోవడం కోసం వేడి నీటి ఆవిరి, గోరువెచ్చని నీటితో నోరు పుక్కిలించడం లాంటి చిట్కాలు పాటించవచ్చు.

ఫారింగ్జయిటిస్‌ను, ఎటువంటి వైద్య చికిత్స అవసరం లేకుండా, రోగనిరోధకశక్తి సహాయంతో ఐదు రోజుల్లోనే అదుపులోకి తెచ్చుకోవచ్చు. కానీ బర్డ్ ఫ్లూకు వైద్య చికిత్స అవసరమవుతుంది. అయినప్పటికీ లక్షణాల తీవ్రతను బట్టి వైద్యులను సంప్రతించడం అవసరం.

డాక్టర్ సుధీర్ రెడ్డి, ఇఎన్‌టి సర్జన్,
శ్రీ సెన్సెస్,
హబ్సిగూడ, హైదరాబాద్.



అసలు నకిలీ

కల్తీ పన్నీర్‌ను కనిపెట్టేద్దాం!

పన్నీర్ ఆరోగ్యకరం. క్యాల్షియం, విటమిన్ ఎ సమృద్ధిగా దొరికే పన్నీర్‌తో ఎముకలు దృఢపడతాయి. అయితే మార్కెట్లో మనకెన్నో రకాల పన్నీర్ అందుబాటులో ఉంటోంది. వాటిలో నకిలీ పన్నీర్ కూడా ఉంటుంది. దాన్నెలా గుర్తించాలో తెలుసుకుందాం!

ఇటీవలి కాలంలో వంటనూనెలతో కూడా పన్నీర్‌ను తయారు చేస్తున్నారు. అనలాగ్ పన్నీర్ అనే పేరుతో దొరుకుతున్న ఈ పన్నీర్‌లో పోషకాలు తక్కువ. అసలైన పన్నీర్ మృదువుగా, చిదిమితే విరిగిపోతూ, పాల వాసనను వెలువరిస్తూ ఉంటుంది. కానీ అనలాగ్ పన్నీర్, రబ్బరులా గట్టిగా ఉంటుంది. వేడిచేసినప్పుడు పాలతో తయారైన పన్నీర్ పాల కొవ్వును విడుదల చేస్తే, అదనపు నీళ్లను విడుదల చేస్తుంది. అలాగే ఈ నకిలీ పన్నీర్‌ను పరీక్షించడం కోసం, నీళ్లలో ఉడకబెట్టి, చల్లారిన తర్వాత కొన్ని చుక్కల అయొడిన్ టింక్చర్‌ను జోడించాలి. అప్పుడు పన్నీర్ నీలం రంగులోకి మారితే, దాన్లో స్టార్చ్ ఉందనీ, నకిలీదని అర్థం. అలాగే పన్నీర్‌ను నీళ్లలో ఉడకబెట్టి, చల్లారిన తర్వాత దాని మీద కందిపప్పు పొడి లేదా సోయాబీన్ పొడి చల్లాలి. పది నిమిషాల తర్వాత అది లేత ఎరుపు రంగులోకి మారితే ఆ పన్నీర్‌లో డిటర్జెంట్ లేదా యూరియా కలిసిందని అర్థం. మన దేశంలో అనలాగ్ పన్నీర్ విక్రయం చట్టబద్ధం. అయితే లేబుల్ మీద 'నాన్ డైరీ' అని స్పష్టంగా పేర్కొనాలి. కాబట్టి పన్నీర్ కొనేటప్పుడు ఆ అక్షరాల కోసం వెతకాలి. అనలాగ్ పన్నీర్ సింథటిక్ కాబట్టి దాంతో ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుందనీ, జీర్ణకోశ సమస్యలు వేధిస్తాయనీ, ట్రాన్స్‌ఫ్యాట్స్ ఎక్కువగా ఉండే ఈ పన్నీర్‌తో గుండెజబ్బులు పెరుగుతాయనీ వైద్యులు హెచ్చరిస్తున్నారు.



అవగాహన

బరువు తగ్గించే 'మోనో డైట్'

బరువు తగ్గడానికి ఎన్నో కొత్త కొత్త పోకడలు వాడుకలోకొస్తూనే ఉన్నాయి. తాజా 'మోనో డైట్ విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. దీంతో ఒరిగే లాభనష్టాల గురించి తెలుసుకుందాం!

బరువు తగ్గడం కోసం ఒకే రకమైన పదార్థాలను తినడమే... మోనోట్రోపిక్ డైట్. ఈ తరహా డైట్‌తో బరువు తగ్గినా అది తాత్కాలికం కావచ్చు. దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని నష్టపరచవచ్చు. ఈ డైట్‌ను అనుసరించడం కోసం ఒకే పదార్థానికి దీర్ఘకాలం పాటు కట్టుబడి ఉండాలి. అరటిపండ్లు ఎంచుకునే అరటిపండే తినాలి. కొందరు బంగాళాదుంపలు,



గుడ్లు కూడా ఎంచుకుంటూ ఉంటారు. అవి తప్ప వేరే పదార్థాలేవీ తినకూడదు. ఇలా క్యాలరీల మీద కోత విధించే మోనో డైట్ వల్ల బరువు తగ్గే ప్రక్రియ వెంటనే మొదలైపోతుంది. అయితే ఒంట్లో నీటి శాతం తగ్గడం, కండర క్షీణత వల్ల కూడా బరువు తగ్గే అవకాశం ఉందనే విషయం గుర్తుంచుకోవాలి. బరువు తగ్గడంతో కూడా నీరసం, నిస్సత్తువలు కూడా వేధిస్తాయి.

దుష్ప్రభావాలు

మోనో డైట్‌లో భాగంగా పోషకాల కొరత ఏర్పడడం వల్ల ఆహారం మీద వ్యామోహం పెరుగుతుంది. దాంతో అవసరానికి మించి తినే ప్రమాదం ఉంటుంది. పోషక లోపం వల్ల గాల్‌స్టోన్స్, ఎలక్ట్రొలైట్ అసమతౌల్యం, మలబద్ధకం, తలనొప్పి, నీరసం, పోషకలోపాలు, కండర క్షీణతలు వేధిస్తాయి. మరీ ముఖ్యంగా అధిక రక్తపోటు, మధుమేహం, హృద్రోగాలు లాంటి ఆరోగ్య సమస్యలున్నవారు వైద్యులను సంప్రతించకుండా మోనో డైట్‌ను అనుసరించకూడదు.



మొదలైంది.. సందడి

కరాచీ: దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఓ ప్రధాన టోర్నమెంట్ జరుగుతుండడంతో పాకిస్థాన్‌లో ఎటు చూసినా క్రికెట్ సందడి కనిపిస్తోంది. 1996 వన్డే వరల్డ్ కప్ తర్వాత భద్రతా కారణాల రీత్యా ఇక్కడ ఎలాంటి ఐసీసీ టోర్నీలు జరుగలేదు. మళ్లీ ఇన్నాళ్లకు ఈనెల 19 నుంచి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి పాక్ ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం కరాచీ, లాహోర్, రావల్పిండిలోని స్టేడియాలను ఆధునికీకరించారు. ఇక ఎప్పుడెప్పుడా అని పాక్ క్రికెట్ అభిమానులు టోర్నీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తుండగా, బుధవారం ఆరంభ పోరులో పాక్-కివీస్ కరాచీలో తలపడనున్నాయి. అయితే టీమిండియా పాక్‌కు రాకపోవడంతో అభిమానుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. తమ దేశంలో భారత జట్టు ఆటతీరును కూడా ఇష్టపడతారని, అలాగే విరాట్‌కు పెద్ద ఎత్తున ఫ్యాన్స్ ఉన్నారంటూ స్థానిక దుకాణం యజమాని మొయిజ్ తెలిపాడు. అందుకే తమ దుకాణంలో పాక్‌తో పాటు భారత జెర్సీలు కూడా అమ్ముడుపోతాయని, గత మూడు రోజుల్లో ఈ రెండింటిని 5000 వరకు అమ్మినట్టు తెలిపాడు. ఇతర మ్యాచ్‌ల సమయాల్లోనూ కోహ్లీ ఫొటోలను ప్రదర్శించేందుకు, అతడి పేరున్న షర్ట్‌లను వేసుకునేందుకు కూడా ఇష్టపడతారన్నాడు. మరోవైపు టోర్నీ సందర్భంగా పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారు.

చాంపియన్స్ ట్రోఫీ
రేపటినుంచే



బుమ్రా లోటును భర్తీ చేస్తాడా?

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ముందే పేస్ దళపతి బుమ్రా గాయం కారణంగా దూరమవడం టీమిండియాకు గట్టి ఝలక్ తగిలినట్టయింది. ప్రాథమిక జట్టులో బుమ్రా పేరును చేర్చినా వెన్నునొప్పితో బాధపడుతుండడంతో అతడికి విశ్రాంతినివ్వడమే మేలని బీసీసీఐ భావించింది. దీంతో ఇప్పుడు బౌలింగ్ భారమంతా వెటరన్ స్టార్ పేసర్ మహ్మద్ షమిపై పడింది. మరిప్పుడు కీలకమైన ఈ టోర్నీలో బుమ్రా లోటును భర్తీ చేస్తూ షమి జట్టుకు అండగా నిలుస్తాడా?

రెండేళ్ల క్రితం భారత్‌లో జరిగిన వన్డే వరల్డ్‌కప్ తర్వాత గాయం కారణంగా షమి ఏడాదిపాటు క్రికెట్‌కు దూరమయ్యాడు. గతేడాది చివర్లో దేశవాళీతో మళ్లీ బంతి పట్టిన షమి.. ఆ టోర్నీల్లో అద్భుత ప్రదర్శనతో సత్తా చాటాడు. అంతే కాదు.. ఇటీవల జాతీయ జట్టులోకి పునరాగమనం చేసి ఇంగ్లండ్‌తో సిరీస్‌లోనూ ఆకట్టుకున్నాడు. అయితే బుమ్రా లేని వేళ.. జట్టు 12 ఏళ్ల చాంపియన్స్ ట్రోఫీ కలను నెరవేర్చడంలో షమి కీలకంగా వ్యవహరిస్తాడా? అనే సందేహం అందరి మదిలోనూ ఉంది. కానీ, షమి ప్రదర్శనపై అనుమానం పెట్టుకోవాల్సిన అవసరం లేదనీ, అతడు కచ్చితంగా మెగా ఈవెంట్‌లో సత్తా చాటుతాడని టీమిండియా మాజీ పేసర్ లక్ష్మీపతి బాలాజీ విశ్వాసం వ్యక్తం చేశాడు. అపార అనుభవమున్న షమి.. కచ్చితంగా బుమ్రాను మరిపిస్తాడన్నాడు. 'వాస్తవానికి షమి 2019లోనూ, అలాగే చివరి వన్డే వరల్డ్‌కప్‌లోనూ బుమ్రాకు మించి ప్రదర్శన కనబర్చాడు. అన్ని ఫార్మాట్లలోనూ బుమ్రా చాంపియన్ బౌలర్. కానీ బుమ్రా జట్టులోకి రాకముందు భారత బౌలింగ్‌ను షమినే ముందుకు నడిపించిన విషయం గుర్తుంచుకోవాలి. భారత్ విశేషంగా రాణించాలంటే.. షమి కొత్త బంతితో తొలి ఆరు ఓవర్లలో ప్రభావం చూపాల్సి ఉంటుంది. గాయం నుంచి కోలుకున్నాక అతడి బౌలింగ్‌లో వేగం స్వల్పంగా తగ్గిన మాట వాస్తవం. కానీ షమి తన మణికట్టు సహాయంతో వైవిధ్యమైన బంతులను వేయగలడు. అతడి సీమ్‌ను అంచనా వేయడం బ్యాటర్లకు అంత సులువు కాదు. దుబాయ్‌లో పరిస్థితులు కూడా భారత్‌లో మాదిరే ఉంటాయి. కాబట్టి షమి ప్రణాళికలకు తగ్గట్టు బౌలింగ్ చేస్తే చాలు' అని బాలాజీ సూచించాడు. షమి బాధ్యత వికెట్లు తీయడమే కాదని, జట్టులో యువ పేసర్లు అర్ష్‌దీప్, హర్షిత్ రాణాలకు మార్గనిర్దేశకుడిగా ఉండాల్సిన అవసరం ఉందన్నాడు.



షమి

'బ్లాక్' టిక్కెట్లకు భారీ డిమాండ్!

ఒక్కోటి రూ. 5 లక్షలు
భారత్ x పాక్ పోరు

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో అన్ని మ్యాచ్‌లూ ఓ ఎత్తయితే..భారత-పాకిస్థాన్ మధ్య జరిగే లీగ్ పోరు మరో ఎత్తు. ఆ క్రమంలోనే ఈనెల 23న దుబాయ్‌లో జరిగే మ్యాచ్ టిక్కెట్లకోసం డిమాండ్ అలా ఇలా లేదు. దానిని బ్లాక్‌మార్కెటీర్లు పూర్తిగా 'క్యాష్' చేసుకుంటున్నారు ! దాంతో మ్యాచ్ టిక్కెట్ రేట్ అమాంతం రూ. నాలుగు లక్షలకు చేరింది. ఇది గ్రాండ్‌స్టాండ్‌లో ఉండేసీటు ఖరీదు. మామూలుగా అయితే ఈ టిక్కెట్ ధర రూ. 1.80 లక్షలు మాత్రమే. ఇదే స్టాండులో కొంత ప్రత్యేకంగా ఉండే సీటు కావాలంటే రూ. ఐదు లక్షలు వెచ్చించాల్సిందే. కాగా.. మ్యాచ్ టిక్కెట్ల అమ్మకాలను ఈనెల మూడునే ప్రారంభించారు. విక్రయాలు ప్రారంభమైన నిమిషాల్లోనే అన్ని టిక్కెట్లూ అమ్ముడవడం విశేషం. దాంతో 25వేల సీట్ల సామర్థ్యం కలిగిన దుబాయ్ స్టేడియంలో..ఇండో-పాక్ మ్యాచ్‌కోసం మరో దఫా టిక్కెట్లను విక్రయించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి నిర్ణయించింది. దాంతో ఆదివారం (16న)నాడు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.30కు రెండోసారిటిక్కెట్ల అమ్మకాలు ప్రారంభం కాగా..కొద్ది సేపటికే అయిపోయాయి. దరిమిలా..బ్లాక్ టిక్కెట్లకు బాగా డిమాండ్ ఏర్పడింది. మరోవైపు భారత్-న్యూజిలాండ్ మ్యాచ్‌తో పాటు సెమీ ఫైనల్ టిక్కెట్లు కూడా అందుబాటులో ఉండడం గమనార్హం.

వీఐపీ బాక్సు వద్దు

ఆ టిక్కెట్లను అమ్మి పీసీబీకివ్వండి ● చైర్మన్ నక్వీ సూచన



కరాచీ: అసలే పాకిస్థాన్ ఆర్థిక ఇక్కట్లలో కూరుకుపోయింది. ఈ తరుణంలో చాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్యం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కి దక్కింది. దాంతో కరాచీ, లాహోర్, రావల్పిండి స్టేడియాలను అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దాల్సి వచ్చింది. ఇందుకోసం పీసీబీ దాదాపు 600 కోట్ల రూపాయలు వెచ్చించిందని సమాచారం. ఫలితంగా పీసీబీ కూడా ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటోంది. ఇకపోతే..టోర్నీ బ్లాక్‌బస్టర్ భారత-పాకిస్థాన్ మ్యాచ్ ఈనెల 23న దుబాయ్‌లో జరగనుంది. ఈ పోరును పీసీబీ చీఫ్‌గా మొహిసీన్ నక్వీ దుబాయ్ స్టేడియంలో రూ. 3.47 కోట్ల ఖరీదైన వీఐపీ బాక్సు నుంచి చూసే అవకాశం ఉంది. ఇందులో 30 సీట్లుంటాయి. అయితే నక్వీ ఆ బాక్సునుంచి మ్యాచ్‌ను చూసేందుకు నిరాకరించాడు. సాధారణ ఎన్‌క్లోజర్ నుంచే తాను పోటీని వీక్షిస్తానని స్పష్టంజేశాడు. అంతేకాదు..తనకు కేటాయించిన వీఐపీ బాక్సు టిక్కెట్లను అమ్మడం ద్వారా వచ్చిన మొత్తాన్ని పీసీబీ ఖాతాకు జమ చేయాలని ఎమిరేట్స్ క్రికెట్ బోర్డుతోపాటు అంతర్జాతీయ క్రికెట్ మండలికి అతడు సూచించాడు.

కరాచీ స్టేడియంలో కనిపించని భారత జెండా

పీసీబీ తీరుపై విమర్శలు



మరో 24 గంటల్లో ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుండగా.. ఆతిథ్య పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తీరుపై పెద్ద ఎత్తున వివాదం రేగింది. చాంపియన్స్ ట్రోఫీలో భారత్ సహా ఎనిమిది జట్లు పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ఈమేరకు కరాచీలోని నేషనల్ స్టేడియంలో టోర్నీలో తలపడుతున్న దేశాల పతాకాలను ఎగుర వేశారు. వాటిలో భారత జెండా లేకపోవడంతో తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్టేడియంలో మువ్వన్నెల పతాకం లేని వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. భారతీయులు, ఇతర నెటిజన్లు పీసీబీ తీరును ఎండగడుతున్నారు. అంతకుముందు లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలోనూ ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. చాంపియన్స్ ట్రోఫీకి సంబంధించి అక్కడ ఓ కార్యక్రమం జరిగింది. ఆ సందర్భంగా కూడా..భారత్ పతాకం తప్ప టోర్నమెంట్‌లో పాల్గొంటున్న మిగిలిన ఏడు జట్ల దేశాల జెండాలు ఆ స్టేడియంలో కనిపించాయి.

అందుకే భారత జెండా లేదు...
అయితే స్టేడియాల్లో భారత జెండా పెట్టకపోవడానికి కారణం ఆ దేశం పాకిస్థాన్ రాకపోవడమేనని పీసీబీ స్పష్టం చేసింది. తమ దేశంలో ఆడే దేశాలకు సంబంధించిన జెండాలను మాత్రమే స్టేడియాల్లో ఎగురవేశామని బోర్డు తెలిపింది. దీనిపై వివరణ ఇవ్వాల్సిన అవసరం కూడా లేదంది.



మనూ భాకర్‌కు బీబీసీ అవార్డు

'జీవిత సాఫల్యా'నికి మిథాలీ ఎంపిక

న్యూఢిల్లీ: ప్రఖ్యాత షూటర్ మనూ భాకర్ బీబీసీ అవార్డుకు ఎంపికైంది. ఆమెను బీబీసీ 'స్పోర్ట్స్ ఉమన్ ఆఫ్ ఇండియా'గా సోమవారం ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చినందుకుగాను భాకర్‌కు ఈ అవార్డు లభించింది. మనూతోపాటు గోల్ఫర్ అదితి అశోక్, పారా షూటర్ అవని లెఖారా, టీమిండియా వైస్-కెప్టెన్ స్మృతీ మంధాన, స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ ఈ అవార్డుకు పోటీపడ్డారు. అయితే ప్రఖ్యాత క్రీడా పాత్రికేయులు, రచయితలతో కూడి జ్యూరీ మనూ భాకర్‌ను ఎంపిక చేసింది. 22 ఏళ్ల భాకర్ పారిస్ ఒలింపిక్స్ 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాలలో కాంస్య పతకాలు నెగ్గిన సంగతి తెలిసిందే. ఇంకా.. పారా ఆర్చర్ శీతల్ దేవి (బీబీసీ ఎమర్జింగ్ ప్లేయర్), భారత మహిళల జట్టు మాజీ సారథి మిథాలీ రాజ్ (జీవిత సాఫల్య), పారా షూటర్ అవని (పారా స్పోర్ట్స్ ఉమన్ ఆఫ్ ద ఇయర్) పురస్కారాలకు ఎంపికయ్యారు. ఇక..చెస్ క్రీడాకారిణి తానియా సచ్‌దేవ్‌ను 'చేంజ్ మేకర్' అవార్డు వరించింది.

విదర్భ 308/5

ముంబైతో రంజీ సెమీస్

నాగ్‌పూర్: డానిష్ మలేవార్ (79), ధ్రువ్ షోరె (74) రాణించడంతో.. డిఫెండింగ్ చాంప్ ముంబైతో సోమవారం ఆరంభమైన రంజీ సెమీస్‌లో విదర్భ భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 308/5 స్కోరు చేసింది. యశ్ రాథోడ్ (47), కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (13) క్రీజులో ఉన్నారు. కరుణ్ నాయర్ (45) ఫర్వాలేదనిపించాడు. శివం దూబే, షామ్స్ ములాని చెరో 2 వికెట్లు పడగొట్టారు.



డానిష్ (79)

ఆదుకొన్న సచిన్ బేబీ... కేరళ 206/4: సచిన్ బేబీ (69 బ్యాటింగ్) అర్థ శతకంతో ఆదుకోవడంతో.. గుజరాత్‌తో మొదలైన రంజీ సెమీస్ మ్యాచ్‌లో కేరళ కోలుకొంది. టాస్ గెలిచి బరిలోకి దిగిన కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 206 పరుగులు చేసింది. మొదటి రోజు ఆట చివరకు బేబీతోపాటు అజరుద్దీన్ (30) క్రీజులో ఉన్నారు. రోహన్ కున్నుమ్మల్ (30), అక్షయ్ చంద్రన్ (30), జలజ్ సక్సేనా (30) ఫర్వాలేదనిపించారు.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
గుజరాత్ x ముంబై
రాత్రి 7.30 నుంచి

మెరిసిన మంధాన

ఢిల్లీపై బెంగళూరు విజయం



స్మృతి మంధాన (81)

వడోదర: కెప్టెన్ స్మృతి మంధాన (47 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లతో 81) ధనాధన్ అర్ధ శతకంతో.. మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. సోమవారం ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. తొలుత ఢిల్లీ 19.3 ఓవర్లలో 141 పరుగులకు కుప్పకూలింది. జెమీమా రోడ్రిగ్స్ (34), సారా బ్రైస్ (23) టాప్ స్కోరర్లు. రేణుక, జార్జియా వేర్హమ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో బెంగళూరు 16.2 ఓవర్లలో 146/2 స్కోరు చేసి గెలిచింది.

ఆరంభం నుంచే జోరు..: ఓ మాదిరి లక్ష్యం కోసం బరిలోకి దిగిన చాలెంజర్స్‌కు ఓపెనర్ స్మృతి మంధాన అదిరే ఆరంభాన్నిచ్చింది. తొలి ఓవర్‌లోనే రెండు బౌండ్రీలు బాదిన మంధాన.. ఆ తర్వాత మరో రెండు ఫోర్లు కొట్టింది. మరో ఓపెనర్ డానీ వ్యాట్ (42) కూడా రెండు బౌండ్రీలతో టచ్‌లోకి రావడంతో స్కోరు బోర్డు ఊపందుకొంది. ఐదో ఓవర్‌లో అరుంధతి బౌలింగ్‌లో మంధాన సిక్స్ బాదగా.. శిఖా వేసిన ఆరో ఓవర్‌లో వ్యాట్ రెండు ఫోర్లు సాధించింది. దీంతో పవర్‌ప్లేను బెంగళూరు 57/0తో ముగించింది. తొమ్మిదో ఓవర్‌లో రెండు ఫోర్లు కొట్టిన మంధాన.. సింగిల్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొంది. దీంతో 10 ఓవర్లు ముగిసే సరికి బెంగళూరు స్కోరు సెంచరీ దాటింది. అయితే, 11వ ఓవర్‌లో వ్యాట్‌ను అరుంధతి అవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. విజయానికి 9 పరుగులు కావల్సి ఉండగా.. స్మృతిని పాండే అవుట్ చేసింది. కానీ, పెర్రీ (7 నాటౌట్), రిచా (11 నాటౌట్) మరో 22 బంతులు మిగిలుండగానే జట్టును గెలుపు గీత దాటించారు.

రోడ్రిగ్స్ మినహా..: షఫాలీ వర్మ (0)ను రేణుక డకౌట్ చేసినా.. కెప్టెన్ మెగ్ లానింగ్ (17) సహకారంతో జెమీమా రోడ్రిగ్స్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. పవర్‌ప్లేను ఢిల్లీ 55/1తో ముగించింది. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లోనే వేర్హమ్ బౌలింగ్‌లో రోడ్రిగ్స్ స్టంపౌట్ కావడంతో.. రెండో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరో రెండు పరుగుల తేడాతో లానింగ్ కూడా వెనుదిరగడంతో ఢిల్లీ బ్యాటింగ్ ఒక్కసారిగా కుదుపులకు గురైంది. ధాటిగా ఆడే ప్రయత్నం చేస్తున్న సదర్లాండ్ (19)ను రేణుక పెవిలియన్ చేర్చగా.. జొనాసెన్ (1), కాప్ (12)ను ఏక్తా బిష్త్ అవుట్ చేయడంతో ఢిల్లీ 105/6తో ఇబ్బందుల్లో పడింది. అయితే, డెత్ ఓవర్లలో బ్రైస్, పాండే (14) ఏడో వికెట్‌కు 25 పరుగులు జోడించడంతో.. టీమ్ స్కోరు 140 మార్క్ దాటింది.

సంక్షిప్తస్కోర్లు

ఢిల్లీ: 19.3 ఓవర్లలో 141 ఆలౌట్ (జెమీమా రోడ్రిగ్స్ 34, సారా బ్రైస్ 23; రేణుకా సింగ్ 3/23, వేర్హమ్ 3/25, కిమ్ గార్త్ 2/19, ఏక్తా బిష్త్ 2/35).
బెంగళూరు: 16.2 ఓవర్లలో 146/2 (స్మృతి మంధాన 81, డానీ వ్యాట్ 42; అరుంధతి 1/25, శిఖా పాండే 1/27).

రెండు బెయిల్స్ పడితేనే..

రెండురోజుల క్రితం ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ నెగ్గడం వివాదాస్పదమైంది. గెలుపు రన్ తీసే క్రమంలో ఢిల్లీ బ్యాటర్ అవుటైనా.. థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించడాన్ని ఫ్యాన్స్ తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో డబ్ల్యూపీఎల్‌లో నిబంధనల సవరణపై బీసీసీఐ స్పష్టత ఇచ్చింది. జింగిల్ బెయిల్స్ సరిగా పని చేయడం లేదని గుర్తించిన నేపథ్యంలో.. ఎల్‌ఈడీ లైట్లు వెలిగితే అవుట్‌గా పరిగణించడంలేదని తెలిపింది. రెండు బెయిల్స్ పడిపోతేనే అవుటైనట్టుగా ప్రకటించింది. మ్యాచ్ రోజు ఉదయమే అంపైర్లకు ఈ విషయం తెలిపినా.. జట్లకు మాత్రం మ్యాచ్ తర్వాత వివరించారు.

రవి, దీప్తిపై పతక అంచనాలు

నేటి నుంచి జాతీయ పారా అథ్లెటిక్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పారిస్ పారా ఒలింపియన్లు జీవాంజి దీప్తి (వరంగల్), రొంగలి రవి (అనకాపల్లి) పతక అంచనాలతో బరిలోకి దిగుతున్నారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా మంగళవారం నుంచి జరగనున్న ఈ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి 37 మంది క్రీడాకారులు 48 ఈవెంట్లలో, తెలంగాణ నుంచి 28 మంది క్రీడాకారులు 50 ఈవెంట్లలో పోటీ పడుతున్నారు. మూడ్రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 1,476 మంది పారా అథ్లెట్లు 155 ఈవెంట్లలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సన్నద్ధమయ్యారు.

హార్దిక్ మూడేళ్లు మ్యాగీ తిని బతికాడు!



న్యూఢిల్లీ: పేద కుటుంబం నుంచి వచ్చిన హార్దిక్ పాండ్యా..ప్రస్తుతం భారత క్రికెట్ జట్టులో అంతర్భాగం. తొలినాళ్లలో అతడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈ విషయాన్ని ప్రస్తుతం హార్దిక్ కెప్టెన్‌గా ఉన్న ఐపీఎల్ ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్ యజమానురాలు నీతా అంబానీ ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నారు. 'ప్రతిభ కలిగిన క్రికెటర్లను వెలికి తీసే మా బృందం పదేళ్ల కిందట హార్దిక్, క్రునాల్ పాండ్యా సోదరులను నా వద్దకు తీసుకొచ్చింది. వారితో మాట్లాడాను. డబ్బు లేకపోవడం వల్ల తాము మూడేళ్లుగా మ్యాగీ మాత్రమే తిని జీవించామని హార్దిక్ అప్పట్లో నాకు చెప్పాడు' అని ఆమె వెల్లడించారు. ఇక తమ జట్టు స్టార్ పేసర్ బుమ్రా గురించి చెబుతూ 'ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్ బౌలింగ్ యాక్షన్ ఉన్న కుర్రాడిని మా బృందం తీసుకొచ్చింది. అతడు నెట్స్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు చూస్తే..బంతితో మాట్లాడుతున్నాడనిపించేది. ఆ బౌలరే ఇప్పుడు ప్రపంచం గర్వించదగ్గ పేసరయ్యాడు' అని నీతా వివరించారు.

ప్రతిభకేదీ గుర్తింపు?

అంతర్జాతీయ అథ్లెట్ యర్రాజి జ్యోతి ఆవేదన

ఒలింపిక్స్, ఆసియా క్రీడలు..రెండింటిలోనూ పాల్గొన్న తొలి తెలుగు ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ ఆమె. విశాఖ ఎక్స్‌ప్రెస్‌గా దేశం మొత్తం గుర్తింపు తెచ్చుకున్న ఆ తెలుగమ్మాయికి స్వరాష్ట్రంలో మాత్రం చిన్నచూపే. ఆసియా క్రీడలు మొదలు జాతీయ క్రీడల వరకు ఎన్ని పతకాలు, రికార్డులు సాధించినా సరైన గుర్తింపు లభించక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది. రైల్వేలో వచ్చే చాలీచాలని జీతం, వయసు మీద పడిన తల్లిదండ్రుల బాధ్యత, రెండు గదుల ఇరుకైన ఇంట్లో కనీసం పడుకోడానికి చోటు కూడా లేకుండా ఇబ్బందులు పడుతున్న భారత స్టార్ అథ్లెట్ యర్రాజి జ్యోతి కష్టాలు ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.



'విశాఖపట్నంలోని కైలాసపురం, మధుసూదన్ నగర్‌లో రెండు గదుల ఇరుకైన ఇంట్లో మేము నివాసముంటున్నాం. ఇంట్లోని సామాన్ల మధ్యే ఐదుగురం రెండు గదుల్లో ఇరుక్కొని పడుకుంటాం. నాన్న సూర్యనారాయణ సెక్యూరిటీ గార్డుగా రూ.ఆరు వేల జీతానికి పనిచేస్తాడు. అమ్మ.. కుమారి కొద్ది నెలల కిందటి వరకు నాలుగిళ్లలో పనిచేసేది. ఆమె ఆరోగ్యం బాగుండకపోవడంతో పని మాన్పించాం. అన్నయ్య సురేష్ పోర్టులో చిన్న ఉద్యోగం. పడుకోవడానికి తగినంత చోటు లేక అన్నయ్య ఎక్కువ నైట్ డ్యూటీలకు వెళ్తుంటాడు. నేను ప్రస్తుతం రైల్వేస్‌లో జూనియర్ క్లర్క్‌గా రూ.25 వేలకు ఉద్యోగం చేస్తున్నా. నాన్న, అన్నయ్య సంపాదనతో ఇల్లు గడుస్తోంది. నాకొచ్చే జీతం నా శిక్షణ ఖర్చులకు కూడా సరిపోవు. ఇంతటి దయనీయ పరిస్థితుల్లో ఉన్న మమ్మల్ని పట్టించుకునేవారే కరవయ్యారు'

క్రికెటర్ల కంటే ఏం తక్కువ..

క్రికెట్‌కు, క్రికెటర్లకు భారీస్థాయిలో పురస్కారాలు, నజరానాలు ఇస్తున్నారు. కానీ నాలాంటి అథ్లెట్లపై ఎందుకింత వివక్ష చూపుతున్నారో అర్థం కావడం లేదు. ప్రపంచంలో ఒలింపిక్స్ కంటే ప్రతిష్ఠాత్మకమైన క్రీడా పోటీలు ఏం ఉంటాయి? అలాంటి ఒలింపిక్స్‌లో నేను గత ఏడాది గాయాన్ని కూడా లెక్క చేయకుండా పాల్గొన్నా. ఆసియా క్రీడల్లో (2022) 100 మీటర్ల హర్డిల్స్‌లో రజతం సాధించిన తొలి భారత, తెలుగు అథ్లెట్‌గా చరిత్ర సృష్టించినా నా కష్టాన్ని గుర్తించినవారు లేరు. ఆసియా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో (2023) 100 మీటర్ల హర్డిల్స్ స్వర్ణం, 200 మీటర్ల హర్డిల్స్ రజత పతకాలు అందించా. ఈ పోటీల్లో స్వర్ణం నెగ్గిన తొలి భారత, తెలుగు అథ్లెట్‌ను కూడా నేనే. వరసగా మూడు జాతీయ క్రీడల్లో పసిడి, రజత పతకాలు కైవసం చేసుకున్నా. ఐదుసార్లు జాతీయ రికార్డులు నెలకొల్పా. ఇన్ని సాధించినా గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నన్ను సరైన రీతిలో గుర్తించలేదు. ఉద్యోగం, ఇంటి స్థలం కోసం ఎన్ని దరఖాస్తులు పెట్టినా అవి బుట్టదాఖలే అవుతున్నాయి.

రాష్ట్రంలో ఒక్క ట్రాక్ లేదు..

అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సింథటిక్ ట్రాక్, దానికి అనుబంధంగా హైఇంటెన్సివ్ ఫిట్‌నెస్ ట్రైనింగ్ చేయడానికి కావాల్సిన వసతులు రాష్ట్రంలో ఎక్కడా లేవు. మరి ఒలింపిక్స్ స్థాయికి రాష్ట్ర క్రీడాకారులు ఎలా ఎదుగుతారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో నాలాంటి ఆసక్తి గల క్రీడాకారులకు పొరుగు రాష్ట్రాలే దిక్కవుతున్నాయి.



ఒలింపిక్స్ ముందు నరకం చూశా..

పారిస్ ఒలింపిక్స్‌కు సరిగ్గా రెండు నెలల ముందు ఎడమ కాలి కండరాల్లో గాయమైంది. సర్జరీ చేస్తే కొన్ని నెలలు పాటు విశ్రాంతి తీసుకోవాలి. ఒలింపిక్స్‌లో పాల్గొనే సువర్ణావకాశం కోల్పోతా. ఎలాగైనా దేశం తరఫున ఆడాలన్న లక్ష్యంతో పీఆర్పీ ఇంజెక్షన్లు తీసుకొని సిద్ధమయ్యా. ఆ సమయంలో నా దగ్గర డబ్బు లేక నరకం చూశా. అంతటి బాధను దిగమింగి ఒలింపిక్స్‌లో పాల్గొన్నా నాకు రాష్ట్రంలో కనీస గౌరవం దక్కలేదు. హరియాణా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న అందరికీ రూ.50 లక్షలు వరకు నగదు బహుమతులు ప్రకటించారు. నన్ను కనీసం ఫోన్ చేసి అభినందించిన వారు లేరు.

సమానంగా చూడండి..

నా విజ్ఞప్తి ఒక్కటే క్రికెటర్లతో పాటు ఇతర క్రీడాకారులను కూడా సమానంగా చూడండి. జూనియర్ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు శిక్షణ నిమిత్తం కోట్ల రూపాయలు ఇస్తున్నారు. సాటి క్రీడాకారిణిగా వారికి సహాయం చేయడాన్ని తప్పుపట్టడం లేదు. అవసరమైన ప్రతి క్రీడాకారుడికీ ఆర్థిక సహకారం అందాల్సిందే. అయితే నాలాంటి పేదింటి క్రీడాకారిణులను కూడా ప్రోత్సహించాలని మాత్రమే కోరుతున్నా. వారిలానే నాకు కూడా ప్రభుత్వ ఉద్యోగం, ఇంటిస్థలం, మెరుగైన శిక్షణకు ఆర్థిక సాయం చేస్తే నాపైన కుటుంబ బాధ్యతల ఒత్తిడి తగ్గి, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటేందుకు అవకాశముంటుంది.

ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి
హైదరాబాద్

రూ. 250తో నెలవారీ 'సిప్'

జననివేశ్ పథకం కింద ప్రారంభం .. ఎస్‌బీఐ ఎంఎఫ్

ముంబై: మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ (ఎస్‌బీఐ ఎంఎఫ్) మరింత సులభతరం చేసింది. తన 'జననివేశ్ సిప్' పథకం కింద మదుపరులు నెలనెలా క్రమానుగత పెట్టుబడుల పథకం (సిప్)లో పెట్టే కనీస పెట్టుబడి పరిమితిని రూ.250కు కుదించింది. సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ సమక్షంలో ఎస్‌బీఐ ఎంఎఫ్ ఈ పథకాన్ని ప్రారంభించింది. ఎస్‌బీఐ యోనో యాప్‌తో పాటు పేటీఎం, జీరోధా, గ్రో వంటి ఫిన్‌టెక్ కంపెనీల ద్వారానూ మదుపరులు ఈ సిప్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు. ఈ సిప్ పెట్టుబడుల కోసం బ్యాంకు ద్వారా చేసే చెల్లింపులను ఎస్‌బీఐ చార్జీల నుంచి మినహాయింపు ఇచ్చింది. సిప్ ద్వారా ఎంఎఫ్ పథకాల్లో తొలిసారిగా మదుపు చేసే మదుపరులు, చిన్న పొదుపరులు, అసంఘటిత రంగంలోని మదుపరులను దృష్టిలో ఉంచుకుని ఈ రూ.250 సిప్ పథకం ప్రారంభించాం' అని ఎస్‌బీఐ ఎంఎఫ్ ఎండీ, సీఈఓ నంద కిశోర్ చెప్పారు. ఆర్థిక అభివృద్ధిలో వినూతనత్వం, సమ్మిళితం కూడా కీలకం. అందులో భాగంగానే ఈ పథకం తీసుకొచ్చాం' అని ఎస్‌బీఐ చైర్మన్ సీ శ్రీనివాసులు శెట్టి తెలిపారు.

భేషైన పథకం :సెబీ చీఫ్

'సిప్' ద్వారా ఎస్‌బీఐ ఎంఎఫ్ పథకాల్లో పెట్టే కనీస పెట్టుబడిని రూ.250కి తగ్గించడంపై కార్యక్రమంలో పాల్గొన్న సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది తన చిరకాల కల అన్నారు. అంతర్జాతీయ మ్యూచువల్ ఫండ్ సంస్థలు గిట్టుబాటు కాదని వదిలేసిన ఈ ప్రతిపాదనను ఎస్‌బీఐ ఎంఎఫ్ ప్రారంభించాడాన్ని ఆమె అభినందించారు.

- 2023తో పోలిస్తే 11 స్థానాలు పైకి..
- ఆర్ఐఎల్ ముందు యాపిల్, మైక్రోసాఫ్ట్ సైతం దిగదుడుపే..
- 'ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్ 2024' విడుదల

ఫ్యూచర్ బెస్ట్ బ్రాండ్లలో

రిలయన్స్‌కు రెండో స్థానం

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద, అత్యంత విలువైన కార్పొరేట్ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మరో ఘనత సాధించింది. 2024 సంవత్సరానికి గాను విడుదల చేసిన 'ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్'లో రిలయన్స్ ప్రపంచంలోని రెండో అత్యుత్తమ బ్రాండ్‌గా నిలిచింది. 2023లో 13వ స్థానంలో ఉన్న రిలయన్స్. ఈసారి ఏకంగా 11 స్థానాలు ఎగబాకి ద్వితీయ ర్యాంక్‌ను దక్కించుకుంది. ఈ విషయంలో అంతర్జాతీయ దిగ్గజ బ్రాండ్లైన యాపిల్, మైక్రోసాఫ్ట్, నైకీ, వాల్ట్ డిస్నీ, నెట్‌ఫ్లిక్స్, ఇంటెల్, టయోటా కంటే ముందుండటం గమనార్హం. ఈ జాబితాలోని ఏకైక భారత బ్రాండ్ రిలయన్సే కావడం మరో విశేషం. కాగా, దక్షిణకొరియా



ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్ ఈసారి ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది.

మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మారుతూనే బ్రాండ్ లక్ష్యం, అనుభవాన్ని సమతుల్యం చేసుకోగలిగే సామర్థ్యం ఆధారంగా ఫ్యూచర్‌బ్రాండ్ కంపెనీల మదింపును చేపట్టింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా పీడబ్ల్యూసీ లిస్ట్ చేసిన ప్రపంచ టాప్-100 కంపెనీలను పరిశీలించి, కంపెనీల ఆర్థిక పనితీరుకు బదులు బ్రాండ్ అనుభవం ఆధారంగా ర్యాంకింగ్‌లు కేటాయించింది. అత్యుత్తమ ఫ్యూచర్ బ్రాండ్లు తమ ప్రధాన గుర్తింపును కాపాడుకుంటూనే మారుతున్న వినియోగదారుల అంచనాలు, సాంకేతిక పురోగతులు, మార్కెట్ స్థితిగతులను చాకచక్యంగా ఒడిసిపట్టుకోగలుగుతాయి. మేమేంటి.. మా మనుగడ ఏంటి అనే అంశాలపై వాటికి స్పష్టమైన అవగాహన ఉందని ఫ్యూచర్ బ్రాండ్ ఇండెక్స్ రిపోర్టు పేర్కొంది.

టీసీఎస్ సిబ్బందికి 4-8% జీతం పెంపు!

ముంబై: దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఈ ఏప్రిల్ నుంచి సిబ్బంది వార్షిక వేతనాన్ని 4-8 శాతం వరకు పెంచనున్నట్లు తెలిసింది. మంచి పనితీరు కనబరిచిన వ్యాపార విభాగాల వారికి అధిక పెంపు లభించనుంది. అయితే, గతంతో పోలిస్తే పెంపు శాతం తగ్గడంపై ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కాగా, ఇన్ఫోసిస్ సైతం ఉద్యోగుల జీతాన్ని 5-8% వరకు పెంచనున్నట్లు తెలియవచ్చింది.

'కిమ్స్' చేతికి సాంగ్లీ హాస్పిటల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కిమ్స్ హాస్పిటల్స్ మహారాష్ట్రలో మరింత పట్టు పెంచుకుంటోంది. ఇందులో భాగంగా సాంగ్లీలోని ఉషాకాల్ అభినవ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (యూఏఐఎంఎస్ హాస్పిటల్)తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ భాస్కర రావు, యూఏఐఎంఎస్ హాస్పిటల్ యజమాని విలింద్ పారిఖ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా యూఏఐఎంఎస్ హాస్పిటల్ కార్యకలాపాలు, నిర్వహణ కిమ్స్ హాస్పిటల్ చేపడుతుంది. కిమ్స్ హాస్పిటల్ ఇప్పటికే మహారాష్ట్రలోని నాసిక్, నాగపూర్‌ల్లో 2 హాస్పిటల్స్ నిర్వహిస్తోంది. వీటికి తోడు థానేలో 300 పడకలతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేస్తోంది.

జెన్ టెక్నాలజీస్ గూటికి రెండు కంపెనీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జెన్ టెక్నాలజీస్ లిమిటెడ్.. అప్లైడ్ రీసెర్చ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఆర్ఐపీఎల్), ఏఆర్ఐ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎల్‌పీఎల్)ను రూ.130 కోట్లకు కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. ఇందులో ఏఆర్ఐపీఎల్‌కు మెరైన్, ఆఫ్‌షోర్, నౌకలు, రేవులు, టెర్మినల్స్, నిర్మాణ రంగం, మైనింగ్ కంపెనీలకు అవసరమైన సిమ్యులేషన్, అసెస్‌మెంట్స్ టూల్స్ అందించడంలో మంచి పట్టుంది. కాగా ఏఎల్‌పీఎల్‌కు సముద్ర, నౌకా రంగానికి అవసరమైన సిమ్యులేషన్, అసెస్‌మెంట్ టూల్స్ అందించడంలో మంచి పట్టుందని జెన్ టెక్నాలజీస్ తెలిపింది.

మార్కెట్లోకి బీవైడీ సీలయన్ 7

న్యూఢిల్లీ: విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీ కంపెనీ బీవైడీ ఇండియా తన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మోడల్ 'సీలయన్ 7'ను సోమవారం మార్కెట్లోకి అధికారికంగా విడుదల చేసింది. ప్రీమియం, పెర్ఫార్మెన్స్ వేరియంట్లలో లభించనున్న ఈ కొత్త కారు ప్రారంభ ధర రూ.48.9 లక్షలు. బీవైడీ ఈ కారును గతనెల 18న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలోనే ఆవిష్కరించి, బుకింగ్ సదుపాయాన్నీ ప్రారంభించింది. గడిచిన నెల రోజుల్లో ఈ కారుకు 1,000కి పైగా బుకింగ్స్ లభించినట్లు బీవైడీ తెలిపింది.

ప్రారంభ ధర రూ.48.9 లక్షలు





ఆడి సరికొత్త ఆర్‌ఎస్ క్యూ8

ధర రూ.2.49 కోట్లు

న్యూఢిల్లీ: ఆడి ఇండియా పూర్తిగా కొత్త హంగులతో తయారుచేసిన ఆర్‌ఎస్ క్యూ8 పెర్ఫార్మెన్స్ ఎస్‌యూవీని విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.49 కోట్లు. దేశంలో ఆడి బ్రాండ్‌ను నిర్మించడమే ఆర్‌ఎస్ క్యూ8 మోడల్ కార్ల ప్రధాన లక్ష్యమని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ ధిల్లాన్ అన్నారు. ఇది అత్యంత శక్తివంతమైన ఆడి ఎస్‌యూవీ అని చెప్పారు. అలాగే భారీ సంఖ్యలో అమ్ముడుపోయే కారు కాదని, ప్రత్యేకతను కోరుకునే వారి కోసం ఉద్దేశించినదని ఆయన తెలిపారు. ఆర్‌ఎస్ మోడల్ కార్లకు దేశంలో స్పందన అద్భుతంగా ఉన్నదంటూ ఆడి ఆర్‌ఎస్ క్యూ8 కార్ల యజమానుల్లో సగం మంది యువ కస్టమర్లేనని బల్బీర్ చెప్పారు.

8 రోజుల తర్వాత లాభాల్లోకి..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో 8 రోజుల వరుస నష్టాలకు ఎట్టకేలకు తెరపడింది. సోమవారం ట్రేడింగ్‌లోనూ ఆరంభం నుంచి నష్టాల్లోనే కొనసాగిన ప్రామాణిక సూచీలు.. ఆఖరి గంటలో కొనుగోళ్లతో స్వల్ప లాభాలను నమోదు చేయగలిగాయి. సెన్సెక్స్ 57.65 పాయింట్ల వృద్ధితో 75,996.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 30.25 పాయింట్ల పెరుగుదలతో 22,959.50 వద్ద ముగిసింది. పరస్పర సుంకాల భారాన్ని తగ్గించుకునే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా, భారత ప్రతినిధులు త్వరలోనే సమావేశం కానున్నారన్న వార్తల నేపథ్యంలో మెటల్, ఫార్మా, ఆర్థిక సేవల రంగ షేర్లలో మదుపరులు కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది.

రూ.400 కోట్లతో కంపెనీల కొనుగోళ్లు

- మాజిల్లానిక్ క్లౌడ్ ఎండీ జోసెఫ్ సుధీర్
- రెండేళ్లలో 3,500 నియామకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఐటీ సేవల సంస్థ మాజిల్లానిక్ క్లౌడ్ భారీ ఎత్తున కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా సుమారు రూ.400 కోట్లతో కంపెనీల కొనుగోళ్లు చేపట్టేందుకు రెడీ అవుతున్నట్లు సంస్థ ఎండీ, గ్లోబల్ సీఈఓ జోసెఫ్ సుధీర్ తుమ్మా సోమవారం నాడిక్కడ తెలిపారు. ఐటీ, డ్రోన్ టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డెవ్‌ఆప్స్, ఈ-సర్వియలెన్స్ వంటి విభాగాల్లో ఈ కొనుగోళ్లు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఏప్రిల్-మే నెల నాటికల్లా అమెరికాలో రూ.200 కోట్లతో ఒక కంపెనీని కొనుగోలు చేయనుండగా జూలై నాటికి మరో రూ.150 కోట్లతో మరో కొనుగోలును చేపట్టనున్నట్లు సుధీర్ తెలిపారు. వీటితో పాటు మిగిలిన మొత్తంతో మరో నాలుగైదు చిన్న కంపెనీలను చేజిక్కించుకోవాలని చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీకి చెందిన అన్ని విభాగాల్లో దాదాపు 1,600 మంది ఉద్యోగులు ఉన్నారని, వచ్చే రెండేళ్లలో కొత్తగా 3,500 నియామకాలు చేపట్టటం ద్వారా మొత్తం ఉద్యోగుల సంఖ్య 5,000కు చేరుకోనుందని సుధీర్ వెల్లడించారు. కాగా కంపెనీ అనుబంధ సంస్థ స్కాన్‌డ్రోన్..ఈ మధ్యనే కార్గోమ్యాక్స్ 200కెహెచ్‌సీ డ్రోన్‌ను ఆవిష్కరించిందని సుధీర్ తెలిపారు. ఈ డ్రోన్ 200 కిలోల వరకు పేలోడ్ సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు.

డిపాజిట్ ఇన్సూరెన్స్ పరిమితి పెంపు?

ముంబై: బ్యాంకు డిపాజిట్ ఇన్సూరెన్స్ పథకం పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల నుంచి మరింత పెంచే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం చురుగ్గా పరిశీలిస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) కార్యదర్శి నాగరాజు ఈ విషయం వెల్లడించారు. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే ఆ విషయాన్ని నోటిపై చేస్తామన్నారు. ముంబై కేంద్రంగా ఉన్న న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్ స్కామ్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా ఆలోచిస్తున్నట్టు భావిస్తున్నారు.

- ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక ప్రకటించిన గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్స్‌లో దేశంలో ప్రీమియర్ బిజినెస్ స్కూల్‌గా ఐఎస్‌బీ తొలి స్థానాన్ని మరోసారి కైవసం చేసుకుంది. అలాగే ప్రపంచంలో తన ర్యాంకింగ్‌ను 31 నుంచి 27వ స్థానానికి పెంచుకుంది. ఆసియాలో 5వ స్థానాన్ని నిలబెట్టుకుంది.
- ప్యాకేజింగ్ సేవలు అందించే అమెరికా సంస్థ సొనోకో ప్రొడక్ట్స్ హైదరాబాద్‌లో పెర్‌ఫార్మెన్స్ హబ్ పేరుతో తన గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాన్ని (జీసీసీ) ఏర్పాటు చేసింది. రూ.86 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో 300 మంది టెక్నాలజిస్టులు పని చేయనున్నారు.

జనవరిలో తగ్గిన ఎగుమతులు

న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం జనవరిలో నిరాశావహమైన పనితీరు ప్రదర్శించింది. 2.38 శాతం క్షీణతతో ఎగుమతుల విలువ 3,643 కోట్ల డాలర్లకే (రూ.3.13 లక్షల కోట్లు) పరిమితం అయ్యాయి. పెట్రోలియం ధరల్లో ఆటుపోట్లు, ప్రపంచ అస్థిరతలు ఇందుకు దారి తీశాయి. ఫలితంగా వాణిజ్య లోటు 2,299 కోట్ల డాలర్లకు (రూ.1.89 లక్షల కోట్లు) పరిమితమైంది. దిగుమతులు 10.28 శాతం వృద్ధితో 5,942 కోట్ల డాలర్లుగా (రూ.5.11 లక్షల కోట్లు) నమోదయ్యాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	420
వరంగల్	412	గోదావరి	425
చిత్తూరు	468	విశాఖపట్నం	435
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	91
వరంగల్	80	గుంటూరు	90
కరీంనగర్	80	ఒంగోలు	90
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	75
కర్నూలు	80	నెల్లూరు	80
విశాఖపట్నం	83	అనంతపురం	80
గోదావరి	91		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,620 ▲	79,400 ▲	1,08,000 ▲
విజయవాడ	88,500 ▲	82,500 ▲	98,500 ▲
విశాఖపట్నం	85,140 ▲	78,050 ▲	96,020 ▲
రాజమండ్రి	86,662 ▲	79,400 ▲	98,700 ▼
ప్రొద్దుటూరు	87,650 ▲	81,160 ▲	97,000 ▼
ముంబై	85,254 ▼	78,093 ▼	95,946 ▼

చిత్రజ్యోతి

SINCE 1965

'మదరాసి'గా శివకార్తికేయన్



'అమరన్'తో ఘన విజయాన్ని అందుకున్నారు తమిళ నటుడు శివ కార్తికేయన్. ఆ తర్వాత ఆయన హీరోగా, దర్శకుడు ఏ.ఆర్. మురుగదాస్ కలయికలో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. శ్రీ లక్ష్మీ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ కథానాయిక. సోమవారం శివ కార్తికేయన్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా పేరును 'మదరాసి' అని ప్రకటిస్తూ నిర్మాణ సంస్థ గ్లింప్స్ విడుదల చేసింది. ఇందులో శివ కార్తికేయన్ పూర్తిగా పవర్-ప్యాక్డ్ అవతార్‌లో కనిపించారు. సినిమాలోని ఇతర పాత్రలను కూడా గ్లింప్స్‌లో పరిచయం చేశారు.

సినిమాలకు లాజిక్‌తో పని లేదు

కరణ్ జోహార్



కొన్ని సినిమాలకు లాజిక్‌తో పని లేదని, దర్శకుడు ప్రేక్షకులను నమ్మించగలిగితే ఆ చిత్రం సూపర్ హిట్ అవుతుందని అన్నారు బాలీవుడ్ దర్శకనిర్మాత కరణ్ జోహార్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ సినిమా నచ్చితే లాజిక్‌ను ఎవరూ పట్టించుకోరని, టాలీవుడ్ దర్శకుడు రాజమౌళి తీసే సినిమాల్లో లాజిక్స్ గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటారా? లేదు కదా అని ప్రశ్నించారు. రాజమౌళికి కథపై పూర్తి పట్టు ఉంటుందని, ఆయన ఎలాంటి సన్నివేశాన్నైనా ప్రేక్షకులకు నమ్మకం కలిగేలా తెరకెక్కిస్తారని వివరించారు. యానిమల్, ఆర్ఆర్ఆర్, గదర్... ఈ సినిమాలన్నీ ఇదే ఫార్ములాపై విజయవంతమయ్యాయని కరణ్ జోహార్ చెప్పారు. కాగా, కరణ్ జోహార్ ప్రస్తుతం 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' సినిమా నిర్మిస్తున్నారు. శశాంక్ ఖైతాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వరుణ్ ధావన్, జాన్వీ కపూర్, సన్య మల్హోత్రా, రోహిత్ శరఫ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 18న విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు.

సూర్య సినిమాలో ఛాన్స్?

'మిస్టర్ బచ్చన్'తో తెలుగు ప్రేక్షకులను పలకరించిన బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం రామ్ పోతినేనితో 'రాపో 22' (వర్కింగ్ టైటిల్), దుల్కర్ సల్మాన్‌తో 'కాంత' వంటి వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఆమెకు మరో క్రేజీ ఆఫర్ దక్కినట్టు తెలుస్తోంది. 'లక్కీ భాస్కర్' సినిమాతో సూపర్‌హిట్ కొట్టిన దర్శకుడు వెంకీ అట్లూరి తమిళ కథానాయకుడు సూర్యతో ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌లోకి కథానాయికగా భాగ్యశ్రీని సంప్రదించగా, దానికి ఆమె పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. మే నుంచి ఈ సినిమాను పట్టాలెక్కించడానికి ప్లాన్ చేస్తున్నారు.





ఈ ప్రయాణంలో ఎన్నో జ్ఞాపకాలు


టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ ఇటీవలె తన తల్లి మాధవితో కలసి మహాకుంభమేళాకు వెళ్లిన సంగతి తెలిసిందే. వారిద్దరూ ప్రయాగ్‌రాజ్‌లో పవిత్ర స్నానం చేసిన ఫొటోలు అభిమానులతో పంచుకున్నారు. అనంతరం కాశీనాథుని ఆలయాన్ని కూడా వీరు సందర్శించారు. తాజాగా మహాకుంభమేళాకు చెందిన మరికొన్ని ఫొటోలను విజయ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ సందర్భంగా తన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ పోస్టు పెట్టారు. ఈ ప్రయాణం ఎన్నో జ్ఞాపకాలను అందించిదని పేర్కొన్నారు. విజయ్ దేవరకొండతో పాటు అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి, దర్శకుడు వంశీ పైడిపల్లి, మరికొందరు స్నేహితులు ఉన్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

పెద్ద హిట్ కొట్టబోతున్నాం

సందీప్ కిషన్



సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'మజాకా'. 'మన్మథుడు' ఫేమ్ అన్షు, రావు రమేశ్ కీలక పాత్రలు పోషించారు. త్రినాథరావు దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించారు. ఈ నెల 26న విడుదలవుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన టీజర్,పాటలకు మంచి స్పందన వస్తోంది. తాజాగా, ఈ సినిమాలో 'రావులమ్మ' పాట చిత్రీకరణను లైవ్‌గా చూపించారు. తెలుగులో ఒక సినిమా షూటింగ్‌ను లైవ్‌లో అందించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ "ఈ సినిమాతో పెద్ద హిట్ కొట్టబోతున్నాం. సినిమా కచ్చితంగా అందరికీ విందు భోజనంలా ఉంటుంది" అని చెప్పారు. "మజాకా'లో ఇది సెకండ్ మాస్ సాంగ్ హీరో సందీప్ కిషన్, హీరోయిన్ రీతూ వర్మ ఇరగదీశారు. సాంగ్ అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. ఈ పాటతో థియేటర్లు దద్దరిల్లిపోతాయి. బ్లాక్‌బస్టర్ కొట్టబోతున్నాం" అని దర్శకుడు త్రినాథరావు చెప్పారు. "సినిమా చాలా బాగా వచ్చింది" అని నిర్మాత రాజేశ్ దండా అన్నారు. "ఇది థియేటర్లలో చూసి ఎంజాయ్ చేయాల్సిన సినిమా" అని రీతూ వర్మ అన్నారు.



ప్రతీ కుటుంబం కనెక్ట్ అయ్యే చిత్రం

ధనరాజ్

కామెడీ నటుడు ధనరాజ్ కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. 'అల వైకుంఠపురం', 'పుష్ప' చిత్రాలతో తెలుగు వారికి చేరువైన నటుడు సముద్రఖని కీలక పాత్రలో నటించారు. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వీ పోలవరపు నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు. హీరో ధనరాజ్ మాట్లాడుతూ "ఈ సినిమా ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తుంది. ప్రతీ కుటుంబానికి కనెక్ట్ అయ్యే కథాంశమిది" అని చెప్పారు. నటుడు సముద్రఖని మాట్లాడుతూ "ఇది నాకు చాలా బాగా నచ్చిన కథ. సినిమా విజయంపై నమ్మకముంది. దర్శకుడు చాలా జెన్యూన్‌గా ఈ కథను రాయడంతో పాటు అంతే నిజాయితీగా సినిమాను తెరకెక్కించారు" అని చెప్పారు. చిత్ర నిర్మాత పృథ్వీ మాట్లాడుతూ "ఈ సినిమా ఒక అద్భుతమైన ఎమోషనల్ జర్నీ. ఈ సినిమాతో ధనరాజ్ మరో స్థాయికి చేరుకుంటారు" అని తెలిపారు.

అప్పుడు ఉరి.. ఇప్పుడు ఛావా

- బాలీవుడ్‌కు తొలి బోణి
- మూడు రోజుల్లో రూ. వంద కోట్లు



బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్‌కు రెండు అక్షరాల టైటిల్స్ కలసి వస్తున్నట్లు కనిపిస్తోంది. ఆయన నటించిన తాజా చిత్రం 'ఛావా' అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. ఇంతకుముందు చారిత్రక కథాంశాలతో వచ్చిన 'తానాజీ', 'కేసరి' చిత్రాలకంటే ఈ నెల 14న విడుదలైన 'ఛావా' కలెక్షన్లు భారీ స్థాయిలో ఉండడం దర్శకనిర్మాతల్లో ఉత్సాహాన్ని పెంచింది. అజయ్ దేవగన్, సైఫ్ అలీఖాన్ నటించిన 'తానాజీ' చిత్రం తొలి రోజున కేవలం రూ. 15 కోట్లే వసూలు చేసింది. అలాగే అక్షయ్‌కుమార్, పరిణితి చోప్రా నటించిన 'కేసరి' చిత్రం మొదటి రోజున రూ. 21.06 కోట్లకే పరిమితం కాగా, 'ఛావా' తొలి రోజు రూ. 31 కోట్లు వసూలు చేసి ముందు వరుసలో నిలిచింది.

బాలీవుడ్‌కు కొత్త ఊపిరి

కొత్త సంవత్సరంలో తొలి నెల బాలీవుడ్‌కు అంతగా కలసి రాలేదనే చెప్పాలి. అక్షయ్‌కుమార్ నటించిన 'స్కై-ఫోర్స్', కంగనా రనౌత్ 'ఎమర్జెన్సీ', సోనూ సూద్ నటించిన 'ఫతే' చిత్రాలు పరవాలేదనిపించాయి కానీ 'అబ్బో' అని గొప్పగా చెప్పుకొనేంత విజయాలు అందించలేకపోయాయి. ఆ తర్వాత వచ్చిన మూడు చిత్రాలు 'దేవా', 'లవ్ యాపా', 'ఆజాద్' సినిమాలు కూడా ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయాయి. వరుస అపజయాలతో నిరాశలో మునిగిన బాలీవుడ్‌కు 'ఛావా' చిత్రానికి వస్తున్న వసూళ్లు కొత్త ఊపిరినిచ్చాయి. కొత్త సంవత్సరంలో బిగ్గెస్ట్ ఓపెనర్ ఇదేనని బీటౌన్ వర్గాలు పేర్కొంటున్నాయి. బాలీవుడ్‌లో మొదటి నాలుగు రోజుల వసూళ్లలో అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' చిత్రమే ఇప్పటికి టాప్. 'ఛావా' సినిమా ఆ వసూళ్లను అధిగమించి ముందు వరుసలో నిలిచింది. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ తనయుడు శంభాజీ జీవిత కథ ఆధారంగా రూపుదిద్దుకున్న 'ఛావా' చిత్రంలో విక్కీ శంభాజీ పాత్ర పోషించారు. ఆయన భార్యగా రష్మిక నటించారు. అందరూ ఊహించినట్లుగానే మహారాష్ట్ర సర్క్యూట్‌లో ఈ సినిమా దుమ్ము దులుపుతోంది. రూ. 130 కోట్ల బడ్జెట్‌తో తయారైన ఈ చిత్రం తొలి రెండు రోజుల్లో రూ. 60 కోట్లు వసూలు చేసింది. మూడో రోజుకే రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరి రూ. 108 కోట్లు కలెక్ట్ చేసి సరికొత్త రికార్డ్ నెలకొల్పింది. కలెక్షన్ల ఉధృతి ఇలాగే కొనసాగితే పీరియడ్ డ్రామా చిత్రాల్లో 'ఛావా' హయ్యెస్ట్ గ్రాసర్‌గా నిలిచే అవకాశాలు ఉన్నాయి.

సినిమా మీద మొదటి నుంచి సోషల్ మీడియాలో పాజిటివ్ పబ్లిసిటీ జరగడం, అక్షయ్ ఖన్నా, రష్మిక, అషుతోష్ రాణా, దివ్య దత్తా వంటి స్టార్స్ నటించడం వంటి అంశాలు 'ఛావా' సినిమాకు కలిసొచ్చి ప్రేక్షకులను థియేటర్లకు లాక్కెళ్లాయి. భారీ ఓపెనింగ్స్ తెచ్చి పెట్టాయి.

విక్కీకి ఇది రెండో హయ్యెస్ట్ గ్రాసర్

హీరో విక్కీ నటించిన 'ఉరి.. ద సర్జికల్ స్ట్రైక్' దాదాపు రూ. 240 కోట్లు వసూలు చేసింది. అలియా భట్‌తో కలసి నటించిన 'రాజీ' చిత్రం అటుఇటుగా రూ. 123 కోట్లు వసూలు చేసి ఆయనకి రెండో హయ్యెస్ట్ గ్రాసర్‌గా నిలించింది. కానీ సోమవారం సాయంత్రానికే 'ఛావా' రూ. 124 కోట్లు వసూలు చేసి, 'రాజీ'ని దాటేసి రెండో స్థానంలో నిలిచింది. ఈ వారం 'ఛావా' చిత్రానికి పోటీగా వచ్చే కొత్త సినిమాలు ఏవీ లేకపోవడంతో కలెక్షన్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

రష్మికకు మరో భారీ హిట్

'పుష్ప' చిత్రంతో ఉత్తరాదిలో అలజడి సృష్టించి, ఆలిండియా క్రష్‌గా మారిన రష్మిక ఖాతాలో ఇప్పుడు మరో భారీ హిట్ పడింది. కాలికి గాయమైనప్పటికీ వీల్ ఛైర్‌లో కూర్చుని 'ఛావా' ప్రమోషన్స్‌కు ఆమె హాజరు కావడం కూడా ప్రేక్షకుల్ని కదిలించిందనే చెప్పాలి. శంభాజీ భార్య యేసు బాయిగా సినిమాలో ఆమె పాత్ర పరిధి తక్కువే అయినా ఉన్నంత సేపు బాగా నటించిందనే పేరు రష్మికకు వచ్చింది.



ఆ రోజు మరో రూ.యాభై కోట్లు వచ్చేనా?

బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి. మహారాష్ట్రలో దీన్ని చాలా ఘనంగా జరుపుతారు. శివాజీ తనయుడు శంభాజీ కథతో రూపొందిన చిత్రం 'ఛావా' కనుక ఆ రోజు కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. ఆ ఒక్క రోజే రూ. 50 కోట్లు వసూలు చేస్తే ఇక 'ఛావా'కు తిరుగే లేదు.

కొత్త రేషన్ కార్డులు

ఇంకెప్పుడు?

గొప్పలు చెప్పి.. చేతులెత్తేసిన గత వైసీపీ సర్కార్

- కూటమి ప్రభుత్వంలోనూ తప్పని కాలయాపన
- అదనపు ఆర్థిక భారం లేకుండా కొత్త కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ కసరత్తు
- ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూపులు
- ఇంకా మాజీ సీఎం జగన్ బొమ్మతోనే పాత కార్డులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



కొత్త రేషన్‌కార్డుల కోసం రాష్ట్రంలో వేలాది కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. అర్హులైన వారందరికీ కొత్త కార్డుల జారీని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని గొప్పలు చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం ఆచరణలో చేతులెత్తేసింది. దీంతో జగన్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రవ్యాప్తంగా కొత్త కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. కొత్త కార్డుల కోసం 30,611, స్ప్లిట్ కార్డుల కోసం 46,918, కార్డుల్లో చేర్పులకు 2,13,007, అడ్రస్ మార్పునకు 8,263, తొలగింపునకు 36,588, కార్డులను సరెండర్ చేయడానికి 685 కలిపి మొత్తం 3,36,072 దరఖాస్తులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. గత ఏడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అర్హులకు కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. దీనిపై కసరత్తు చేస్తున్నామని, ప్రతిపాదించిన డిజైన్లు కూడా పరిశీలనలో ఉన్నాయని, త్వరలోనే కొత్త రేషన్‌కార్డులు అందజేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పలుమార్లు ప్రకటించారు. దీంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులతోపాటు కొత్తగా పెళ్లిళ్లు అయిన జంటలు, గత ప్రభుత్వంలో రాజకీయ కారణాలతో కార్డులు కోల్పోయిన వారు తమకు కొత్త రేషన్ కార్డులు వస్తాయని ఎదురుచూస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తుండగా.. ఇక్కడి ప్రభుత్వం అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తుండటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. పైగా అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఇంకా మాజీ సీఎం జగన్, ఆయన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫోటోలతో ఉన్న పాత కార్డులపైనే రేషన్ సరుకులు ఇస్తుండటాన్ని కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. వాటి స్థానంలో రీడిజైన్ చేసిన కొత్త కార్డులనైనా జారీ చేయాలని కోరుతున్నారు.

అదనపు ఆర్థిక భారం లేకుండా 1.5 లక్షల కొత్త కార్డులు జారీచేయొచ్చు..

కొత్త కార్డుల రూపకల్పనకు పలు డిజైన్లు పరిశీలించిన తర్వాత చివరకు లేత పసుపు రంగుతో రూపొందించిన కార్డుపై రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని ముద్రించిన నమూనాను సివిల్ సప్లయిస్ అధికారులు ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదించారు. ఆర్థికంగా అదనపు భారం పడకుండానే కొత్త కార్డులను మంజూరు చేయవచ్చని నివేదించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.48 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిలో 90 లక్షల రేషన్ కార్డులను మాత్రమే కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత చట్టం కింద గుర్తించింది. మిగిలిన కార్డులకు ఇస్తున్న ఉచిత బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార, జొన్నలు, రాగులు తదితర సరుకులపై ఇస్తున్న సబ్సిడీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడకుండా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయొచ్చని నివేదికలో పేర్కొన్నారు. అదెలాగంటే.. రాష్ట్రంలో ప్రస్తుతమున్న మొత్తం రేషన్‌కార్డుల వినియోగంపై కాలానుగుణ సమీక్షలు చేసి.. ఆ సార్టింగ్ డేటా ఆధారంగా ఇప్పటికే రాష్ట్రంలోని 17,941 అంత్యోదయ అన్న యోజన (ఏఏవై), 1,36,420 పీహెచ్‌హెచ్ (ప్రయారిటీ హౌస్ హోల్డ్) కార్డుదారులు గత ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోవడం లేదని గుర్తించారు. ఆ కార్డులను తొలగిస్తే ఏడాదికి రూ.90 కోట్ల వరకు ఆదా అవుతుందని అంచనా వేశారు. తాజాగా గత ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోని కార్డులను కూడా తొలగించి.. వాటి స్థానంలో అర్హులైన వారికి కొత్త కార్డులు మంజూరు చేయవచ్చని పౌరసరఫరాల అధికారులు ప్రతిపాదించారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి అదనపు భారం పడకుండానే రాష్ట్రంలో 1.5 లక్షలకు పైగా పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయవచ్చని ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నారు.



బతుకు బాట...

సరుకులు... కొన్ని దుస్తులు... వంట చెరకు ఇలా అత్యవసరాలన్నీ మూటలు కట్టి ట్రాక్టరులో వేసుకుని పొట్ట చేతబట్టుకుని వలసెల్లిపోతున్నారు వీరంతా. మొత్తం 40 కుటుంబాలకు చెందిన పెద్దలు... పిల్లలు అంతా కలిసి 30 ట్రాక్టర్లలో బయల్దేరారు. ఈ వలస కుటుంబాల ట్రాక్టర్ల ప్రయాణం అన్నమయ్య జిల్లా ములకలచెరువు మీదుగా సోమవారం సాగిపోయింది. మహారాష్ట్రలోని జల్నాకు చెందిన వీరంతా తమ సొంత ప్రాంతానికి 1200 కిలోమీటర్ల దూరంలోని చిత్తూరుకు వలస వస్తున్నారు. స్థానికులు వీరి గురించి ఆరా తీయగా... చిత్తూరు పరిసర ప్రాంతంలోని ఓ కంపెనీలో పని కోసం వెళ్తున్నట్లు వివరించారు.

-ములకలచెరువు, ఆంధ్రజ్యోతి

ఎఫ్ఐఆర్ నమోదుకు ముందే

ప్రాథమిక విచారణ జరపాలా? వద్దా?

- డీఎస్పీ అనుమతి అవసరమా? కాదా?
- మాజీ మంత్రి విడదల రజని పిటిషన్‌పై పోలీసుల తరఫు న్యాయవాదికి హైకోర్టు ప్రశ్నలు
- కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణ పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ మాజీ మంత్రి విడదల రజని, ఆమె పీఏలు దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టులో సోమవారం విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రాసిక్యూషన్‌ను కోర్టు ఆదేశించింది. నేర తీవ్రత ఉన్న(కాగ్నిజబుల్) కేసులలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 173(3) ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందా? లేదా? అని ప్రశ్నించింది. దర్యాప్తుపై డీఎస్పీ నుంచి అనుమతి తీసుకోవడం తప్పనిసరా? నిబంధనలు అనుసరించకుంటే ఎలాంటి పరిణామాలు ఉంటాయి? తదితర వివరాలను కోర్టుకు సమర్పించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదికి సూచించింది. విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. చిలకలూరిపేట నియోజకవర్గం టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పిల్లి కోటి ఫిర్యాదు ఆధారంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ల కింద చిలకలూరిపేట పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ రజని, ఆమె పీఏలు నాగశెట్టి జయఫణీంద్ర, రామకృష్ణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫు న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఘటన జరిగిన ఆరేళ్ల తర్వాత పిటిషనర్లపై కేసు పెట్టారన్నారు. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని సూచించారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ... కాగ్నిజబుల్ కేసులలో ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు డీఎస్పీ నుంచి అనుమతి తీసుకోవడం తప్పనిసరికాదని వివరించారు.

'సెకీ'తో సంకటం!

(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్న పీపీఏలను ఒక్క ఉత్తర్వుతో రద్దు చేశారు. ఏడాది తిరక్కుండానే ఆయనే.. సెకీతో ఏకంగా పాతికేళ్లకు 7,000 మెగావాట్ల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. 2024 సెప్టెంబరులో 3,000 మెగావాట్లు, 2025 సెప్టెంబరులో మరో 3,000 మెగావాట్లు, 2026 సెప్టెంబరులో మిగిలిన 1,000 మెగావాట్లు సరఫరా చేసేందుకు డిస్కంలు, రాష్ట్ర ఇంధన శాఖ, కేంద్రం, సెకీ కలిసి 2021 సెప్టెంబరు 1న ఈ ఒప్పందం చేసుకున్నాయి. అప్పటికే గుజరాత్‌లో సోలార్ విద్యుత్‌ను యూనిట్‌కు రూ.1.99కు విక్రయిస్తుంటే.. జగన్ సర్కారు మాత్రం 50 పైసలు అధికంగా యూనిట్ రూ.2.49కు కొనుగోలు చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అధిక ధర పెట్టడంపై లాజిక్‌లు అడగొద్దని, తక్కువ ధరకే కొంటున్నామని జగన్ అడ్డగోలుగా వాదించారు. అన్నీ కలిపితే యూనిట్‌కు రూ.5.45 వరకు వెళ్తోంది. అంతేగాక రాష్ట్రంలో సౌర విద్యుత్ ప్లాంటు ఏర్పాటుచేయకుండా.. ఎక్కడో రాజస్థాన్ నుంచి కరెంటు సరఫరా చేయాలంటే అదనంగా వీలింగ్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఏమీ ఇవ్వక్కర్లేదని కూడా జగన్ బుకాయించారు. ఈ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ.. నాటి టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ (ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక మంత్రి), సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు వేశారు. ఇంకా తీర్పు రాలేదు. రాజస్థాన్ నుంచి రాష్ట్రానికి 7,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ రావాలంటే.. భారత పవర్ గ్రిడ్ కార్పొరేషన్ లిమిటెడ్ (పీజీసీఈఎల్) ట్రాన్స్‌మిషన్ లైన్లు అందుబాటులోకి తేవాలి. ఇందుకు అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీలు వర్తిస్తాయి. ఆ లైన్ల నిర్మాణం పనులు వచ్చే నెలాఖరుకల్లా పూర్తవుతాయని పీజీసీఈఎల్ చెబుతోంది. అయితే ఈ ఏడాది మే నెల నుంచి కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్సీ) ఆదేశాల మేరకు.. కరెంటు కొన్నా.. కొనకున్నా గ్రిడ్ ఆధారిత చార్జీలు (జీపీఏ) చెల్లించాల్సిందే. జీపీఏ అమల్లోకి వస్తే 25 ఏళ్లకు రూ.65,000 కోట్ల దాకా చెల్లించాల్సి వస్తుంది. కూటమి ప్రభుత్వం ఇంధన రంగంపై విడుదల చేసిన శ్వేతపత్రంలోనూ జీపీఏ చార్జీలపై ఆందోళన వ్యక్తం చేసింది.

ఆ ఒప్పందం లేకున్నా..

సెకీతో ఒప్పందం ఇప్పుడు అమల్లో లేకున్నా.. వ్యవసాయానికి ఉచితంగా ఇవ్వడం సహా అన్ని వర్గాలకు రోజుకు 12,500 మెగావాట్ల దాకా ఇంధన శాఖ సరఫరా చేస్తోంది. ఒకట్రెండు మిలియన్ యూనిట్ల లోటు మినహా.. రాష్ట్రంలో విద్యుత్ సరిపోతోంది. ఇప్పుడు సెకీ నుంచి కొంటే కరెంటు మిగిలిపోతుంది. పైగా సోలార్ కరెంటు పగటిపూట మాత్రమే ఉత్పత్తి అవుతుంది. రాత్రి వేళల్లో పీక్ డిమాండ్‌ను తట్టుకోవాలంటే.. మళ్లీ బహిరంగ మార్కెట్లో కొనుక్కోవడం తప్పదు. అంటే.. సెకీ నుంచి అంత కొంటున్నా.. రాత్రి వేళల్లోని డిమాండ్‌కు ఏ మాత్రం ఉపయోగం లేదు.

మరో హిందూజా కానుందా?

సెకీతో ఒప్పందం మరో హిందూజా ఒప్పందం అవుతుందనే సందేహాలను నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. హిందూజాతో ఒప్పందం కారణంగా.. కరెంటు వాడకుండానే డీమ్డ్ చార్జీల రూపంలో రూ.2,200 కోట్ల దాకా చెల్లించాల్సి వచ్చింది. ఇప్పుడు సెకీ నుంచి కరెంటు కొనక.. ఆ కార్పొరేషన్ కూడా కోర్టుకెక్కితే.. చార్జీల భారం తప్పదని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. బేసిక్ కస్టమ్స్ డ్యూటీ కింద ఏటా రూ.100 కోట్ల వరకు కట్టాల్సి ఉంటుంది.

సెకీ నుంచి లేఖలు..

2,500 మెగావాట్ల సోలార్ విద్యుత్ సమీకరించాం.. సరఫరాకు సిద్ధంగా ఉన్నామంటూ సెకీ గత రెండు నెలలుగా ఆంధ్రప్రదేశ్ పవర్ కోఆర్డినేషన్ కమిటీ(ఏపీసీసీ)కి వరుసగా లేఖలు రాస్తోంది. ఒప్పందంతో జరిగే నష్టాలను తలచుకుని.. ఏమని సమాధానం చెప్పాలో తెలియక ఇంధన శాఖ సతమతమవుతోంది. అమలు చేస్తే.. రూ.లక్ష కోట్లకుపైగా భారం.. రద్దు చేసుకుంటే.. అపరాధ రుసుం కింద రూ.2,900 కోట్లు సెకీకి చెల్లించాలి. దీంతో ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించింది. ఈ ఒప్పందం అమలు చేయాలంటే.. ట్రాన్స్‌మిషన్ (వీలింగ్) చార్జీలను పూర్తిగా మినహాయించాలని కేంద్ర విద్యుత్ శాఖను కోరాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. సీఎంతో చర్చించిన తర్వాత సెకీ లేఖలకు సమాధానం చెప్పాలని భావిస్తోంది.

జనవరిలో రికార్డు ఉష్ణోగ్రతలు

లానినా ఉన్నా కొనసాగిన వేడి.. ఫిబ్రవరిలో కూడా అదే పరిస్థితి

విశాఖపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పసిఫిక్ మహా సముద్రంలో లానినా కొనసాగుతున్నప్పటికీ జనవరిలో ప్రపంచవ్యాప్తంగా వేడి వాతావరణం కొనసాగింది. పారిశ్రామిక విప్లవానికి ముందు నమోదైన సగటు ఉష్ణోగ్రత కంటే 1.75 డిగ్రీలు ఎక్కువగా నమోదైంది. గడచిన 19 నెలల్లో 18 నెలలు.. సగటు ఉష్ణోగ్రత కంటే 1.5 డిగ్రీలు ఎక్కువగా నమోదైనట్టు ప్రపంచ వాతావరణ సంస్థ పేర్కొంది. కోపర్నికస్ క్లైమేట్ ఛేంజ్ సర్వీస్, అమెరికాకు చెందిన నోవా(నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్) చేసిన విశ్లేషణ వివరాలను ప్రపంచ వాతావరణ సంస్థ విడుదల చేసింది. కాగా, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు గత ఏడాది జనవరిలో సాధారణం కంటే ఎక్కువ నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరిలో అదేవిధంగా నమోదయ్యాయి. జనవరిలాగానే ఫిబ్రవరిలో కూడా సగటు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

28న 900 టన్నుల ఎర్రచందనం వేలం

అమరావతి, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ పట్టుకున్న ఎర్రచందనం నిల్వల్లో 905.671 మెట్రిక్ టన్నులు వేలం వేసేందుకు అటవీ అభివృద్ధి సంస్థకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గ్లోబల్ ఈ-టెండర్ ద్వారా ఈనెల 28న తొలి విడత వేలం నిర్వహించనున్నారు. ఆరోజు అమ్ముడుపోని ఎర్రచందనాన్ని మార్చి 6న, తిరిగి 13న వేలం వేయనున్నారు.

కోల్డ్ చైన్ పాలసీ రూపకల్పనకు కమిటీ

రాష్ట్రంలో కోల్డ్ చైన్ పాలసీ రూపకల్పనకు ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ చైర్మన్‌గా, వివిధ శాఖలకు చెందిన 22 మంది ఉన్నతాధికారులను సభ్యులుగా నియమించింది.

మైక్రో ఇరిగేషన్‌కు సబ్సిడీ ఖరారు

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ కింద 2025-26లో రైతులకు ఇచ్చే డ్రిప్, స్ప్రింక్లర్ల సబ్సిడీని ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా డ్రిప్ పరికరాలను ఎస్సీ, ఎస్టీల్లో చిన్న, మధ్యస్థ రైతులకు ఐదెకరాల వరకు 100%, ఇతర చిన్న, మధ్యస్థ రైతులకు 90%, రాయలసీమ, ప్రకాశం జిల్లాల మధ్యస్థ రైతులు, ఐటీడీఏ పరిధిలో 5-10ఎకరాల ఎస్సీ, ఎస్టీ రైతులకు 90%, కోస్తా జిల్లాల్లో 5-10ఎకరాల మధ్యస్థ రైతులకు 70%, పెద్ద రైతులకు 50% సబ్సిడీ ఇవ్వనున్నారు. స్ప్రింక్లర్లపై అన్ని క్యాటగిరీల రైతులకూ 50% సబ్సిడీ ఇవ్వనున్నారు. సబ్సిడీలో 27 నుంచి 33% కేంద్రం, 17 నుంచి 67% రాష్ట్ర ప్రభుత్వం భరించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీవోపీ అప్లికేషన్ల సమర్పణ గడువు పొడిగింపు

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్(సీవోపీ) అప్లికేషన్లు సమర్పించేందుకు మార్చి 15ను తుది గడువుగా ఏపీ బార్ కౌన్సిల్ ప్రకటించింది. కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

గ్రంథాలయాల సంస్థ డైరెక్టర్‌గా కృష్ణమోహన్

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పౌర గ్రంథాలయాల సంస్థ డైరెక్టర్‌గా ఎ.కృష్ణమోహన్‌ను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. బీసీ సంక్షేమ శాఖలో అదనపు డైరెక్టర్‌గా ఉన్న ఆయన్ను ఫారిన్ సర్వీసు ప్రాతిపదికపై పాఠశాల విద్యాశాఖలో నియమించింది.

సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు ఇవ్వాలి

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులకు రావాల్సిన డీఏల బకాయిలను విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ సోమవారం ఓ ప్రకటనలో కోరింది. డీఏ బకాయి 90 శాతం నగదుతో చెల్లించాల్సిన గడువు మార్చి 2025లో ముగుస్తున్నందున వెంటనే డీఏ ఎరియర్స్ చెల్లించాలని ఆర్థికశాఖ అధికారులను సీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పటాన్, తదితరులు కోరారు.

ఒక్క సచివాలయ ఉద్యోగినీ తొలగించం!

అవసరమైతే కొత్తగా నియామకాలు

- ఉద్యోగుల సమస్యలపై సమీక్షించి నిర్ణయం
- ఆయా సంఘాల నేతలతో మంత్రి డోలా



అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక్క గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగినీ తొలగించే ప్రసక్తే లేదని, అవసరమైతే కొత్త ఉద్యోగులను నియమిస్తామని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో ఆయా ఉద్యోగ సంఘాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఇప్పటికే చర్యలు ప్రారంభించామని, ఈ ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియపై ఐదారు సార్లు సమీక్ష నిర్వహించామని, జనాభా ప్రాతిపదికన సచివాలయ ఉద్యోగులను ఏ, బీ, సీ క్యాటగిరీలుగా నియమించాలని నిర్ణయించామని తెలిపారు. హేతుబద్ధీకరణ తర్వాత అవసరమైన ఉద్యోగులను నియమించి, ఏ ఉద్యోగిపై భారం పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సరైన పదోన్నతి విధానాన్ని కూడా సులభతరం చేస్తామన్నారు. ఆలస్యం లేకుండా ప్రజలకు రియల్‌టైంలో సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మరింత పారదర్శకంగా సేవలు అందించేందుకు సచివాలయాల్లో ఏఐ, డ్రోన్ టెక్నాలజీ, ఐవోటీలను అమలు చేస్తామన్నారు. పదోన్నతులు, మిగిలిపోయిన ప్రొబేషన్ డిక్లరేషన్, జీతం స్కేల్, వివరణాత్మక జాబ్‌చార్ట్ అంశాలను ఉద్యోగ సంఘాల నేతలు ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తెచ్చారు. సచివాలయ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వర్తింపచేయాలని, వివిధ క్యాటగిరీల సచివాలయ ఉద్యోగుల పదోన్నతులు, ఇతర సర్వీసు విషయాల్లో స్పష్టత ఇవ్వాలని కోరారు. హేతుబద్ధీకరణ ప్రక్రియలో ఇచ్చిన జీఎంఎస్ నెం.1లోని క్లాజ్ 3లో చెప్పినట్లు మల్టీపర్పస్ కార్యదర్శులు, టెక్నికల్, ఆస్పిరేషనల్ కార్యదర్శులు ఎవరెవరు ఏయే కేటగిరి కిందకు వస్తారో పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. 3,500కు పైగా జనాభా ఉన్న సచివాలయాలకు పని ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున 3,501 జనాభా దాటిన ప్రతి 500 లేదా 1,000 మందికి అదనంగా ఒక ఉద్యోగిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2022లో ఇచ్చిన 11వ పీఆర్సీ ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ నెంబర్ 2లో సచివాలయ ఉద్యోగుల జీత భత్యాలను 2015 పీఆర్సీలోనివి యథాతథంగా ఉంచారని, ఆ తప్పు పునరావృతం కాకుండా రాబోవు 12వ పీఆర్సీలో చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక మంది సచివాలయ ఉద్యోగులు ఒకే సారి ఉద్యోగం పొందిన కారణంగా చాలా మంది ఇప్పటి వరకు సరైన పదోన్నతికి నోచుకోలేదని, అందరినీ వివిధ ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేసి పదోన్నతి కల్పించాలన్నారు. చాలా మంది జీవిత భాగస్వాములు వివిధ జిల్లాల్లో ఉద్యోగాలు చేయడం వల్ల కుటుంబపరంగా ఇబ్బందులు పడుతున్నారని, మ్యూచువల్, భాగస్వామ్య బదిలీలు వెంటనే చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో 39 గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సచివాలయ ఉద్యోగుల సమస్యలు, పని పరిస్థితులకు సంబంధించి కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నతాధికారులతో సమీక్షించి, సర్వీసు రూల్స్ పరిగణనలోకి తీసుకుని సచివాలయ ఉద్యోగులు పేర్కొన్న సమస్యలపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై ఉద్యోగ సంఘాలు విశ్వాసం వ్యక్తం చేశాయి. ఈ సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, డైరెక్టర్ శివప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు మరో ఐదు సంస్థలు సిద్ధం

- టెక్స్‌టైల్ పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి
- 2 వేల కోట్ల పెట్టుబడికి సుముఖత
- త్వరలోనే ప్రభుత్వంతో ఎంవోయూలు
- చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడి
- ఢిల్లీలోని భారత్ టెక్స్‌లో ఏపీ స్టాల్ సందర్శన
- పలువురు పెట్టుబడిదారులతో భేటీ



ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ టెక్స్‌టైల్ సదస్సులో మంత్రి సవితతో ప్రతినిధులు

అమరావతి/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో టెక్స్‌టైల్‌రంగంలో పరిశ్రమల స్థాపనకు ఐదు సంస్థలు ముందుకొచ్చాయని, ఆ సంస్థలు రూ. 2 వేల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయని చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. ఢిల్లీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ భారత్ టెక్స్-2025లో మంత్రి సోమవారం పాల్గొన్నారు. ఎగ్జిబిషన్‌లో ఏపీ స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు దేశ, విదేశీ పెట్టుబడిదారులతో మంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో పరిశ్రమల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యల గురించి, చేనేత రంగంలో అవకాశాలు గురించి వివరించారు. పలు సంస్థల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చలు జరిపారు. అడ్వాన్స్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్, ఐటీఎంఎఫ్, మాస్కో చాంబర్స్ ఆఫ్ కామర్స్ సహా మరో రెండు సంస్థల ప్రతినిధులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి సుముఖత వ్యక్తం చేశారు. త్వరలోనే పెట్టుబడులపై ఏపీ ప్రభుత్వంతో ఎంవోయూలు చేసుకోవడానికి రాష్ట్రానికి రానున్నట్లు ఆ సంస్థల ప్రతినిధులు తెలిపారు. కర్ణాటకకు చెందిన ప్రతినిధులు ఎమ్మిగనూరు టెక్స్‌టైల్ పార్క్‌లో పెట్టుబడులకు ఆసక్తి చూపినట్లు మంత్రి వెల్లడించారు. రష్యాలో టెక్స్‌టైల్ వేర్‌హౌస్ ఏర్పాటుకు ఏపీకి చెందిన గుంటూరు టెక్స్‌టైల్ పార్క్ అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు.

నేతన్నలకు ఉపాధికి సీఎం కృషి

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో చేనేత రంగం కుదేలైందని మంత్రి సవిత అన్నారు. ఢిల్లీలోని ఏపీభవన్‌లో మీడియాతో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో చేనేతలకు ఉపాధి కల్పించేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి దార్శనిక నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ఏపీలో టెక్స్‌టైల్ పరిశ్రమల స్థాపనకు ఐదుగురు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారని, మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకు త్వరలో పారిశ్రామికవేత్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హిందూపూర్ నియోజకవర్గంలో 2 వేల మందికి ఉపాధికల్పించేలా రూ. 500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఓ పారిశ్రామికవేత్త సంసిద్ధత వ్యక్తం చేశారని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా

పారిశ్రామికవేత్తలకు

అదనపు రాయితీ

- మూలధన వ్యయం, విద్యుత్తు, భూమి ధరల్లో భారీగా రాయితీలు పెంపు
- పారిశ్రామిక విధానానికి సవరణలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారితోపాటు, విభిన్న ప్రతిభావంతులైన మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు రాయితీలు ప్రకటించింది. ప్రధానంగా మూలధన వ్యయం, విద్యుత్తు, భూముల ధరల్లో రాయితీలను భారీగా పెంచుతూ సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. అయితే, రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు నెలకొల్పే మహిళలకు మాత్రమే ఈ ప్రత్యేక రాయితీలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. 2029-2030 నాటికి రాష్ట్రంలో ప్రతి కుటుంబం నుంచి ఒకరిని పారిశ్రామికవేత్త(ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త)గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇప్పటికే ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) అభివృద్ధి పాలసీ-4.0ని ప్రకటించింది. దీనిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల మధ్య పోటీతత్వాన్ని పెంపొందించి, రాష్ట్రంలో పెద్దఎత్తున చిన్న పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రోత్సాహకాల ప్యాకేజీలను తెచ్చింది. అయితే, ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల నిర్వహణ వ్యయ భారాన్ని తగ్గించేందుకు ఇంకా మెరుగైన ప్రోత్సాహకాలు అందించాలని దళిత పారిశ్రామికవేత్తలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పరిశ్రమల సంఘాలు, పలువురు ఎమ్మెల్యేలు లేఖలు రాయడంతో సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. సీఎం ఆదేశాల మేరకు పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఆయా వర్గాలతో విస్తృతస్థాయిలో చర్చలు జరిపి ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల ప్రయోజనం కోసం పాలసీలో చేయాల్సిన సవరణలపై ప్రభుత్వానికి సిఫారసులు చేశారు.

సవరణలు ఇవీ..


- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, మహిళా పారిశ్రామికవేత్తలకు ఇప్పటి వరకు 35 శాతంగా ఉన్న పెట్టుబడి రాయితీని 45 శాతానికి పెంచారు.
- ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారు ఎక్కువగా రవాణా సేవలపై మొగ్గు చూపుతుండటంతో ఆయా వర్గాలకు రవాణా, లాజిస్టిక్స్‌పై కూడా 45 శాతం రాయితీని వర్తింపజేస్తారు.
- విద్యుత్తు రాయితీని యూనిట్‌కు రూ.1.50 చొప్పున ఐదేళ్లపాటు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- రాష్ట్ర జీఎస్టీ రీయింబర్స్‌మెంట్‌ను కూడా ఐదేళ్లపాటు ఇవ్వాలని నిర్ణయించింది. టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ వ్యయాన్ని 40 శాతానికి పెంచారు.
- పరిశ్రమలకు కేటాయించే భూమి విలువపై 50 శాతం రాయితీ ఉండేది. ఇప్పుడు ఇండస్ట్రియల్ పార్కులలో భూములు పొందే ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 75 శాతం రాయితీని కల్పిస్తారు.
- ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలో కూడా సవరణలు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలను ప్రకటిస్తూ ప్రభుత్వం మరో జీవో విడుదల చేసింది.

ఒక్కటిగా ఉంటేనే అందరికీ భద్రత: సావంత్



దేశంలో సంస్కృతులు, వేషభాషలు వేర్వేరైనా ఆలయాల సంస్కృతి ద్వారానే ప్రజలంతా కలసి ఉంటున్నారని, అందరం ఒక్కటిగా ఉంటేనే భద్రంగా ఉంటామని గోవా సీఎం సావంత్ తన ప్రసంగంలో తెలిపారు. 'దేశంలో తరతరాలుగా రాజులు, చక్రవర్తులందరూ దేవుడిని నమ్మి, ధర్మాన్ని పాటించారు. అందుకే ఇప్పటికీ సనాతన ధర్మం కొనసాగుతోంది' అని చెప్పారు. ఆయన కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

దేవాలయాలు భారతీయ సామాజిక కేంద్రాలు: మోహన్ భగవత్



వారాణసీలో జరిగిన తొలి సమావేశం తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆలయాలను ఏకం చేయడంలో టెంపుల్ కనెక్ట్ కృషిని ప్రశంసిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యనేత మోహన్ భగవత్ వర్చువల్ ద్వారా తన సందేశాన్ని పంచుకున్నారు. 'పూర్వకాలంలో దేవాలయాలు భారతీయ సామాజిక కేంద్రాలుగా ఉండేవి. నేడు కూడా వాటి పట్ల అపరిమితమైన విశ్వాసం ఉంది.' అని పేర్కొన్నారు.

చిన్న ఆలయాలకు టీటీడీ చేయూత: ముకుంద్



కలియుగంలో ముక్తి మార్గంలో నడవడానికి భక్తి అన్నిటికంటే గొప్పదని ఆర్‌ఎస్‌ఎస్ నేత ముకుంద్ అన్నారు. తొలిసారిగా మన మందిరాలు, శక్తిపీఠాలను వ్యవస్థీకృత పద్ధతిలో శుద్ధి చేయడానికి టెంపుల్ కనెక్ట్ ముందుకొచ్చిందన్నారు. భక్తి విశ్వాసాలను సజీవంగా ఉంచడానికి టీటీడీ వంటి పెద్ద ఆలయాలు సహాయపడుతున్నాయన్నారు. కర్ణాటకలోని పలు ఆలయాలు కూడా ఆ దిశగా నడుస్తున్నాయని చెప్పారు.

సామాజిక సంక్షేమానికి నాంది: ప్రసాద్ లాడ్



ఎక్స్‌పో చైర్మన్, మహారాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్ ప్రసాద్ లాడ్ మాట్లాడుతూ.. సనాతన ధర్మానికి ప్రతీకలైన దేవాలయ ఆర్థిక వ్యవస్థను అనుసంధానం చేయడం ద్వారా సామాజిక సంక్షేమానికి గణనీయమైన సహకారం అందించవచ్చని చెప్పారు. 2047 నాటికి స్వావలంబన దేశంగా మార్చేక్రమంలో ఆలయాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆలయపాలనకు అంకితమైన తొలి అంతర్జాతీయ వేదికగా ఇది నిలుస్తుందన్నారు.

ఆధ్యాత్మిక పర్యాటకానికి అంతర్జాతీయ కేంద్రం: గిరేష్ కులకర్ణి



టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్ కులకర్ణి మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక పర్యాటకానికి భారత్ అంతర్జాతీయ కేంద్రంగా ఉద్భవించిందన్నారు. ఈ క్రమంలో ఆలయ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, మరింత శక్తిమంతమైన కేంద్రాలుగా మార్చడం కోసం ఐసీటీఎక్స్ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

తిరుమల భక్తులు అమరావతికీ వస్తారు!

అమరావతి అన్న పేరుకు అర్థం దేవతల రాజధాని అంటూ అలాంటి అమరావతిని రాష్ట్ర రాజధానిగా నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. పవిత్రంగా, ఎంతో పరిశుభ్రంగా, అన్ని అధునాతన సదుపాయాలతో నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈరోజు చెబుతున్నా.. ఏదో ఒక రోజు తిరుమలకు వచ్చే యాత్రికులు తదుపరి అమరావతినీ చూసేందుకు వచ్చే రోజు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



ఆలయాల సదస్సులో పాల్గొన్న సీఎం చంద్రబాబు, పక్కన గోవా, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు ప్రమోద్ సావంత్, దేవేంద్ర ఫడణవీస్

ఆలయాలకు ఆగమ స్వేచ్ఛ!

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం తిరుపతి ఆశా కన్వెన్షన్‌లో అంతర్జాతీయ ఆలయాల సదస్సు-ప్రదర్శన (ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో-ఐటీసీఎక్స్-2025) ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూడు రోజులు జరిగే ఈ సదస్సుకు రాష్ట్రప్రభుత్వం ఆతిథ్యం ఇస్తోంది. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర, గోవా ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడణవీస్, ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రి శ్రీపాద యశోనాయక్ కూడా హాజరయ్యారు. దేశానికి సరైన సమయంలో నరేంద్ర మోదీ వంటి నాయకుడు లభించాడని, వికసిత్ భారత్ లక్ష్యంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రధాని కృషి చేస్తున్నారని చంద్రబాబు ఈ సందర్భంగా ప్రశంసించారు. రాష్ట్రంలో ఆలయాలకు స్వతంత్ర ప్రతిపత్తి ఇస్తామని.. ముఖ్యంగా వైదిక, ఆగమ వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం ఉండదని సీఎం స్పష్టం చేశారు. గుళ్ల రక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని.. ఇటీవలే దేవదాయ శాఖ చట్టాన్ని సవరించామని తెలిపారు. అర్చకుల పారితోషికాలు పెంచామని గుర్తు చేశారు. 'గత ఏడెనిమిది నెలల్లో ఆలయాల అభివృద్ధికి రూ.138 కోట్లు ఖర్చు చేశాం. వేద విద్య అభ్యసించిన వారికి ఆలయాల్లో పని దొరికేదాకా నెలవారీ భృతి ఇస్తున్నాం. ప్రతి ఆలయ ట్రస్టు బోర్డులో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులు సభ్యులుగా ఉండేలా చట్టం తెచ్చాం. అన్ని గుళ్లలో ఐవీఆర్ఎస్ ద్వారా భక్తుల అభిప్రాయాలు సేకరిస్తున్నాం. క్యూఆర్ కోడ్‌తో ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నాం. ఏఐ, సీసీ కెమెరాలు, డ్రోన్ పెట్రోలింగ్ వంటివి చేస్తున్నాం' అని చెప్పారు. ఐటీసీఎక్స్-2025 ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ, సిక్కు, బౌద్ధ, జైన ఆలయాల ట్రస్టులను ఏకం చేస్తోందన్నారు. ఆలయాల ఉత్తమ నిర్వహణ, భద్రత, పారదర్శక ఆర్థిక వ్యవస్థల కోసం కృషి చేస్తోందని చెప్పారు. ఆలయాల యాజమాన్యాలను ఒకే వేదికపైకి తెచ్చి ఆలయాల అభివృద్ధితో పాటు భక్తుల సంక్షేమానికి చర్యలు తీసుకునే లక్ష్యంతో ముందుకు రావడం సంతోషకరమని చెప్పారు. 'వారాణసీలో తొలి సదస్సు నిర్వహించిన ఐటీసీఎక్స్ రెండో సదస్సును సరైన సమయంలో తిరుపతిలో నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 1,500కు పైగా ఆలయాల కమిటీలు కలుస్తుండడం గొప్ప విషయం. వర్చువల్‌గా కూడా ఎంతోమంది ప్రముఖులు పాల్గొంటున్నారు. ప్రత్యక్షంగా 111 మంది వక్తలు పాల్గొని ఆలయాల నిర్వహణపై దిశానిర్దేశం చేస్తుండడం ప్రశంసనీయం. 15 వర్క్‌షాపులతో పాటు 60కి పైగా వివిధ స్టాల్స్ ఏర్పాటు ఆలయాల సక్రమ నిర్వహణకు ఉపకరిస్తాయి' అని చెప్పారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

> ఆలయాలన్నీ హరిత ఇంధనం వినియోగించాలి. సామాజిక సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి. టెక్నాలజీ సాయంతో స్వయంసమృద్ధి దిశగా పయనించాలి.
> \- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆలయాల ఎకానమీ రూ.6 లక్షల కోట్లు!

ఆలయాలన్నీ భారతీయ సంస్కృతి, వారసత్వంతో ముడిపడి ఉన్నాయి. వాటిని అందరం కాపాడుకోవాలి. దేశంలో ఆలయాలు రూ. 6 లక్షల కోట్లతో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించాయి. 1985-86లో నాటి సీఎం ఎన్టీఆర్ తిరుమలలో ప్రారంభించిన అన్నదాన పథకం ట్రస్టుకు ఇప్పుడు రూ.3 వేల కోట్ల కార్పస్ ఫండ్ చేకూరింది. నేను గతంలో టీటీడీ ద్వారా శ్రీవారి ప్రాణదాన ట్రస్టును ప్రారంభించగా.. ప్రస్తుతం దానికి రూ.440 కోట్ల విరాళాలు సమకూరాయి.

అట్టహాసంగా ప్రారంభం.. తిరుపతిలో ఐటీసీఎక్స్-2025 పేరిట ఆలయ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. టెంపుల్ కనెక్ట్ సంస్థ అతిరథ మహారథులు, ఆధ్యాత్మిక గురువులు, ఆలయ ట్రస్టీలు, అధికారులను ఒక చోటకు చేర్చింది. ప్రధాని మోదీ లేఖ ద్వారా తన సందేశాన్ని అందించగా.. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్ వర్చువల్‌గా పాల్గొన్నారు. సమావేశంలో ఆధ్యాత్మికవేత్త ఆచార్యగోవింద్ దేవ్ గురూజీ, ఆర్‌ఎస్‌ఎస్ సంయుక్త కార్యదర్శి ముకుంద్, మంత్రి అనగాని సత్యప్రసాద్, మహారాష్ట్ర మంత్రులు ఆశిష్ షెలార్, మేఘన బోర్డిక్కర్, గోవా మంత్రి విశ్వజిత్ రాణే, ఎంపీ ప్రవీణ్ దార్కేర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అంత్యోదయ ప్రతిష్ఠాన్ చైర్‌పర్సన్ సీతాలాడ్ పాల్గొన్నారు. మంగళవారం విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ మాజీ చైర్మన్ సురేశ్ హావారే, గోవా పర్యాటక మంత్రి రోహన్, ఇస్కాన్ కమ్యునికేషన్స్ డైరెక్టర్ గోవిందాదాస్ తదితరులు పాల్గొంటారు.

అవినీతిపరులకు ఈ జన్మలోనే శిక్ష

అవినీతికి పాల్పడితే వచ్చే జన్మలో కాదు.. ఈ జన్మలోనే వేంకటేశ్వరస్వామి శిక్షిస్తాడని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 27 వేల ఆలయాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. దేశంలోనే అత్యధికంగా రాష్ట్రానికి ఏటా 21 కోట్ల మంది పర్యాటకులు వస్తున్నారన్నారు. ఆలయాల ఉత్తమ నిర్వహణతోనే ఇది సాధ్యమైందని చెప్పారు.

వసుధైక కుటుంబానికి స్ఫూర్తి

'ఆలయాల సదస్సు' సందర్భంగా ప్రధాని మోదీ సందేశం

శ్రీవారిని దర్శించుకున్న మహారాష్ట్ర, గోవా సీఎంలు

భారతీయ జీవన విధానమే సనాతన ధర్మమన్న ఫడణవీస్

తిరుపతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సోమవారం ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో (ఐటీసీఎక్స్-2025) పేరిట ప్రారంభమైన ఆలయ సదస్సును వసుధైక కుటుంబ స్ఫూర్తికి చిహ్నంగా ప్రధాని మోదీ ప్రశంసించారు. దేవాలయాల మహాకుంభ్ గురించి మోదీ లేఖ ద్వారా తన ఆలోచనలను పంచుకున్నారు. హిందూ, జైన, బౌద్ధ, సిక్కు మతాలకు సంబంధించి విభిన్న నేపథ్యాల నుంచి వేలాదిమంది ఆలయ ధర్మకర్తలు, నిర్వాహకులను ఒక్కచోట చేర్చే అద్భుతమైన వేదికగా నిలిచిందని ప్రధాని కితాబిచ్చారు. ఆలయ నిర్వహణలో కీలక సవాళ్లను ఎదుర్కోవడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. కాగా, భారతీయ జీవన విధానమే సనాతన ధర్మమని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. ఐటీసీఎక్స్-2025 సదస్సులో, అంతకుముందు తిరుమలేశుడిని దర్శించుకున్నాక ఆయన మీడియాతో మాట్లాడారు. 'దేశ ప్రజలు తమను తాము సనాతన సంస్కృతికి చెందిన వారమని గర్వంగా చెప్పుకొంటున్నారు. ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్‌లో ఇప్పటికే 50 కోట్ల మందికి పైగా పుణ్య స్నానాలు చేశారు. ఈ సంఖ్య ఐరోపా మొత్తం జనాభా కంటే ఎక్కువ. మహాకుంభ్‌లో ఎవరూ వారి భాష, సంస్కృతి, ప్రాంతం, మతం, కులం గురించి అడగడం లేదు. తరతరాల జీవన విధానమే సనాతన ధర్మం. అందుకే దానినెవరూ నాశనం చేయలేకపోయారు. అది శాశ్వతంగా ఉంటుంది. సనాతన ఆలోచనా సరళితో ఉన్న ఆలయాలన్నింటినీ ఒకవేదిక మీదకు తెచ్చిన ఈ సదస్సు.. రానున్న కాలంలో వాటికి కొత్త మార్గం చూపుతుంది' అని ఆకాంక్షించారు.

ఇంటి భోజనం అనుమతించండి

- జైలు గదిలో మంచం ఇప్పించండి
- కోర్టును అభ్యర్థించిన వల్లభనేని వంశీ
- వంశీని కస్టడీకి ఇవ్వాలన్న పోలీసులు



విజయవాడ, అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ జిల్లా జైలులో ఉన్న తనకు ఇంటి భోజనాన్ని అనుమతించాలని గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కోర్టును కోరారు. జైలులో తనకు కొన్ని సదుపాయాలు కావాలని కోరుతూ విజయవాడలోని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో పలు అంశాలను ఆయన తరపున న్యాయవాది పేర్కొన్నారు. వంశీ వెన్నునొప్పితో బాధపడుతున్నారని, ఆయనకు నిద్రపోవడానికి మంచం ఏర్పాటు చేయించాలని కోరారు. అదే విధంగా ఆరోగ్య కారణాల రీత్యా ఇంటి నుంచి భోజనాన్ని అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు బెయిల్ మంజూరు చేయాలని మరోపిటిషన్ దాఖలు చేశారు. కాగా, గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడికి ప్రత్యక్ష సాక్షి, ప్రధాన ఫిర్యాదుదారు సత్యవర్ధన్‌ను బెదిరించి, కిడ్నాప్ చేసిన కేసులో వల్లభనేని వంశీని పది రోజుల కస్టడీకి ఇవ్వాలని పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణను ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి హిమబిందు మంగళవారానికి వాయిదా వేశారు.

ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు వంశీ

రియల్ ఎస్టేట్ వ్యాపారి, గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేని వెంకటపాండురంగారావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2024 జనవరి 21న గన్నవరం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పాండురంగారావుపై జరిగిన దాడి ఘటనతో తనకు సంబంధం లేదన్నారు. రాజకీయ కారణాలతో తనను ఈ కేసులో నిందితుడిగా చేర్చే అవకాశం ఉందన్నారు. అందువల్ల ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. కాగా, గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మరో ముగ్గురు లొంగిపోయారు. ఆ కేసులో ఉన్న ఏ-47 షేక్ ఎంఎం కలాం, ఏ-55 షేక్ సర్దార్ జానీ, ఏ-68 రాచేటి రూతుమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో సరెండర్ అయ్యారు.

రెండు గంటలు.. ఏకాంతంగా..

- న్యాయాధికారి సమక్షంలోసత్యవర్ధన్ వాంగ్మూలం

విజయవాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కేసులో బాధితుడు ముదునూరి సత్యవర్ధన్ వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసింది. అందరినీ బయటకు పంపి ఏకాంతంగా... రెండు గంటల పాటు విజయవాడ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయాధికారి అప్పారావు ఆయన వాంగ్మూలం నమోదుచేశారు. సీఆర్పీసీ 164 ప్రకారం ఈ ప్రక్రియను పూర్తిచేశారు. పోలీసులు సత్యవర్ధన్‌ను కోర్టుకు తీసుకువచ్చారు. మధ్యాహ్నం తర్వాత ఆయనను న్యాయాధికారి పిలిచారు. తన వద్ద కూర్చోబెట్టుకుని సత్యవర్ధన్ చెప్పిన వివరాలను నమోదు చేసుకున్నారు.

మహా కుంభమేళాలో లోకేశ్ దంపతులు

- కుమారుడితో కలసి త్రివేణి సంగమంలో పుణ్యస్నానం
- కాశీ విశ్వేశ్వరుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు
- విశాలాక్షి అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ
- కాలభైరవ ఆలయాన్ని దర్శించి పూజలు



వారాణసీలోని కాలభైరవ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి లోకేశ్ దంపతులు

న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ దంపతులు తమ కుమారుడితో కలిసి పాల్గొన్నారు. సోమవారం ఉదయం ప్రయాగ్‌రాజ్ చేరుకున్న లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్.. త్రివేణి సంగమం షాహి స్నానఘట్టంలో పుణ్యస్నానం ఆచరించారు. గంగాదేవికి పూజలు చేసి హారతులు ఇచ్చారు. పెద్దలను స్మరించుకుంటూ బ్రాహ్మణులకు వస్త్రదానం చేశారు. మహా కుంభమేళా ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదని, ఇది భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వమని లోకేశ్ పేర్కొన్నారు. నమ్మకం, ఆచారాలు, ఆధ్యాత్మిక జ్ఞానంతో ముడిపడి ఉన్న శక్తివంతమైన వేడుకని అని అన్నారు. లోకేశ్ దంపతులు వారాణసీ వెళ్లి జ్యోతిర్లింగాలలో ప్రసిద్ధిగాంచిన కాశీ విశ్వేశ్వరుడి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన కాశీ విశాలాక్షి ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారాణసీలో పురాతన ఆలయాల్లో ఒకటైన కాలభైరవ ఆలయాన్ని కూడా దర్శించుకున్నారు.

కుంభమేళాలో ప్రముఖులు

మహా కుంభమేళాలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, నరసరావుపేట ఎంపీ కృష్ణదేవరాయలు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ దంపతులు, కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కుటుంబ సభ్యులు పుణ్యస్నానాలు ఆచరించారు.

ఇదీ జగన్ మార్కు విధ్వంసం!

- 2019 వరకు అప్పులపై వడ్డీ 4వేల కోట్లు
- జగన్ ఐదేళ్ల అప్పులపై వడ్డీ 11వేల కోట్లు: లోకేశ్

రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్ రెడ్డి సృష్టించిన ఆర్థిక విధ్వంసం అంతా ఇంతా కాదని, అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేశారని మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'జగన్ ఐదేళ్లలో అందినకాడికి అప్పులు చేశారు. 58 ఏళ్ల పాటు అందరు ముఖ్యమంత్రులు కలిపి చేసిన అప్పులపై 2019 నాటికి రూ.14,155 కోట్లు వడ్డీగా చెల్లిస్తుండగా, జగన్ రెడ్డి పాలించిన ఐదేళ్ల కాలానికి అంటే.. 2019-24 మధ్య చేసిన అప్పులపై కట్టాల్సిన వడ్డీనే సుమారు రూ.11 వేల కోట్లుగా ఉంది. 2024 నాటికి రాష్ట్ర ప్రభుత్వం అప్పులపై చెల్లిస్తున్న వడ్డీ రూ.24,944 కోట్లకు చేరింది. అందరు ముఖ్యమంత్రులు చేసిన అప్పులపై కట్టిన వడ్డీ కంటే ఐదేళ్లలో జగన్ రెడ్డి చేసిన అప్పులపై కట్టే వడ్డీనే అధికం. జగన్ రెడ్డి ఎంతటి ఆర్థిక విధ్వంసం సృష్టించారో చెప్పేందుకు ఈ గణాంకాలే నిదర్శనం' అని లోకేశ్ పేర్కొన్నారు.

స్వామికి సేవ చేయడమే తెలుసు!

- శ్రీవారి ఆలయాల నిర్మాణాలకు, సేవకు రూ.కోట్లు వెచ్చించాను
- దేవుడిని అడ్డుపెట్టుకుని సంపాదించడం తెలియదు
- నాపై ఆరోపణలు సరి కాదు
- లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందే!
- టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శేఖర్ రెడ్డి



చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): "స్వామివారి సేవకు సొంతంగా ఖర్చు చేయడమే నాకు తెలుసు. దేవుడిని అడ్డుపెట్టుకుని సంపాదించడం తెలియదు. స్వామివారి ఆలయాలకు, అక్కడ జరిగే సేవలకు ఎన్నో కోట్లు వెచ్చించాను. స్వామి సేవలో ఎలాంటి లోటుపాట్లు కలిగినా సహించలేను. అలాంటిది స్వామివారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపేందుకు నేను సహకరిస్తానా? ఆరోపణలు చేసేటప్పుడు ఒక్కసారి ఆలోచించండి" అని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ఏజే శేఖర్ రెడ్డి హితవు పలికారు. తిరుమల లడ్డూ తయారీ కోసం నాణ్యతలేని నెయ్యి సరఫరా వ్యవహారానికి సంబంధించి మీడియాలోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ తనపై వస్తున్న పరోక్ష ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేసేవారు నిజానిజాలు తెలుసుకుంటే మంచిదని సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "అలిపిరి వద్ద రూ.15 కోట్ల వ్యయంతో గోమందిరం నిర్మించి, దేవస్థానానికి అప్పజెప్పాను. చెన్నైలో పద్మావతి అమ్మవారి ఆలయం, కన్నియాకుమారి, వేలూరు, ఉళుందూరుపేటల్లో శ్రీవారి ఆలయ నిర్మాణాల కోసం నేను వ్యక్తిగతంగా భారీ విరాళాలు ఇవ్వడంతోపాటు, వాటి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నాను. చెన్నై టి.నగర్‌లోనూ స్వామివారి కోసం రూ.150 కోట్లతో ఆలయ విస్తరణ ప్రణాళిక సిద్ధంగా ఉంది. గత 13 ఏళ్లుగా ప్రతిరోజూ స్వామివారి కైంకర్యం కోసం బెంగళూరు నుంచి 20 కిలోల సంపంగి పుష్పాలు ఏర్పాటు చేస్తున్నాను. పవిత్ర హృదయంతో స్వామివారిని సేవించుకోవడమే తప్ప, ఆయన సేవలను అపవిత్రం చేయడం నాకు తెలియదు. టీటీడీ బోర్డు సభ్యుడిగా, చెన్నై ఎల్‌ఏసీ అధ్యక్షుడిగా స్వామివారు కల్పించిన అవకాశాన్ని భక్తుల సేవలకు వినియోగించానే తప్ప, ఎక్కడా దుర్వినియోగానికి పాల్పడలేదు. అలాంటి నాపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరి కాదు. అది ఎంతో పాపం కూడా! ఎక్కడో ఎవరో తప్పు చేస్తే.. ఇప్పుడు పరోక్షంగా నా పేరు స్ఫురణకు వచ్చేలా కథనాలు ప్రచురించడం సబబు కాదు. తిరుమల లడ్డూకు కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాను. స్వామి సేవను అపవిత్రం చేసిన వారిని వదలరాదని ప్రభుత్వానికి, దర్యాప్తు సంస్థలకు విజ్ఞప్తి చేస్తున్నాను" అని శేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

సవరణ

'ఇద్దరు టీటీడీ ముఖ్యులకు లుకౌట్ నోటీసులు!?' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ఒక కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఇందులో... గత పాలక మండలి సభ్యుడొకరు అప్పటి టీటీడీ ముఖ్య అధికారితో సన్నిహితంగా మెలిగి.. నెయ్యి ఒప్పందాలు కుదర్చడంలో కీలక పాత్ర పోషించినట్లుగా ప్రచురితమైంది. ఇద్దరికీ లుకౌట్ నోటీసులు జారీ కానున్నట్లు సమాచారం అందినట్లు కూడా ప్రచురితమైంది. అయితే, ఇది నిజం కాదు. సమాచార లోపం కారణంగా ఈ పొరపాటు జరిగింది. - ఎడిటర్

పిఠాపురంలోనే జనసేన ఆవిర్భావ వేడుకలు

- పీఏసీ నిర్ణయానికి అధినేత పవన్ ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలను మార్చి 14వ తేదీన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురంలో నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. దీనికి పార్టీ అధినేతగా పవన్‌కల్యాణ్ అంగీకారం తెలిపారు. గత సార్వత్రిక ఎన్నికల్లో వంద శాతం స్ట్రైకరేట్‌తో జనసేన పార్టీ విజయబావుటా ఎగుర వేసింది. ఎన్నికల అనంతరం నిర్వహిస్తున్న ఆవిర్భావ సభ కావడంతో ఈ వేడుకలను పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ సందర్భంగా పిఠాపురంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నారు.

అమెరికా వైఖరి అమానుషం: తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ వలసదారులపట్ల అమెరికా ప్రభుత్వ వైఖరి అమానుషంగా ఉందని, ఈ నెల 5వ తేదీన 104 మందిని సంకెళ్లు, గొలుసులు కట్టి అమెరికా సైనిక రవాణా విమానంలో పశువుల కంటే హీనంగా ఇండియాకు తరలించడం గర్హనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుంభమేళా వద్ద 31 మంది, ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో 18 మంది తొక్కిసలాటలో చనిపోవడానికి పరోక్షంగా కారణమైన యూపీ సీఎం, కేంద్ర రైల్వే శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగా, రాయలసీమ, ప్రకాశం తదితర జిల్లాల్లో రబీ సీజన్‌లో ప్రధాన పంట బుడ్డ శనగ దిగుబడి గణనీయంగా తగ్గిందన్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వరా కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని, క్వింటాకు రూ.10వేల చొప్పున కొనాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

వంశీపై అంత ప్రేమ ఎందుకు జగన్?: వర్ల

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనేక కేసుల్లో ముద్దాయి, అసాంఘిక శక్తిగా పేరుగాంచి, మహిళల వ్యక్తిత్వ హననం చేసిన వంశీని జైల్లో పరామర్శించేందుకు జగన్ వెళ్లడం మహిళలను, దళితులను అవమానించడమేనని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. వంశీ పట్ల జగన్ చూపిస్తున్న ప్రేమ వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. జగన్‌కు దళితులంటే చిన్నచూపు అని, అందుకే తన కోసం పనిచేసిన దళిత రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ విజయపాల్ జైలుకు వెళితే ఆయన పరామర్శకు వెళ్లలేదన్నారు.

బీసీల్లో వెలుగులు నింపేది టీడీపీనే

- గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి

బీసీల్లో వెలుగులు నింపేది టీడీపీ, సీఎం చంద్రబాబు మాత్రమేనని, వారికి వెన్నుదన్నుగా ఆదరణ 3.0 పథకం ప్రవేశపెట్టామని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. బీసీలందరూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు.

బడి స్థలాన్ని కబ్జా చేసిన వైసీపీ కార్యకర్త

- పశువుల పాకలో పాఠశాల నిర్వహణ
- టీడీపీ గ్రీవెన్స్ కార్యక్రమంలో ఫిర్యాదు

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని స్వర్ణాంధ్ర నగర్‌లో ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని వైసీపీ కార్యకర్త శ్రీదేవి ఆక్రమించుకోవడంతో పాఠశాలను పక్కనే ఉన్న పశువుల పాకలో నిర్వహిస్తున్నారని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని గుంటూరుకు చెందిన కర్రి యోహోను అనే వ్యక్తి టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజావినతుల కార్యక్రమం జరిగింది. మంత్రి కె.పార్థసారధి, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ప్రజల వినతులు స్వీకరించారు. వైసీపీ నాయకులు చనిపోయిన తన భర్త సంతకాన్ని ఫోర్జరీ చేసి తమ ఇంటి స్థలాన్ని ఆక్రమించుకున్నారని, తనకు న్యాయం చేయాలని చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంకు చెందిన డి.భారతి విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కంభంపాడుకు చెందిన బోడపాటి చంద్రమౌళి.. తనకు 3.39 సెంట్లు భూమి ఉందని, గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన రీసర్వేలో దాన్ని 3.10 సెంట్లకు తగ్గించి నమోదు చేశారని, దీనిపై మళ్లీ రీసర్వే చేసి న్యాయం చేయాలని కోరారు.

ఎన్టీఆర్ జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం!

ఎ.కొండూరులో 3 వేల కోళ్లు మృత్యువాత

- నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిన అధికారులు
- పశ్చిమగోదావరిలో కొనసాగుతున్న కోళ్ల ఖననం

ఎ.కొండూరు, తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలో బర్డ్‌ఫ్లూ లక్షణాలతో 3 వేల కోళ్లు మృత్యువాతపడటం కలకలం రేపింది. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కృష్ణారావుపాలెం గ్రామ శివారు దీప్లానగర్ తండాలోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో 3 వేల కోళ్లు మృతిచెందాయి. పశుసంవర్ధక శాఖ అధికారులు సోమవారం ఆ పౌల్ట్రీ ఫామ్‌ను పరిశీలించారు. చనిపోయిన కోళ్లను పాతిపెట్టించారు. బతికున్న కోళ్ల నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం భోపాల్‌కు పంపించారు.

పెదతాడేపల్లిలో 21 వేల కోళ్ల ఖననం

కాగా, బర్డ్‌ఫ్లూ వెలుగుచూసిన పశ్చిమ గోదావరి జిల్లాలో అధికారులు చర్యలు చేపట్టారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గ్రామంలోని ఒక పౌల్ట్రీ ఫామ్‌లో 21 వేల కోళ్లను సోమవారం ఖననం చేయించారు. పౌల్ట్రీ సమీపంలో పెద్ద గొయ్యి తీయించి అనుమానిత కోళ్లను అందులో వేసి పాతిపెట్టారు. గ్రామంలో సోడియం హైపోక్లోరైడ్ పిచికారి చేయించారు.



పశ్చిమ గోదావరి జిల్లా పెదతాడేపల్లిలో కోళ్లను ఖననం చేసేందుకు తీసుకెళ్తున్న సిబ్బంది

సుప్రీం మార్గదర్శకాల మేరకు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా?

- పోలీస్ స్టేషన్లను పరిశీలించి ఐటీ అధికారికి నివేదిక ఇవ్వండి
- డీఎస్పీలకు హైకోర్టు ఆదేశం
- అదనపు అఫిడవిట్ దాఖలుకు ఉత్తర్వులు



అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా? అని హైకోర్టు ప్రశ్నించింది. పోలీసు స్టేషన్లలో ఏర్పాటు చేసిన కెమెరాలు స్టేషన్ ప్రాంగణం మొత్తం రికార్డయ్యేలా ఏర్పాటు చేశారా? లేదా? అని ఆరా తీసింది. ఈ విషయాన్ని పరిశీలించి రాష్ట్రస్థాయిలో ఐటీ విభాగాన్ని చూసే అధికారికి నివేదిక సమర్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డీఎస్పీలను ఆదేశించింది. సదరు నివేదికను తమ ముందు ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి నిర్వహణ, మరమ్మతులు, సీసీటీవీ స్టోరేజ్ సామర్థ్యం తదితర వివరాలతో సవివరంగా అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 1,392 పోలీస్ స్టేషన్లు ఉండగా 1,001 స్టేషన్లలో మాత్రమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని గుర్తు చేసింది. మిగిలిన స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడానికి కారణాలు ఏమిటి? చెప్పాలని కోరింది. అదేవిధంగా రాష్ట్రంలోని 81 జైళ్లలో 1,226 కెమెరాలు ఏర్పాటు చేయగా, 785 మాత్రమే పనిచేస్తున్నాయని, మిగిలిన సీసీ కెమెరాలు మరమ్మతు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు కనీసం 12 నెలల పాటు ఫుటేజ్‌ను స్టోర్ చేయాల్సి ఉంటుందని, ప్రస్తుతం పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన వ్యవస్థతో ఎన్ని నెలల ఫుటేజ్ స్టోర్ చేయవచ్చో స్పష్టత ఇవ్వాలని కోరింది. పోలీస్ స్టేషన్లలో రికార్డు అయిన ఫుటేజ్‌ను ఎక్కడ స్టోర్ చేస్తున్నారు? మరమ్మతులకు ఎలాంటి విధానాన్ని అనుసరించబోతున్నారో సవివరంగా అదనపు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను మార్చి 10కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్. రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇదీ పిటిషన్

రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2019లో న్యాయవాది తాండవ యోగేశ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ధర్మాసనం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని 2019, జులై 15న ఆదేశాలిచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులు అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని స్పష్టం చేసింది. ఏళ్లు గడుస్తున్నా ఉత్తర్వులు అమలు కాకపోవడంతో పిటిషనర్ కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా పూర్తి వివరాలతో వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేయాలని డీజీపీ, జైళ్లశాఖ డీజీని ధర్మాసనం ఆదేశించింది. పిటిషన్ సోమవారం మరోసారి విచారణకు వచ్చింది. న్యాయవాది తాండవ యోగేశ్ వాదనలు వినిపిస్తూ.. "రాష్ట్రంలోని 391 పోలీస్ స్టేషన్లలో ఇప్పటికీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. దీనికి కారణాలను అఫిడవిట్‌లో పేర్కొనలేదు. ఎంతకాలం పాటు ఫుటేజ్‌ను భద్రపరుస్తున్నారో స్పష్టంగా చెప్పలేదు. సీసీటీవీల నిర్వహణ బాధ్యులు ఎవరో కౌంటర్‌లో స్పష్టం చేయలేదు" అని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) టి. విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ.. "రాష్ట్ర వ్యాప్తంగా లాకప్ ఉన్న పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పోలీసు స్టేషన్లు, జైళ్లలో పనిచేయని కెమెరాలను మరమ్మతు చేయడంతో పాటు వాటి నిర్వహణ బాధ్యతను రెండు ఏజెన్సీలకు అప్పగించారు" అని పేర్కొన్నారు.

తాగునీరు దుర్వినియోగం చేస్తే

5 వేలు జరిమానా!

- బెంగళూరు జలమండలి నిర్ణయం

బెంగళూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభానికి ముందే బెంగళూరులో నీటి సమస్య తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాగునీటి ఎద్దడి నివారణా చర్యల్లో భాగంగా బెంగళూరు జలమండలి సరికొత్త నిర్ణయం తీసుకుంది. తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగిస్తే రూ.5 వేలు జరిమానా వేయాలని నిర్ణయించింది. సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వాహనాలను శుభ్రం చేసేందుకు, రోడ్లు-భవన నిర్మాణ పనులకు తాగునీటిని వినియోగించినా... సినిమా థియేటర్లు, మాల్స్‌లో ఇతర అవసరాలకు వాడినా జరిమానా తప్పదని ఉత్తర్వులలో హెచ్చరించింది.

ప్రజలే ఫస్ట్

వ్యవస్థలు ఇదే విధానంతో పని చేయాలి

- ప్రతి స్కీమ్, కార్యక్రమంపై సంతృప్తి కనిపించాలి
- పాలసీలో తప్పులు ఉంటే సరిదిద్దండి...
- అలసత్వంతో ఉంటే బాధ్యులపై చర్యలు
- పథకాల అమలుపై జిల్లాలకూ రేటింగ్
- నిరంతరం అభిప్రాయ సేకరణ జరపాలి
- వారానికి ఓసారి నాలుగు శాఖలపై సమీక్షిస్తా
- అధికారులకు చంద్రబాబు ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలే ఫస్ట్ అనే విధానంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, దీనికి అనుగుణంగానే అన్ని శాఖల్లో, స్థాయిల్లో అధికారులు ఉద్యోగుల పనితీరు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమం అమలు పట్ల ప్రజల్లో సంతృప్తి కనిపించాలన్నారు. ఏదైనా పాలసీలోనో, అమలులోనో లోపాలు, తప్పులు ఉంటే సరిదిద్దాలన్న ఆయన...అమలులో మాత్రం అలసత్వం, నిర్లక్ష్యం, అవినీతిని సహించబోనని తేల్చిచెప్పారు. శాఖల పనితీరుపై నిరంతరాయంగా సర్వేలు జరిపి నివేదికలు తెప్పిస్తామన్నారు. ప్రజలిచ్చే రేటింగ్ ఆధారంగా వారానికి నాలుగు విభాగాలపై చంద్రబాబు సమీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులోభాగంగా సోమవారం దీపం పథకం, రేషన్ బియ్యం పంపిణీ, ఆర్టీసీ సర్వీసులు, చెత్త నుంచి కంపోస్ట్ తయారీ వంటి కార్యక్రమాలపై ప్రజా స్పందన తీరును సమీక్షించారు. "మొక్కుబడి పనితీరుతో మార్పు రాదు. అనేక కష్టాలు, సవాళ్లను అధిగవించి సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేస్తున్నాం. వీటి ఫలితాలు రావాలంటే వాటి అమలు అత్యంత పారదర్శకంగాను, సమర్థవంతంగాను ఉండాలి. గత ప్రభుత్వానికి మా ప్రభుత్వానికి మధ్య పాలనలో స్పష్టమైన వ్యత్యాసం కనిపించేలా మార్పు వచ్చింనే అభిప్రాయం ప్రజల్లో కలగాలి. ఆ దిశగా అన్ని వ్యవస్థలు పని చేయాలి. అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి. సాధ్యమైనంత ఎక్కువగా టెక్నాలజీ వాడాలి." అని సీఎం సూచించారు. ప్రతి వారం నాలుగు శాఖల్లో పథకాలు, కార్యక్రమాల అమలుపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని దానిపై సమీక్ష చేస్తానని తెలిపారు. ప్రతిశాఖ గాడిన పడాలని, సేవల్లో మార్పు కనిపించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు అయ్యిందని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ప్రతి వ్యవస్థలో, విభాగంలో మార్పు కనిపించాలన్నారు. పథకాలు, కార్యక్రమాల అమలు విషయంలో జిల్లాలవారీగా కూడా ర్యాంకులు ఇస్తామని, వెనుకబడి ఉన్న జిల్లాల కలెక్టర్లు దీనికి అనుగుణంగా పని చేయాలని స్పష్టం చేశారు.

దీపం పథకం: దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల డెలివరీ విషయంలో లబ్ధిదారుల నుంచి అక్కడక్కడా ఫిర్యాదులు రావడంపై చంద్రబాబు అధికారులను వివరణ కోరారు. సిలిండరు డెలివరీ చేసే సమయంలో డబ్బులు అడుగుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డెలివరీలో ఫిర్యాదులు వస్తే ఏజెన్సీపై వేటు వేయాలన్నారు. సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లోగా డబ్బు ఖాతాలో పడటం లేదని కొంత మంది ఫిర్యాదు చేశారని తెలిపారు. ఇందుకు కారణాలు విశ్లేషించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

ఆర్టీసీ సర్వీసులు: ఆర్టీసీ బస్సు సమయానికి బయలుదేరి... నిర్దేశించిన సమయానికి గమ్యానికి చేరుకుందా అనేదానిపై ప్రయాణికుల నుంచి తీసుకున్న ఫీడ్‌బ్యాక్‌పై సమావేశంలో చర్చించారు. ప్రయాణికుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడానికి ప్రతి బస్సులో క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. బస్‌స్టాండ్‌లో మౌలిక సదుపాయాలపై (తాగునీరు, టాయిలెట్లు, కుర్చీలు) ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారని నివేదిక చెప్పగా.. దాన్ని సరిదిద్దాలని సీఎం సూచించారు.

చెత్త నుంచి కంపోస్ట్ తయారీ : పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి కంపోస్ట్ తయారీ కేంద్రాల పనితీరుపై సీఎం ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. 'మీ గ్రామంలో కంపోస్ట్ తయారీ కేంద్రం ఉందా? పని చేస్తోందా? అది ఉపయోగపడుతుందా లేదా?' అనే ప్రశ్నలతో గ్రామస్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. 5,859 గ్రామాల నుంచి ఈ మేరకు సమాచారం తీసుకున్నారు. ఈ కేంద్రాలు మరింత ఎఫెక్టివ్‌గా పని చేయాలని ప్రజలు కోరుకుంటున్నట్లు సర్వే ద్వారా వెల్లడైంది. 2014-19 మధ్య కాలంలో చెత్త నుంచి కంపోస్ట్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఈ కార్యక్రమాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రేషన్ సరుకుల పంపిణీపైనా ఫీడ్ బ్యాక్ ఆధారంగా సమీక్ష జరిపారు. రేషన్ సరుకుల పంపిణీలో తీసుకోవాల్సిన దాని కంటే ఎక్కువ ధర తీసుకుంటున్నారని అక్కడక్కడా లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులను సీఎం ప్రశ్నించారు. రేషన్ వ్యవహారంలో అవినీతి ఉండకూడదని స్పష్టం చేశారు. రేషన్ బియ్యం ఇంటింటికీ సరఫరా పై వస్తున్న ఫిర్యాదులపైనా లోతుగా విచారణ జరపాలని అధికారులను సీఎం ఆదేశించారు.

జీబీఎస్‌ను కట్టడి చేయండి

(మొదటి పేజీ తరువాయి)

వారిపై ఎక్కువగా ప్రభావం చూపుతుంది? వంటి విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న 14 మంది రోగుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వైద్యానికి అవసరమైన మందులు, ఇంజెక్షన్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇంజెక్షన్ల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ.. జీబీఎస్ వైద్యానికి అవసరమైన మందులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. మరో 15 రోజులకు అవసరమైన ఇంజెక్షన్లు ప్రభుత్వాసుపత్రుల్లో, ఏపీఎంఎస్ఐడీసీ నిల్వ పాయింట్లలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. మందులు, ఇంజెక్షన్లకు కొంత మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. చంద్రబాబు వెంటనే స్పందించి ఏపీఎంఎస్ఐడీసీ బిల్లులు విడుదల చేయాలని సీఎంవో అధికారులను ఆదేశించారు. ఏపీఎంఎస్ఐడీసీకి మందులు, సర్జికల్స్ సంబంధించి సీఎఫ్ఎంఎస్‌లో రూ.130 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని వెంటనే విడుదల చేయాలని సీఎం సూచించారు. మందులు, ఇంజెక్షన్ల కొనుగోలుకు నిధులు అవసరమైతే వెంటనే తన ముఖ్య కార్యదర్శి రవిచంద్ర దృష్టికి తీసుకురావాలని ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. జీబీఎస్‌పై ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు నిపుణులైన వైద్యుల సహకారంతో సీఎం చంద్రబాబుకు వివరించారు. జీబీఎస్ వ్యాప్తి చెందకుండా నియంత్రించాలని, వైద్య సదుపాయాలు సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు గుంటూరు జీజీహెచ్‌లో జీబీఎస్‌తో ఓ మహిళ, శ్రీకాకుళంలో బాలుడు, తాజాగా విశాఖలో ఓ వృద్ధురాలు మరణించడంపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.

జీబీఎస్‌పై ఆందోళన వద్దు.. ఔషధాలు అందుబాటులో ఉన్నాయి: సత్యకుమార్

జీబీఎస్ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, అన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో (జీజీహెచ్) తగిన వైద్య సేవలు, ఔషధాలు అందుబాటులో ఉన్నాయని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అమరావతి సచివాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీబీఎస్‌పై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, నిరంతరం సమీక్షలు నిర్వహిస్తోందన్నారు. జీబీఎస్ కేసుల వివరాలను పూర్తి స్థాయిలో విశ్లేషించి, ఈ వ్యాధి వ్యాప్తి చెందడానికి గల కారణాలను గుర్తించాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. ఈ వ్యాధి లక్ష మందిలో ఒకరిద్దరికి మాత్రమే వచ్చే అవకాశం ఉందని, కండరాల బలహీనత, తిమ్మిర్లు రావడం, కాళ్లు చచ్చుబడిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ఎటువంటి చికిత్స అవసరం లేకుండానే 85 శాతం వరకూ ఈ వ్యాధి తగ్గిపోయే అవకాశం ఉందని, మిగిలిన 15 శాతం మందికి మాత్రమే ఇమ్యునో గ్లోబులిన్ ఇంజెక్షన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. గుంటూరు, విశాఖ సహా 6 ఆసుపత్రుల్లో ఎక్కువ కేసులు నమోదయ్యాయని, ఇతర ప్రాంతాల నుంచి అక్కడికి కేసులు రావడమే కారణమన్నారు. ఈ ఏడాది జనవరిలో 43 కేసులు నమోదు కాగా, వారిలో 17 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. ఒక రోగికి రోజుకు ఐదు ఇంజెక్షన్లు చొప్పున ఐదు రోజుల పాటు ఇవ్వాల్సి ఉంటుందని, బహిరంగ మార్కెట్‌లో దాని ఖరీదు దాదాపు రూ.20 వేల వరకూ ఉందని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ఇస్తారని తెలిపారు. వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ 1200 ఇమ్యునో గ్లోబులిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని, మరో 6000 ఇంజెక్షన్లు సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.



జీబీఎస్ వ్యాప్తి నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి సత్యకుమార్

నాపై దుష్ప్రచారం: మంత్రి

తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయాల్లో అదే తనకు చివరి రోజని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. తనకు పది మంది పీఏలు ఉన్నారని, తన అనుచరులు దందాలు చేస్తున్నారని లేనిపోనివి ప్రచారం చేస్తున్నారన్నారు. తనకు ముగ్గురు పీఏలను ఇస్తే ఇప్పటికి తీసుకున్నానని, తాజాగా ఒకరిని నియమించానన్నారు. పని గట్టుకుని తనపై బురద జల్లుతున్నారని విమర్శించారు.

విశాఖలో వృద్ధురాలి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకుల ఆరోపణ
- గుండెపోటు అంటున్న సూపరింటెండెంట్

విశాఖపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్)తో విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న 63 ఏళ్ల వృద్ధురాలు మృతిచెందారు. చికిత్స అందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఆమె మరణించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం మల్లివీడు గ్రామానికి చెందిన రేణుకా మహంతి కాళ్లు, చేతులు లాగేయడం, తీవ్రమైన జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలతో ఈ నెల 6వ తేదీన ఆసుపత్రికి వచ్చారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ఆమె మరణించారు. గత 11 రోజుల్లో ఆమెకు సుమారు పది వరకూ ఇమ్యునో గ్లోబులిన్స్ ఇంజెక్షన్లు ఇవ్వగా, అందులో కేజీహెచ్ నుంచి ఒకటి, రెండు మాత్రమే ఇచ్చారు. మిగిలినవి బయట కొనుగోలు చేసినట్టు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మెరుగైన సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఆమె ప్రాణాలు కోల్పోయారని అంటున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల వరకూ సంబంధిత యూనిట్ ఇన్‌చార్జి రాలేదు. వృద్ధురాలి మృతిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఆమెకు ఛాతీ నొప్పి రావడంతో పరీక్షలు చేయించామని, అదే సమయంలో గుండెపోటు కారణంగా మృతి చెందినట్టు పేర్కొన్నారు.

కరువు మండలాల్లో

మరో 50 'ఉపాధి' పనిదినాలు

- ఒక్కో కుటుంబానికి 150 రోజుల పని
- 5 జిల్లాల్లోని 54 మండలాల్లో అమలు

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రకటించిన కరువు మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద అదనపు పనిదినాల కల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒక్కో కుటుంబానికి ఇప్పటికే లభిస్తున్న వంద పనిదినాలతో పాటు అదనంగా మరో 50 రోజులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ కరువు మండలాలకు సంబంధించిన జిల్లా కలెక్టర్లకు లేఖ రాశారు. దీనిపై ఆయా గ్రామాల్లో ప్రచారం చేయాలని సూచించారు. కరువు మండలాల్లో ప్రతి కుటుంబానికి 150 రోజుల పనిదినాలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్‌లో శ్రీసత్యసాయి, అన్నమయ్య, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు చెందిన 54 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. కేంద్రం కూడా ఆయా మండలాల్లో అదనపు 50 పనిదినాలు కల్పించేందుకు అనుమతి ఇచ్చింది.

నేడు దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమావేశం

- తిరుపతిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మంగళవారం దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమావేశం జరగనుంది. దీనికి ఇక్కడి మానస సరోవర్ హోటల్ వేదికవుతోంది. ఈ సమావేశంలో ప్రధానంగా ఉగ్రవాద మాడ్యూల్ సమస్యలు, వ్యవస్థీకృత నేరాలు, సరిహద్దు దాటిన మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, అక్రమ ఆయుధాలు, తీర ప్రాంత భద్రత, నేరాల గుర్తింపు, నిరోధించడంలో సాంకేతిక వినియోగం వంటి అంశాలపై చర్చించనున్నారు. సంవత్సరానికి రెండుసార్లు జరిగే ఇలాంటి సమన్వయ కమిటీ సమావేశాలు రాష్ట్రాల మధ్య సమన్వయం, నేరాలను నియంత్రించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పోలీసు అధికారి ఒకరు చెప్పారు. గతంలో ఇలాంటి సమావేశం 2021 నవంబరు 14న తిరుపతిలోనే జరిగింది. కాగా, ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు డీజీపీల తరఫున ఆయా రాష్ట్రాల హోం మంత్రిత్వ శాఖల ఉన్నత స్థాయి అధికారులు హాజరవుతారు. పలువురు ప్రతినిధులు సోమవారం రాత్రికే తిరుపతికి చేరుకున్నారు. వీరందరికీ అవసరమైన ఏర్పాట్లను డీఐజీ షిమోషి, ఎస్పీ హర్షవర్ధనరాజు పర్యవేక్షిస్తున్నారు. సమావేశం జరిగే హోటల్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

గుంటూరులో ఎండీఎంఏ డ్రగ్స్ కలకలం!

- 13 గ్రాముల పట్టివేత.. అదుపులో 11 మంది నిందితులు?

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో మరోమారు డ్రగ్స్ కలకలం రేగింది. గతనెల 19న కొకైన్ మత్తు మందు వెలుగు చూడగా.. తాజాగా మిథైలీన్‌డైయోక్సీ- ఎన్- మెథాంఫెటమిన్ (ఎండీఎంఏ) దొరికింది. ఇలా వరుసగా మత్తు మందులు దొరకడంతో స్థానికులు కలవరం చెందుతున్నారు. నిషేధిత ఎండీఎంఏపై సోమవారం సమాచారం అందడంతో గుంటూరు ఎక్సైజ్ శాఖ సిబ్బంది ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో గుంటూరు సమీపంలోని గోరంట్ల వద్ద 10 గ్రాములు, చుట్టుగుంట వద్ద 3 గ్రాములు ఎండీఎంఏ మత్తు మందుతోపాటు ఒక కిలో గంజాయి కలిగి ఉన్న 11 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఎండీఎంఏను ట్యాబ్లెట్ల రూపంలోకి మార్చి ఇక్కడికి తీసుకువచ్చారని అధికారులు గుర్తించినట్టు తెలిసింది. ఇది ఎక్కడ నుంచి వచ్చింది?. దీని వెనక ఎవరెవరు ఉన్నారు? అనే దానిపై ఎక్సైజ్ శాఖ అధికారులు కూపీ లాగుతున్నారు.

పింఛన్ సొమ్ముతో సర్వేయర్ పరార్

- తహసీల్దార్, ఎంపీడీవోకు సచివాలయ సిబ్బంది ఫిర్యాదు

జి.సిగడాం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం పెంట గ్రామ సచివాలయ సర్వేయర్ చదువుల భానుప్రతాప్.. ఈ నెలకు సంబంధించిన రూ.49 వేల పింఛన్ సొమ్ముతో పరారీ అయ్యారు. దీనిపై సచివాలయం సిబ్బంది సోమవారం తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీవో రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. 'సర్వేయర్ భానుప్రతాప్ ఈ నెల 44 మంది లబ్ధిదారుల పింఛన్ల మొత్తం రూ.1.66 లక్షలకుగానూ రూ.1.17 లక్షలు పంపిణీ చేశారు. మిగిలిన రూ.49 వేలతో పరారీ అయ్యారు. లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా సొంతంగా రూ.33 వేలు సర్దుబాటు చేసి పంపిణీ చేశాం' అని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేస్తామని తహసీల్దార్, ఎంపీడీవో తెలిపారు.

పంచాంగకర్త కాశీభొట్ల కన్నుమూత




కాశీభొట్ల కృష్ణ ప్రసాద్ శాస్త్రి

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానం, శ్రీ జగద్గురు దత్తాత్రేయస్వామి మహాసంస్థాన పీఠం, ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం పంచాంగకర్త, ఆస్థాన సిద్ధాంతి కాశీభొట్ల వీరవెంకట నాగేశ్వర కృష్ణప్రసాద్ శాస్త్రి(65) సోమవారం కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాశీభొట్ల వాస్తు శాస్త్రంలో సిద్ధహస్తుడు. జ్యోతిష్య కేసరి, సిద్ధాంత శిరోభూషణ అవార్డులు స్వీకరించారు. ఏలూరు జిల్లా భీమడోలు మండలం పొలసానపల్లికి చెందిన ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఏపీహెచ్‌ఆర్‌డీఏ డీజీగా సిసోడియాకు అదనపు బాధ్యతలు

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఏపీహెచ్‌ఆర్‌డీఏ) డైరెక్టర్ జనరల్‌గా ఆర్‌పీ సిసోడియాకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా ఆయన హెచ్‌ఆర్‌డీఏ డీజీగా పని చేశారు. కొత్త అధికారిని నియమించే వరకూ హెచ్‌ఆర్‌డీఏ విభాగం బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

'విచిత్రాల వీధులు'కు సీఎం అభినందన



తిరుపతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని స్కావెంజర్స్ కాలనీని రంగుల శోభతో రూపుమార్చిన కార్పొరేషన్ అధికారులను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు అభినందించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో "వి'చిత్రాల' వీధులు" శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఎక్స్ వేదికగా స్పందించారు. ఆ కథనాన్ని పోస్ట్ చేస్తూ మార్పునకు కారణమైన కమిషనర్ మౌర్య, మున్సిపల్ అధికారులను సీఎం అభినందించారు. 'స్వచ్ఛాంధ్ర మన లక్ష్యం.. ఆ దిశగా సాగాలి మన ప్రయాణం' అని పిలుపునిచ్చారు. గోడలపై రంగులు, అద్భుతమైన చిత్రాలతో కాలనీ రూపురేఖలు మార్చారని, కొత్త జీవం పోశారని మంత్రి లోకేశ్ ప్రశంసించారు. స్వచ్ఛాంధ్ర మన లక్ష్యమని, ఆ దిశగా ముందుకు సాగుదామని అన్నారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల గురుకుల సంక్షేమ పాఠశాలల్లో 2025-26కి గాను 6,600 సీట్లతో ఐదో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు మార్చి 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 2024-05లో నాలుగో తరగతి చదువుతున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఏ జిల్లాలో దరఖాస్తు చేస్తే, విద్యార్థులు ఆయా జిల్లాల్లో చదువుతూ ఉండాలి. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు 11 ఏళ్ల లోపు, ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు 12 ఏళ్ల లోపు ఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష మించి ఉండకూడదు. పూర్తి వివరాల కోసం https://mjpapbcwreis.apcfss.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

27న ఉద్యోగ, ఉపాధ్యాయులకు స్పెషల్ సీఎల్

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పోలింగ్ రోజున(ఈ నెల 27) స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా విధులకు ఆలస్యంగా వచ్చేందుకు, లేదా పోలింగ్ సమయంలో ఓటు హక్కు వినియోగించుకుని విధులకు హాజరయ్యేలా షిఫ్టులను సర్దుబాటు చేయాలని సీఈవో మరో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇమామ్, మౌజన్ల వేతనాలకు 45 కోట్లు విడుదల

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): 2024-25వ ఆర్థిక సంవత్సరంలో ఇమామ్, మౌజన్లకు అందాల్సిన గౌరవ వేతనాల నిధుల్లో 6 నెలలకు గాను రూ.45 వేల కోట్లు వక్ఫ్ బోర్డుకు విడుదల చేయాలని మైనార్టీ వెల్ఫేర్ కమిషనర్‌కు సూచిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రంజాన్ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇమామ్, మౌజన్లకు శుభవార్త తెలిపిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని.. ఇమామ్‌లకు నెలకు రూ.10 వేలు, మౌజన్లకు నెలకు రూ.5వేలు చొప్పున అందించనున్నట్లు తెలిపారు. తద్వారా రాష్ట్రంలోని 5వేల మంది మసీదుల్లో ఉన్న ఒక్కో ఇమామ్‌కు రూ.60వేలు, మౌజన్లకు రూ.30వేల చొప్పున అందుతాయన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.